వాలెట్ గత వారంరోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital



నెలాఖరుకల్లా బిజెపి జాతీయ అధ్యక్షుని ఎన్నిక

ధోలాఘాట్‌లో సిలిండర్ పేలి ఏడుగురి మృతి 5



Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

2-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 60 పేజీలు: 8+16 వెల: 6.50


## ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్

### నేడు హస్తినలో బిసి సంఘాల మహాధర్నా


### పాల్గొననున్న రాహుల్, రేవంత్ ప్రభృతులు

### పలువురు అఖిలపక్ష నేతలు సైతం ఢిల్లీకి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్1:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. మంగళవారం సాయంత్రం ఆయన బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు. బుధవారం జంతర్ మంతర్ వద్ద 12 బిసి సంఘాల ఆధ్వర్యంలో జరగబోయే మహాధర్నాలో సిఎం, మంత్రులు, ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీలు పాల్గొననున్నారు. విద్య,ఉపాధి,స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అయితే ఆ బిల్లులను పార్లమెంట్ ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బిసి సంఘాలుమహాధర్నాకు సిద్ధమయ్యాయి. ఈ ధర్నాలో బిఎస్పీ, కాంగ్రెస్, బిఆర్ఎస్ తదితర పార్టీల నేతలు పాల్గొననున్నారు. ఈ మేరకు ధర్నాలో పాల్గొనేందుకు అఖిలపక్ష పార్టీల నాయకులు సైతం ఢిల్లీకి వెళుతున్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా,

>>2



మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో డి.సిఎం భట్టి

## ఒక్క ఇంచైనా గుంజుకోలేదు..

### 400 ఎకరాల భూమి హెచ్‌సియుది కాదు..

### ప్రజలకు సంపద సృష్టించడానికి ఈ భూమిని టిజిఐఐసికి అప్పగించాం

### ప్రైవేటు వ్యక్తి చేతుల్లోని భూమిని కాపాడి ప్రజలకు ఆస్తిగా సమకూర్చాం

### రెవెన్యూ డాక్యుమెంట్లు విడుదల చేసిన డి.సిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఏప్రిల్1:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన ఇంచు భూమిని కూడా ప్రజా ప్రభుత్వం గుంజు కోలేదు. కంచగచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించింది కాదు. ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతమైన రాష్ట్రసంపదను న్యాయస్థానంలో పోరాడి విజయం సాధించి తిరిగి ప్రజలకు ఆస్తిగా ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు దుదిల్ల శ్రీధర్ బాబు,పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించిన 534.28 ఎకరాల భూమిని 2004 ఫిబ్రవరి 03న రెవిన్యూ అధికారులకు అప్పగించగా, వారు గోపన్‌పల్లి గ్రామంలోనిసర్వేనెంబర్ 36లో 191.36 ఎకరాలు సర్వేనెంబర్ 37లో 205.20ఎకరాలను (397 ఎకరాలు) హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించి భూ బదలాయింపు చేసుకున్నారని భూ బదలాయింపు జరిగినట్లుగా అప్పటి రెవెన్యూ డాక్యుమెంట్లను మీడియాకు విడుదల చేశారు. ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం కంచ

>>2

ఢిల్లీకి చేరిన హెచ్‌సియు భూముల పంచాయితి 2



### నేటి నుంచి జెఇఇ మెయిన్

## రెండో విడత పరీక్షలు

### 17న ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** దేశంలోని ఎన్ఐటిలు, త్రిపుల్ ఐటీల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీ కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) -2025 మెయిన్ రెండో విడత పరీక్షలు నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్9 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షల ఫలితాలను

>>2



### బాణాసంచా ఫ్యాక్టరీలో

## భారీ పేలుడు

### 18 మంది మృతి

### పలువురికి తీవ్ర గాయాలు

**అహ్మదాబాద్, ఏప్రిల్ 1:** గుజరాత్‌లోని దీశాలోని ధువరోడ్డులో ఉన్న గోదాములో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 18 మంది సిబ్బంది చనిపోయారు. దీశా మున్సిపల్ పరిధిలోని అగ్నిమాపక సిబ్బంది 108 అంబులెన్సులు ఆప్రాంతానికి చేరుకుని రక్షణ చర్యలుచేపట్టాయి.గన్‌పౌడర్ ఫ్యాక్టరీలో ఈ భారీ అగ్నిప్రమాదంచోటుచేసుకుంది. శక్తివంతమైన పేలుడు కావడంతో సమీపంలోని గోదాము కూలిపోయింది.

>>2

## భారత్‌కు చిలీ ఓ ముఖ్య భాగస్వామి

### ఆయుర్వేదం, సంప్రదాయ వైద్య విధానాలపై పరస్పర సహకారం

### చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్‌తో ప్రధాని మోడీ చర్చలు



న్యూఢిల్లీలో మంగళవారం ప్రధాని మోడీతో చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** చిలీని అంటార్కిటికాకు గేట్‌వేగా చూస్తున్నామని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భారత పర్యటనకు విచ్చేసిన చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్‌తో ప్రధాని భేటీ అఆయ్యారు. ఆర్థిక, వాణిజ్య, సామాజిక రంగాలతో సహా వివిధ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం మోడీ మాట్లాడుతూ లాటిన్ అమెరికాలో చిలీ భారత్‌కు ఓ ముఖ్యమైన భాగస్వామి అని పేర్కొన్నారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభించామని వాటిని కొనసాగించాలన్నారు. ఆయుర్వేదం, సంప్రదాయ మెడిసిన్, వ్యవసాయ ఉత్పత్తుల సహకారంపై ఒప్పందాలు ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. భారత్, చిలీల మధ్య ఎన్నో సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని పేర్కొన్నారు. సమకాలీన సవాళ్లను సమర్థవంతంగా పరిష్కరించడానికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఇతర ప్రపంచ సంస్థలలో సంస్కరణలు అవసరమని భావిస్తున్నామని అంతర్జాతీయ ఉద్రిక్తతలు, వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి పిలుపునిచ్చామని తెలిపారు. గాబ్రియేల్ మాట్లాడుతూ భారత్ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య బంధాలు మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని అన్నారు. పరస్పరం సాంస్కృతిక సహకారం అందించుకుంటామని

>>2

## రేషన్‌లో సన్న బియ్యం దేశంలోనే ఫస్ట్

### మొత్తం 2.91 లక్షల కుటుంబాలకు పంపిణి

### సన్నధాన్యం క్వింటాలుకు అదనంగా రూ. 500: మంత్రి పొన్నం ప్రభాకర్




మంగళవారం సిరిసిల్లలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి పొన్నం

**సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ దేశంలోనే ప్రథమమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద ఉన్న రేషన్ దుకాణంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీ గితే తో కలిసి మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సన్న బియ్యాన్ని మంత్రి, విప్, కలెక్టర్, ఎస్పీ తదితరులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని రేషన్ లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది రోజున ప్రారంభించారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు రాష్ట్రంలోని 17,263 రేషన్ దుకాణాల్లో రెండు లక్షల 91 కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు సన్న బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేస్తుందని వివరించారు. అలాగే సోలార్ యూనిట్లు మహిళా సంఘాలకు బస్సులు పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. సన్న ధాన్యం పండించే రైతులకు క్వింటాలుకు అదనంగా 500 అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీకి నూతన బస్సులు అందజేస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందజేస్తున్నామని వివరించారు.

జిల్లాలోని 345 రేషన్ దుకాణాలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సోషియో ఎకనామిక్ సర్వే ను ఇటీవల నిర్వహించిందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని నేత కార్మికులకు భరోసా కల్పిస్తూ గత బకాయిలను విడుదల చేసిందని, అలాగే యార్న్ బ్యాంకును ప్రారంభించిందని వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. దాదాపు 20వేల కోట్ల రూపాయల రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందని వెల్లడించారు. త్వరలో పెన్షన్ పంపిణీ ఇతర కార్యక్రమాలను ప్రారంభించనున్నామని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందని ప్రకటించారు. జిల్లాలోని 345 రేషన్ దుకాణాలు ద్వారా లక్ష 70 వేల రేషన్ కార్డుల లబ్ధిదారులకు 3275 మెట్రిక్ టన్నులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ స్వరూప తిరుపతి రెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి పౌర సరఫరాల మేనేజర్ రజిత, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు గడ్డం నర్సయ్య, మ్యాన ప్రసాద్, వైద్య శివప్రసాద్, కాముని వనిత, మడుపు శ్రీదేవి, కల్లూరి చందన, గోలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


## లక్షకు చేరువలో పసిడి

### ఇప్పటికే దాటేసిన వెండి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. రోజురోజుకూ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు రికార్డులు నమోదుచేస్తున్నాయి. రాజధాని ఢిల్లీలో తాజాగా 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 94,150కి చేరింది. దేశీయంగా పసిడిధరలు ఈస్థాయికి రావడం ఇదే తొలిసారి. అంతకుముందు వారాంతంలో 99.9 స్వచ్ఛత కలిగిన బంగారం ధరలు రూ.92,150 వద్ద ఉంటే మరో రెండువేలు తాజాగా పెరిగింది. ఈక్విటీతో పోలిస్తే ప్రత్యామ్నాయంగా పెట్టుబడులకు బంగారం భావిస్తుండటంతో అంతర్జాతీయంగా డిమాండ్‌పెరిగింది.ఈ ఏడాదిలో ఇప్పటివరకూ బంగారంధర సుమారు 18 శాతం పెరిగింది.జనవరి ఒకటిన రూ.79,390గా ఉన్న పసిడి సుమారు రూ.15 వేలు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్‌గోల్డ్‌ధర ఔన్స్ 3149 డాలర్లకు చేరడంతో దేశీయంగా అదేస్థాయిలో పెరుగుతోంది. మరోవైపు వెండిధర

>>2



## ఐపిఎల్ టిక్కెట్లపై విజిలెన్స్ విచారణ

### వెనక్కి తగ్గిన హెచ్‌సిఎ.. స్టేడియం ముట్టడికి కాంగ్రెస్ పిలుపు

**ఉప్పల్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ మధ్య జరుగుతున్న ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ టిక్కెట్ల వ్యవహారంపై విజిలెన్స్ విచారణ మొదలైంది. మంగళవారం మధ్యాహ్నం విజిలెన్స్ చీఫ్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పలువురు అధికారులు స్టేడియంలో విచారణ చేపట్టారు. హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఇతర సిబ్బందిని విచారించినట్లు సమాచారం. టిక్కెట్ల అమ్మకం, కాంప్లమెంటరీ పాసులజారీ తదితర అంశాలపై విజిలెన్స్ అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా టిక్కెట్లు, ఉచిత పాసుల కోసం హెచ్‌సిఏ తమను ఇబ్బంది పెడుతుందని సన్‌రైజర్స్ ఆరోపణల నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో విచారణకు ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో వాస్తవాలు రాబట్టేందుకు విజిలెన్స్ అధికారులు మంగళవారం రంగంలోకిదిగారు. కాగాగతంలోనే హెచ్‌సిఏలో అనేక అక్రమాలు జరుగుతున్నాయంటూ గత ఏడాది సెప్టెంబరు 18న భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు సోదాలుచేశారు. ఉప్పల్‌స్టేడియంలో నిర్వహించే అంతర్జాతీయ మ్యాచ్‌లకు రవాణా, క్యాటరింగ్ కాంట్రాక్టలు ఇవ్వడంలో కొందరు హెచ్‌సిఏసభ్యులు అవకతవకలకు పాల్పడినట్లు అప్పట్లో కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సంబంధిత పత్రాలు విజిలెన్స్ అధికారులకు అందజేసినట్లు తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్‌రైజర్స్ వివాదంపై ఉప్పల్ స్టేడియంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. సన్‌రైజర్స్, హెచ్‌సిఉఏ మధ్య జరిగిన ఈమెయిల్స్‌ను అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఐపిఎల్‌కు ముందు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాలపై విచారణ చేసినట్లు సమాచారం. గత రెండు సంవత్సరాలుగా హెచ్‌సిఏ చేపడుతున్న స్టేడియం మరమ్మతులపపై కూడా విచారణ చేసినట్లు సమాచారం. హెచ్‌సిఏ,సన్‌రైజర్స్‌కు మధ్య జరిగిన ఒప్పంద పత్రాలను కూడా అధికారులు పరిశీలించినట్లు పేర్కొంటున్నారు. కాగావిజిలెన్స్ డిజి కొత్తకోట

>>2

## గండాల గుండంలో శ్రీశైల 'సొరంగం'





### అడుగడుగునా అవాంతరాలు..

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం మార్గంలో చిక్కుకుపోయిన మిగిలిన వారి జాడ కోసం మండలం రోజులుగా అన్వేషణ కొనసాగుతోంది మరోవైపు శ్రీశైలం నుంచి గ్రావిటీ ద్వారా నల్లగొండ జిల్లాకు నీటిని తరలించాలనే నాలుగుదశాబ్దాల కల జూన్ 2026 నాటికి సాకారం అవుతుందా అనే అనిశ్చితి నెలకొంది. సొరంగం తవ్వాల్సిన 9.6 కి.మి నిడివి మార్గంలో ఇంకా నాలుగు అత్యంత ప్రమాదకరమైన షీర్ జోన్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ముందు ముందు సొరంగ మార్గంలో ఎదురయ్యే షీర్‌జోన్‌లో కార్మికులు దినదినగండం నూరెళ్ళు ఆయుష్షుఅన్నట్లు క్షణక్షణం ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గంలో మొత్తంగా 11 షీర్ జోన్లు ఉండగా, ఇప్పటికే 6 జోన్లను దాటి పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రమాదం సంభవించిన జోన్ బైపాస్ చేసినా మిగితా నాలుగు జోన్‌ల గండం గట్టెక్కడం కత్తిమీద సాములాంటిదే. దేశంలో అత్యంత పెద్దదైన ఈ సొరంగ మార్గంకు ఆడిట్లు,అవుట్‌లెట్లు లేవు. ఒకే మార్గం నుంచి రావడం పోవడం జరుపాల్సి ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 826 అడుగుల ఎత్తులో నుంచి నాలుగువేల క్యూసెక్కుల సామర్థ్యంతో నీటిని తరలించడానికి 43.931కిమి నిడివితో సొరంగమార్గం తవ్వకానికి జలయజ్ఞంలో భాగంగా ఆనాటి వైఎస్ఆర్ ప్రభుత్వం పనులు చేపట్టింది. 2005 ఆగస్టు 25న జయప్రకాశ్ అసోసియేట్స్

>>2

### 6 సార్లు గడువు పొడిగించినా అనిశ్చితే..

### ప్రమాదకర ప్రదేశాలు ఇంకా నాలుగు

### 2026 జూన్‌కైనా పూర్తయ్యేనా?

# రైల్ రోకో కేసు కొట్టి వేయాలని కెసిఆర్ పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఎప్రిల్1:** తెలంగాణ ఉద్యమం సందర్భంగా చేసిన రైల్‌రోకో ఘటనకు సంబంధించి నమోదైన కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. 2011 అక్టోబర్ 15న ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగంగా సికింద్రాబాద్‌లో రైల్‌రోకో చేపట్టారు. ఆ సమయంలో కేసు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు ప్రస్తుతం ప్రజాప్రతినిధుల కోర్టులో పెండింగ్‌లో ఉంది. కేసీఆర్ పిలుపు మేరకే రైల్‌రోకో చేపట్టారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. అయితే రైల్‌రోకో జరిగిన సమయంలో అక్కడ కేసీఆర్‌లేరని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికితీసుకెళ్లారు. వాదనలు విన్న న్యాయస్థానం ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యక్తికి నోటీసులివ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

## లక్షకు చేరువలో పసిడి

>> మాత్రం కాస్త తగ్గుముఖం పట్టింది. శుక్రవారం కిలో వెండి ఢిల్లీలో రూ.1,03,000గా ఉటే మంగళవారం రూ. 500తగ్గి 1,02,500కి చేరింది. అమెరికా భాగస్వామ్య దేశాలపై బుధవారంనుంచి ప్రతీకార సుంకాలు అమలుకు ట్రంప్ ప్రకటించడంతో ఆయా దేశాలు కూడా సుంకాలు ప్రారంబించే యోచనలో ఉన్నాయి. దీనివల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థకు పెనుముప్పు తప్పదని అందుకే సురక్షిత పెట్టుబడి స్థావరంగా బంగారం వైపు ఇన్వెస్టర్లు పరుగులు తీస్తున్నట్లు ఆర్థికరంగ నిపుణులు అంచనావేస్తున్నారు.

## ఓ ముఖ్య భాగస్వామి

>> అన్నారు. 'షూట్ ఇన్ చిలీ ' ప్రోగ్రామ్ ద్వారా భారత చిత్రపరిశ్రమతో కలిసి పని చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయిదురోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి వచ్చిన చిలీ అధ్యక్షుడు రాజ్ ఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. అనంతరం హైదరాబాద్‌హౌస్‌లో ప్రధాని మోడీతో చర్చల్లో పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ఆయన ఆగ్రా, ముంబయి, బెంగళూరుకు వెళ్లనున్నట్లు అధికారి వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేయనున్న విందులో చిలీ అధ్యక్షుడు పాల్గొననున్నట్లు సమాచారం.

## వారం - వర్జ్యం

తేది : 02-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల పంచమి రా.11.54
కృత్తిక ఉ.8.51
వర్జ్యం రా.11.39-1.09
దు.ఉ.11.47 - మ.12.36
శుభసమయం : ఉ.9.25 - 10.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృషభం :** సంఘంలో గౌరవం పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. దైవదర్శనాలు.

**మిథునం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**కన్య :** ఆర్థిక లావాదేవీలలో ఆటుపోట్లు ఎదురైన అధిగమిస్తారు. చేపట్టిన పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**తుల :** బంధువులతో ఏర్పడిన తగాదాలు పరిష్కారించుకుంటారు. విలువైన పత్రాలు జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**ధనుస్సు:** కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** శుభకార్యాలలో పాల్గొంటారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. వస్తులాభం.

**కుంభం:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు.

**మీనం:** ఉద్యోగులకు బదిలీలు వుంటాయి. పనులలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



న్యూఢిల్లీలో మంగళవారం విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమైన చిలీ రిపబ్లిక్ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్ ఫాంట్

## టిక్కెట్లపై విజిలెన్స్ విచారణ

>> శ్రీనివాస్‌రెడ్డి ఉప్పల్ స్టేడియంలోనే ఉండి పలువురు ఆఫీస్ బేరర్లు, సన్‌రైజర్స్ ప్రతినిధులతో చర్చించినట్లు సమాచారం. తమిళనాడుకు చెందిన సన్ నెట్‌వర్క్ యజమాన్యంలోని సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ ఐపిఎల్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి హైదరాబాద్‌ను తమ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుని ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌లో ఆడతుంది. అయితే ఐపిఎల్ సమయంలో ఉప్పల్ స్టేడియాన్ని అద్దెకు తీసుకుంది. ఇందుకు ప్రతి మ్యాచ్‌కు హెచ్‌సిఏకు రూ.కోటి అద్దె రూపంలో ఇస్తున్నారు. ఐపిఎల్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలను సన్‌రైజర్స్ ఫ్రాంచైజీ చూసుకుంటుంది. స్టేడియంలో సుమారు 39వేల సీటింగ్ కేపాసిటి ఉండగా, అందులో పది శాతం అంటే 3900 టిక్కెట్లు కాంప్లమెంటరీ పాసుల రూపంలో హెచ్‌సిఏకు ఇస్తుంది. దీంతోపాటు మరో 2500 టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడంతోనే వివాదం మొదలైంది. సన్‌రైజర్స్, హెచ్‌సిఏ మధ్య సమస్యల పరిష్కారానికి మంగళవారం సన్‌రైజర్స్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్, సురేష్‌లతో హెచ్‌సిఏ కార్యదర్శి ఆర్.దేవరాజ్ బేటి అయ్యారు. కాగా బుధవారం ఐపిఎల్ మ్యాచ్ టిక్కెట్లు విక్రయాల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియం ముట్టడికి పిలుపు ఇచ్చారు. దీంతో స్టేడియం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఢిల్లీకి వెళ్లిన సిఎం రేవంత్

>> పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనున్న సందర్భంగా తెలంగాణ ఎంపిలకు సిఎం రేవంత్‌రెడ్డి మద్దతు తెలిపే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. మహాధర్నా అనంతరం కేంద్రమంత్రులు, జాతీయపార్టీ నేతలను కలిసి బిసి రిజర్వేషన్‌ల పెంపు చట్టానికి మద్ధతు తెలపాలని తెలంగాణ మంత్రుల బృందం విజ్ఞప్తి చేయనుంది. దీంతోపాటు త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో ఈ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలో కొలిక్కి వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వాకిటి శ్రీహరి, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాగూర్, ప్రకాశ్‌గౌడ్, ఈర్లపల్లి శంకరయ్య, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌లు సైతం ఢిల్లీకి వెళ్లారు.

**బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించాలని డిమాండ్**

తెలంగాణ రాష్ట్రంలోని బిసిలకు విద్య, ఉద్యోగాలతోపాటు రాజకీయ రంగంలోనూ 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు(బుధవారం) ఢిల్లీలో మహాధర్నాను నిర్వహించనున్నారు. మహాధర్నాలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు. పార్టీలకి అతీతంగా ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం మహాధర్నాలో పాల్గొననున్నారు. ధర్నాలో రాష్ట్రంలో ప్రాతినిధ్యంలో ఉన్న బిసి సంఘాలన్నీ కూడా సంయుక్తంగా పాల్గొంటున్నాయి. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లోనూ ఆమోదించి.. చట్టం చేసేలా చూడాలని బిసి సంఘాలు, బిసి నేతలు డిమాండ్ చేస్తూ మహాధర్నాను నిర్వహిస్తున్నారు. తెలంగాణలో బిసిల రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ శాసనసభ ఆమోదించిన బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న బిసి సంక్షేమ సంఘాలు ఢిల్లీలో మహాధర్నాకి పిలుపునిచ్చిన నేపథ్యంలో మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతోపాటు బిసి ఎమ్మెల్యేలు పాల్గొని సంఘీభావం తెలపనున్నారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ బిసి ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మక్కన్ సింగ్ రాజ్‌ఠాకూర్, వాకిటి శ్రీహరి, ఈర్లపల్లి శంకరయ్యతోపాటు అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు మహాధర్నాలో పాల్గొననున్నారు.



మంగళవారం హెచ్‌సియు గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

### భూముల రక్షణ కోసం కదం తొక్కిన

## సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు

### వర్సిటీలో భారీ ర్యాలీ.. ఆందోళన

### మద్దుతుగా ఛలో హెచ్‌సియుకు వచ్చిన నాయకుల అరెస్టు

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** హైదారాబాద్ సెంట్రల్ యూనివర్సీటీ భూముల వ్యవహారం రోజురోజుకు హీటెక్కుతోంది. వర్సిటీ భూముల పరిరక్షణ కోసం విద్యార్థి లోకం కదంతొక్కింది. ఓ వైపు విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతుంటే.. మరోవైపు వర్సీటీ భూముల్లో పచ్చదనాన్ని పెకలిస్తూ జేసీబీలు పనిచేస్తున్నాయి. దీంతో తమ యూనివర్సీటీ భూముల వేలాన్ని అడ్డుకునేందుకు విద్యార్థులు చేపట్టినాందోళనలు ఉగ్రరూపం దాల్చింది. మంగళవారం యూనివర్సీటీలో తరగతులను బహిష్కరించిన విద్యార్థులు వర్సీటీలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనవర్సీటి మేయిన్ గేట్ వద్దకు చేరుకుని దర్నాకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకోవడం కోసం విశ్వవిద్యాలయం భూములు అమ్ముకుంటుందని, భూములను అమ్ముకుంటూ పోతే వర్సీటీ భవిష్యత్తులో మిగలదని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసనలు తెలిపారు. యూనివర్సీటీ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా పలు రాజకీయ,ప్రజాసంఘాలు ఛలో హెచ్‌సీయూకు పిలుపునిచ్చాయి. కాగా వర్సీటీ వద్దకు చేరుకున్న నాయకులను,ప్రజాసంఘాలను పోలీసులు అరెస్ట్‌చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. యూనివర్సీటీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వర్సీటీలో తరగతులను బహిష్కరించారు. వర్సీటీ లోపలి నుంచి ప్రధాన గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. వర్సీటీ గేట్ ముందుకు బైఠాయించి ఆందోళన చేపట్టగా పోలీసులు అడ్డుకున్నారు. సెంట్రల్ యూనివర్సీటీ విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా మంగళవారం పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఛలో సెంట్రల్ యూనివర్సీటీకి పిలుపునిచ్చారు. విద్యార్థుల ఆందోళనలో పాల్గొనేందుకు బీజేవైఎం రాష్ట్ర అద్యక్షులు సెవెళ్ల మహేందర్ ఆధ్వర్యంలో యువనాయకులు భారీగా యూనివర్సీటీకి చేరుకుని విద్యార్థులకు మద్దతు తెలిపారు. విద్యార్థులతో కలిసి బైఠాయించిన వారిని పోలీసులు అరెస్ట్‌చేశారు. సీపీయం నాయకులు సైతం భారీ ఎత్తున వర్సీటీకి చేరుకుని విద్యార్థుల ఆందోళనలో పాల్గొనగా పోలీసులు వారిని అరెస్ట్‌చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

# గుండంలో శ్రీశైల 'సొరంగం'

>> సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. నాలుగేళ్ళలో పూర్తిచేయాల్సిన ఈ పనులు రెండు దశాబ్దాలుగా కొనసాగుతోన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు పనులు మొదలు పెట్టిననాటి నుంచి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి,. టన్నెల్ బోరింగ్ మిషన్ చెడిపోవడం, శ్రీశైలానికి భారీ వరద వచ్చినప్పుడు నీరంతా సొరంగ మార్గంలోకి వెళ్ళి పనిచేయకుండా పోవడం, విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్‌సరఫరా నిలిపివేయడం వంటి సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. దేశంలోనే అతిపెద్ద ఎస్ఎల్‌బిసి సొరంగం ఇప్పటి వరకు ఆరు షీర్‌జోన్ లు అధిమించింది. ఏడో షీర్ జోన్‌వద్ద ఫిబవరి 22న పెను ప్రమాదం సంభవించి ఎనిమిది మంది అందులో చిక్కుపోయారు. ఇప్పటి వరకు రెండు మృతదేహాలు వెలికితీశారు. ఎస్ఎల్‌బిసి సొరంగంలో చిక్కుకున్న మిగిలిన వారి జాడ కోసం నిత్యాన్వేషణ కొనసాగుతోంది. అత్యంత క్లిష్టతరమైన పరిస్థితుల నడుమ సహాయక బృందాలు సొరంగంలో చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు రేయింబవళ్లూ శ్రమిస్తున్నాయి.. దేశంలో సొరంగాల్లో ఎన్నో రకాల ప్రమాదాలు జరిగినా ఎస్ఎల్‌బిసి తరహా ప్రమాదం ఎక్కడా జరగలేదని నిపుణులు చెబుతున్నారు. అన్ని సొరంగాలకు ఆడిట్లు, అవుట్‌లెట్లు సహా వివిధ మార్గాల ద్వారా సొరంగంలోకి గాలి, వెలుతురు, ఆక్సిజన్ అందుతాయి. శ్రీశైలం అభయారణ్యంలో సొరంగమార్గంలో సొరంగ మార్గం తవ్వకాని అనుమతి అతికష్టంగా లభించింది. తరువాత దీనిని రాజీవ్ టైగర్ జోన్‌గా ప్రకటించడంతో ఆడిట్లు, అవుట్‌లెట్లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదు. దీనితో ఎస్ఎల్‌బిసి సొరంగంలోకి వెళ్లేందుకు బయటకు వచ్చేందుకు ఒక్కటే మార్గం ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో సహాయక చర్యలు చేపట్టడం కష్టతరమవుతోంది. దేశంలో తవ్విన అనేక సొరంగాలకు అడిట్లు, అవుట్‌లెట్లు ఉండటంతో సహాక చర్యలు ఎంత కష్టంలోనైనా త్వరగా చేసే వెసులుబాటు వుండేది. ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గంలో ఈ షీర్ జోన్ అదిగమించడానికి బైపాస్ రూపొందించాలని ప్రభుత్వం భావిస్తున్నది. భవిష్యత్ తవ్వకాలలో మిగితా షీర్ జోన్ విషయంలో ఎలా ముందుకు పోతుందని అంతా సర్వత్రా నెలకొంది. శ్రీశైలం ఎడమ గట్టుకాలువ సొరంగం నిర్మాణ మార్గంలో ఆ నాలుగు షీర్ జోన్లు అత్యంత ప్రమాదరకరంగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ఇవి పనులకు అత్యంత ఇబ్బందికరంగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. దీంతో మిగతా సొరంగమార్గం నిర్మాణంపై సందిగ్ధం నెలకొన్నది. 2005లో ఎస్ఎల్‌బీసీ అలైన్‌మెంట్ సమయంలోనే సొరంగ నిర్మాణ మార్గంలో మొత్తంగా 11 షీర్ జోన్లను గుర్తించినట్టు అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు ఇన్‌లెట్, ఔట్‌లెట్ మొత్తంగా కలిపి 6 షీర్ జోన్లను దాటుకుని సొరంగ నిర్మాణం కొనసాగించిచారు. ప్రస్తుతం ప్రమాదం సంభవించిన ప్రాంతంలో షీర్ జోన్ 8 నుంచి 15 మీటర్ల వరకు విస్తరించి ఉండగా, రాబోయే జోన్లు 20నుంచి 50 మీటర్ల వరకు విస్తరించి ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూలిన సొరంగం ప్రాంతంలో శిథిలాలను తొలగించి తవ్వకం పనులను పునరుద్ధరించినా, దాని పక్కనే మరో బైపాస్ వేసినా మిగితా నిడివిలో తవ్వకాలు అత్యంత ప్రమాదకంతోకూడినవని అధికారవర్గాలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఒక్క ఇంచైనా గుంజుకోలేదు..

>> గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమిని బిల్లీ రావు ప్రాతినిధ్యం వహించిన ఐఎంజి ఫ్లోరిడాకు చెందిన ఐఎంజి భారత్ అనే క్రీడా నిర్వహణ సంస్థకు కేటాయించారని, ప్రభుత్వం ఒప్పందం మేరకు ఆ భూమిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకపోవడంతో రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజా శ్రేయస్సుకు వ్యతిరేకంగా కోట్లాది విలువైన 400 ఎకరాల భూమిని ఐఎంజి భారత్‌కు కేటాయించడాన్ని రద్దు చేశారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాన్ని ఐఎంజి భారత్ సవాల్ చేస్తూ హైకోర్టులో డబ్లుపి నెం. 24781 ద్వారా రిట్ పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. ఐఎంజి భారత్ వేసిన రిట్ పిటిషన్‌పై అప్పటి ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డిలు న్యాయస్థానంలో మంచి అడ్వకేట్లు నియామకం చేసి ప్రభుత్వపరంగా వాదనలు వినిపించారని వివరించారు. మన వనరులు మనకే కావాలని, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం దశాబ్దాలుగా పోరాటం చేసి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన గత పాలకులు ప్రైవేటు వ్యక్తి చేతుల్లో ఉన్న ఈ భూమిని ప్రభుత్వానికి తీసుకువచ్చే విషయాన్ని పట్టించుకోకపోగా గాలికి వదిలేశారని విమర్శించారు. కోట్లాది విలువైన ఈ భూమి ప్రైవేటు వ్యక్తి చేతుల్లోనే ఉంటే మరో రకంగా గత పాలకులు వారి చేతుల్లోకి తెచ్చుకోవాలనే కుట్రతోనే న్యాయస్థానంలో గట్టిగా కొట్లాడ లేదన్నారు. ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో ఉన్న 400 ఎకరాల భూమి రాష్ట్ర సంపద, ప్రజల ఆస్తిగా భావించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా యావత్తు మంత్రి మండలి కూర్చొని ఆలోచన చేసి ఎట్టి పరిస్థితిలో ఈ భూమి ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి పోనివ్వకుండా ప్రజలకు సంపద సృష్టించే ఆస్తిగా ఇవ్వాలని నిర్ణయం తీసుకొని మంచి న్యాయవాదులను నియామకం చేసి న్యాయస్థానంలో కొట్లాడి వేల కోట్ల విలువైన భూమిని రాష్ట్రానికి తీసుకొచ్చామని ఇది ప్రజల విజయమని అన్నారు. ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతమైన వేల కోట్ల విలువైన భూమిని కాపాడి ప్రజలకు ఆస్తిగా ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని శభాష్ అని ప్రశంసించాల్సిన ప్రతిపక్షాలు విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. గత పాలకుల మాదిరిగా ప్రజా ప్రభుత్వం స్పందించకుంటే వేలాది కోట్ల విలువైన 400 ఎకరాల భూమి ప్రైవేట్ వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతం అయ్యి ఉండేది కాదా అని వారిని ప్రశ్నించారు. ప్రైవేటు వ్యక్తి నుంచి తీసుకువచ్చిన భూమిని రాష్ట్ర ప్రజలకు ఆస్తిగా సృష్టించాలని, లక్షల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న తాపత్రయంతో రెవెన్యూ శాఖ నుంచి టీజీఐఐసీకి అప్పగించామే తప్ప ఇందులో ఎవరికీ ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదన్నారు. ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి హైటెక్ సిటీ లో ఫేస్ 1, ఫేస్ 2కి పునాదులు వేయడం వల్లనే హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారడం వల్ల అనేక ఐటీ సంస్థలు నగరానికి వచ్చి కంపనీలు పెట్టడం వల్ల లక్షల మంది యువతకు ఉద్యోగాలు దొరికాయని తద్వారా హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందిందన్నారు. అదే తరహాలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల్లో సంపద సృష్టించడం యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించాలన్న ఆలోచనతో దాని అభివృద్ధి చేస్తున్నామే తప్ప ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి స్వార్థం లేదని వివరించారు. టీజీఐఐసీ తయారు చేసిన డ్రాఫ్ట్ లేఔట్ లో ఈ భూముల్లో ఉన్న న్యాచురల్ రాక్ ఫార్మేషన్స్, దానిలో భాగంగా మష్రూమ్ రాక్‌ను కాపాడడానికి ప్రత్యేక చర్యలు గైకొనడంలో భాగంగా ఈ ప్రాంతాలను లేఅవుట్ నుండి మినహాయించామని చెప్పారు. పొల్యూషన్ ఫ్రీ నగరంగా హైదరాబాద్ ఉండాలని పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రైవేటు వ్యక్తి చేతుల్లో అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేసి కాపాడిన ఈ భూమిని ప్రజలకు ఆస్తిగా ఇవ్వడానికి ప్రజా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని కొన్ని రాజకీయ పార్టీలు వారి మీడియా సంస్థల ద్వారా సోషల్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు అర్థం చేసుకొని తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. కొంతమంది వ్యక్తుల ప్రయోజనాల కోసం రాష్ట్ర సంపదను తాకట్టు పెట్టమని ప్రజల ఆస్తిని వారి చేతుల్లోకి పోనివ్వమన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో నాకు వ్యక్తిగతంగా బాండింగ్ ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని అందుకు కావలసిన సహకారం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, అక్కడ చదివిన ప్రతి విద్యార్థికి బయటకు రాగానే ఉద్యోగాలు రావాలని, మంచి భవిష్యత్తు ఉండాలని మా ప్రభుత్వం కోరుకుంటుందని చెప్పారు.



మంగళవారం లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష పార్టీల ఎంపీలు

## ఢిల్లీకి చేరిన హెచ్‌సియు భూముల పంచాయితి

### కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కలిసిన బిజెపి ఎంపిలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, కంచ గచ్చిబౌలి గ్రామంలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఎకరాల భూమిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలికసదుపాయాల సంస్థ పెద్ద ఎత్తున జెసిబిలను మొహరించి గత రెండు రోజులుగా చేపట్టిన ఆక్రమణ పనులను వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను రాష్ట్ర బిజెపి ఎంపిలు కోరారు. మంగళవారం కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎంపిలు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర రెడ్డి, ధర్మపురి అరవింద్, గొడం నగేష్‌లు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి మంగళవారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఆర్థిక వనరుల సమీకరణ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ దుందుడుకు చర్యలను అడ్డుకోవాలని విన్నవించారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ యూనివర్సిటీ భూముల ఆక్రమణను వెంటనే నిలిపివేసి, అక్కడి పర్యావరణ పరిరక్షణపై అధ్యయనం చేయడానికి, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను సమీక్షించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ బిజెపి ఎంపిలు కోరారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ బిజెపి ఎంపిలందరితో కలిసి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి విజిటర్‌గా ఉన్న ప్రతిష్టాత్మక విద్యాసంస్థ అయిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రస్తుతం స్వర్ణోత్సవ సంబరాలను జరుపుకుంటుందన్నారు. ఇలాంటి సమయంలో భవిష్యత్ తరాల కోసం అవసరమైన పచ్చని వాతావరణం, అభివృద్ధి పనులకు, పరిశోధనలకు, యూనివర్శిటీ విస్తరణకు భూములు అవసరమని అన్నారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ టిజిఐఐసి చేసిన ప్రకటనను తప్పుపడుతూ హెచ్‌సియు రిజిస్ట్రార్ సోమవారం ప్రకటన చేసిందన్నారు. ఈ భూములకు సంబంధించి ఇంత వరకూ ఎటువంటి సర్వే జరగలేదని, ఎటువంటి సరిహద్దులు నిర్ణయించలేదని, ఈ ప్రాంతంలో ఉన్న పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని సంరక్షించటానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామని హెచ్‌సియు రిజిస్ట్రార్ తన ప్రకటనలో స్పష్టం చేశారు. యూనివర్శిటీకి కేటాయించిన భూముల బదలాయింపుకు రాష్ట్రపతి నియమించిన ఆరుగురు సభ్యులచే నియమించబడిన యూనివర్శిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి అని హెచ్‌సియు రిజిస్ట్రార్ తన ప్రకటనలో తెలియజేశారన్నారు. ఈ భూముల వేలం ప్రక్రియను రద్దు చేయాలని వేసిన పిటిషన్ కు మద్దతుగా 22,000 మందికి పైగా ప్రజలు సంతకాలు చేశారన్నారు. హెచ్‌సియు రిజిస్ట్రార్ మొదలుకొని అనేకమంది పర్యావరణ, జంతు ప్రేమికులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, అధ్యాపకులు, సమీప నివాసితులు పదే పదే విజ్ఞప్తి చేసినా వినకుండా, రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. చుట్టూ పచ్చని చెట్లు, పెద్ద సంఖ్యలో జంతువులు, పక్షులు, నక్షత్ర తాబేళ్ళ(ఐయుసిఎన్- ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్‌లో అరుదైన జాబితాలో ఉన్నాయి)తో జీవవైవిధ్యానికి నెలవైన పర్యావరణాన్ని సంరక్షించవలసిన రాష్ట్ర ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు దిగడం చాలా దారుణం. ఈ 400 ఎకరాల భూములలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వేలం ప్రక్రియను వెంటనే నిలిపివేసి, అక్కడ నిక్షిప్తమై ఉన్న పర్యావరణ, జీవవైవిధ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోరుతూ తాను మార్చి 27 వ తేదీన లేఖ రాశాను. దీనికి సరైన స్పందన లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం విధ్వంసానికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంతేకాకుండా గోడవర్మన్ తిరుమలపాడ్ కేసులో(1996) సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులో అటవీ సంరక్షణ చట్టం, 1980 ప్రకారం ప్రైవేటు భూమితో సహా అటవీ వాతావరణాన్ని కలిగి ఉన్న ఏ భూమినైనా అటవీ భూమిగానే పరిగణించవచ్చని, అలాంటి భూమిలో చెట్ల నరికివేత పనులు చేపట్టాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అని స్పష్టంగా పేర్కొంది.

### బాణాసంచా ఫ్యాక్టరీలో

## భారీ పేలుడు

>> శిథిలాలు సుమారు 200 మీటర్ల దూరం వరకూ చెల్లా చెదురయ్యాయి. పనిచేసే కార్మికులు తమ విధుల్లో బాణా సంచా తయారీలో ఉన్నారు. అదే సమయంలో పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు మానవ శరీర భాగాలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఒకదశలో మంటలు అదుపుచేసేందుకు విధ్వంసం కట్టడిచేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ప్రమాద తీవ్రతవల్ల మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ప్రమాదానికి గల కారణాలపై అధికారిక సమాచారం ఏదీ లేదు. అయితే ఇంకా ఎంతమంది కార్మికులు ఈప్రమాదంలో చిక్కుకున్నారన్నది తెలియాల్సి ఉంది. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను రికవరీచేసారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలతో దీశా సివిల్ ఆసుపత్రికి తరలించారు. బనసకాంత కలెక్టర్ మిహిర్ పటేల్ మాట్లాడుతూబాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించిందని, దీశా పారిశ్రామిక వాడలో జరిగిందని ఈఉదయం తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. పేలుడు ధాటికి శ్లాబ్ కూలిపడింది. కార్మికుల కుటుంబాలు కూడా ఫ్యాక్టరీ ఆవరణలోనే నివసిస్తున్నాయి. మున్సిపల్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చింది.

### నేటి నుంచి జెఇఇ మెయిన్

## రెండో విడత పరీక్షలు

>> ఈ నెల 17న విడుదల చేయడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) చర్యలు తీసుకుంటోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలకి లక్షమందికి పైగా విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉంది. ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదిల్లో పేపర్-1(బిఈ, బిటెక్) పరీక్షలు జరగనుండగా.. ఏప్రిల్ 9న పేపర్-2ఏ(బిఆర్క్), 2బి(బిప్లానింగ్) పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 2, 3, 4, 7 తేదిల్లో జరిగే పేపర్-1 పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. మొదటి సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సెకండ్ సెషన్ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. ఏప్రిల్ 2, 3, 4 తేదిల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఇప్పటికే ఎన్‌టిఏ జారీ చేసింది. ఏప్రిల్ 7, 8, 9 తేదిల్లో జరిగే పరీక్షల అడ్మిట్ కార్డులను త్వరలోనే జారీ చేయనున్నట్టు ఎన్‌టిఏ ప్రకటించింది. ఏప్రిల్ 8న జరిగే పేపర్-1ను సెకండ్ సెషన్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇక 9వ తేదిన నిర్వహించే పేపర్-2 పరీక్షను 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఎన్‌టిఏ స్పష్టం చేసింది. ఇప్పటికే జేఈఈ-2025 మెయిన్ మొదటి విడత పరీక్షలను నిర్వహించడమే కాకుండా.. ఫలితాలను సైతం విడుదల చేసింది. మొదటి విడతలో 13 లక్షల మందికిపైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 12.58 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పుడు రెండో విడత పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9 వరకు ముగిసిన తరువాత సెషన్-2 ఫలితాలను ఈ నెల 17న విడుదల చేయనున్నారు. రెండింటిలో వచ్చిన మార్కుల ఆధారంగా పర్సంటైల్‌ను యావరేజ్ చేసి ర్యాంక్‌లను జారీ చేయనున్నారు. అనంతరం జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను మే 18న నిర్వహించనున్నారు.

# రైతులకు తక్కువ ధరకు ఎరువులు

## రూ.37,216 కోట్ల సబ్సిడీ మంజూరు

## కేంద్ర వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** రైతులకు కేంద్ర ప్రభుత్వం భారీ గుడ్ న్యూస్ చెప్పింది. తక్కువకే ఎరువులను అందించేలా కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు గాను రూ.37,216 కోట్ల సబ్సిడీని మంజూరు చేసింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ఫాస్పరస్, పొటాషియం తదితర ఆధారిత ఎరువులను రైతులకు తక్కువ ధరకే విక్రయించేలా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంటుంది. 2025 ఏప్రిల్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 31 వరకు పొటాషియం, ఫాస్పరస్ ఎరువులను సబ్సిడీ వర్తించనుంది. ఈ నేపథ్యంలో రైతులకు అతి తక్కువ ధరలోనే వారికి ఎరువులు లభిస్తాయి. దీంతో వాళ్ళు తమ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో రైతులకు తక్కువ ధరలోనే ఈ ఎరువులు లభించడంతోపాటు వీటిని అందరికీ అందుబాటులో కూడా ఉంచనున్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్ కేటాయింపులో రూ.1,91,836 కోట్లకు పైగా ఎరువుల శాఖకు కేటాయింపులు పెంచింది. ప్రధానంగా రైతులకు డిఏపి సజావుగా అందించేలా చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం కేంద్ర రసాయన ఎరువుల శాఖామంత్రి అనుప్రియ పటేల్ ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిఏపి ఎరువుల ధరలను స్థిరంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అంతేకాకుండా రైతులకు పంట ఉత్పత్తిలో ఎరువులను అందుబాటులో ఉంచటంతో వారికి భారీ ఉపశమనం లభిస్తుందని వెల్లడించారు. తక్కువ ధరలోనే కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ఎరువుల వల్ల రైతులకు అధిక భారం పడకుండా ఉంటుందని అని చెప్పారు. పధానంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆహార భద్రతను మెరుగు లక్ష్యంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఎరువుల ధరల్లో జరిగిన మార్పులు దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ సంచలన నిర్ణయం తీసుకుందని తెలిపారు.



జెసిబి తగిలి మృతి చెందిన జింక

# హెచ్‌సియులో జెసిబి తగిలి జింక మృతి

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో చేపడుతున్న పనుల కారణంగా మూగజీవాలు మృతిచెందుతున్నాయి. పగలు,రాత్రి తేడా లేకుండా చేపడుతున్న పనులతో పచ్చిక బయళ్లలో ఉంటున్న జింకలు, నెమళ్ల వంటి వన్యప్రాణుల జీవనం అగమ్యగోచరంగా మారింది. జేసీబీలతో చెట్ల తొలగింపు పనులు చేస్తుండగా జింక తీవ్రగాయాలతో మృతి చెందింది. దీంతో పాటు నెమలి కూడా మృతిచెందినట్లు వర్సిటీ విద్యార్థులు తెలిపారు. ప్రస్తుతం మృతిచెందిన వన్యప్రాణుల ఫోటోలు వైరల్‌గా మారాయి. రాత్రిపూట జేసీబీలతో చెట్ల తొలగింపు పనులు చేస్తుండగా నెమళ్లు, జింకలు చేస్తున్న అరుపులు స్థానికుల హృదయాలను కలిచివేస్తున్నాయి. ఈ క్రమంలో రాత్రివేళల్లో జేసీబీలతో పనులు చేపడుతుండగా జింక మృతి చెందటంతో వర్సిటీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

# విజయవాడలో ప్రవీణ్ ఉన్న మూడు గంటల్లో ఏమి జరిగింది?

## పాస్టర్‌కు కుటుంబ సమస్యలున్నాయా..

**విజయవాడ,ఏప్రిల్1,ప్రభాతవార్తప్రతినిధి:** రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్ మరణానికి ముందు విజయవాడలో గడిపిన మూడు నుంచి నాలుగు గంటల నడుమ ఏం జరిగిందనే విషయాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఆయన విజయవాడ రామవరప్పాడు చౌరస్తా సమీపంలోని ఓ పార్కులో విశ్రాంతి తీసుకున్న తర్వాత నుంచి మృతి వరకు మధ్యలో ఏం జరిగిందనే విషయాలు బయటికొస్తున్నాయి. ప్రధానంగా విజయవాడలో ఆయన్ని చివరిసారిగా చూసిన ట్రాఫిక్ ఎస్ఐ, టీకొట్టు మాస్టర్ ఆ రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు రామవరప్పాడు వద్ద ఏం జరిగిందనేది వివరించారు. ప్రవీణ్ ద్విచక్రవాహనం హెడ్‌లైట్ పగిలిపోయి ఉండటం మరోవైపు చాలా నీరసంగా కనిపించడంతో ఈ రాత్రి వేళ రాజమహేంద్రవరం వెళ్లొద్దని, స్థానికంగా ఉన్న హోటల్‌లో విశ్రాంతి తీసుకుని ఉదయం బయల్దేరి వెళ్లాలని ఎస్ఐ, టీకొట్టు మాస్టర్ ప్రవీణ్‌కు సూచించినా ఆయన వినిపించుకోలేదని అందున్నారు. రాజమహేంద్రవరంలో అత్యవసర పని ఉంది ఇప్పుడే వెళ్లాల్తి అంటూ ప్రవీణ్ లైట్లు లేని ఆ బైక్‌పైనే వెళ్లిపోయినట్లు వారిద్దరూ పేర్కొన్నారు. గత నెల 24న సాయంత్రం 4.45 గంటలకు గొల్లపూడిలో పెట్రోల్ బంక్‌కు ప్రవీణ్ చేరుకున్నారు. అప్పటికే ద్విచక్ర వాహనంపై తూలుతూ ఉండటం, బైకు లైట్ పగిలిపోయి ఉండటం, బైక్ సేఫ్టీ రాడ్ వంకర పోవడం పెట్రోల్ బంకులోని సీసీ కెమెరాలో నమోదైంది. బంకులో సిబ్బంది ఎంత పెట్రోల్ కావాలని అడిగితే చేతితో 8 అని సైగ చేశారు. రూ.872 తన ఫోన్‌పే ద్వారా నగదు పంపించి విజయవాడ వైపు వెళ్లిపోయారు. రామవరప్పాడు రింగ్ వద్ద తాను ఆ రోజు విధులు నిర్వహిస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. సాయంత్రం 5:20 గంటల ప్రాంతంలో సెల్ఫ్ యాక్సిడెంట్ అయిందని చెప్పారు. చుట్టుపక్కల వారు ప్రవీణ్‌ను లేపి పక్కన కూర్చోబెట్టారని వివరించారు. సమాచారం తెలిసిన వెంటనే తాను ప్రమాద స్థలానికి వెళ్లినట్లు పేర్కొన్నారు. బండికి హెడ్‌లైట్ ఊడిపోయిందని, కళ్లజోడుకు ఒక అద్దం లేదన్నారు. దెబ్బలు తగిలాయా? అని అడిగితే ప్రవీణ్ లేదని చెప్పారు. ఆయణ్ని సమీపంలోని పార్కులో కూర్చోబెట్టామని సుబ్బారావు వెల్లడించారు; దాదాపు మూడు గంటలు ప్రవీణ్ అక్కడే కూర్చున్నారని సుబ్బారావు పేర్కొన్నారు. తన విధులు ముగిసిన తర్వాత ఎనిమిది గంటల సమయంలో వెళ్లి ప్రవీణ్‌ను పలకరించానని చెప్పారు. టీకొట్టుకు తీసుకెళ్లి టీ ఇప్పించినట్లు తెలిపారు. అప్పటికే హెడ్‌లైట్ వేలాడుతోందని తాను ట్రాఫిక్ బూత్‌లోకి తాడు కోసం వెళ్లానని వివరించారు. మళ్లీ తిరిగి వచ్చే సరికే కనిపించలేదని ఆయన బాగా నీరసంగా, మగతగా ఉన్నారని ట్రాఫిక్ ఎస్సై అన్నారు. ద్విచక్ర వాహనం పడిపోవడంతో పగిలిపోయిన హెడ్‌లైట్‌ను మరమ్మతు చేసేందుకు ఎవరైనా స్థానికంగా మెకానిక్ ఉన్నారా అంటూ ప్రవీణ్ తనను అడిగారని టీకొట్టు మాస్టర్ నాగార్జున తెలిపారు. ఇక్కడ ఎవరూ లేరని తాము చెప్పామని అన్నారు. హెడ్‌లైట్ కిందకు వేలాడుతుండటంతో కనీసం దానిని తీగతో కడతాను ఉండండి అంటూ హోటల్‌లోకి వెళ్లి వచ్చేలోగానే అక్కడి నుంచి ప్రవీణ్ తన వాహనంపై వెళ్లిపోయారని వివరించారు.

# దుర్గమ్మకు విశేష పుష్పార్చన



పుష్పార్చనలో పాల్గొన్న జపాన్ టోక్యోకు చెందిన మహిళలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1, ప్రభాత 'వార్త'** ప్రత్యేక పుష్పార్చనలందుకున్న దుర్గమ్మ వారు భక్తులను అనుగ్రహించారు. వసంత నవ రాత్రోత్సవాల్లో భాగంగా తెల్లచామంతులు, మల్లెపూలు అమ్మవారి అర్చన ప్రాంగణానికి అధికారులు పండితులు, అర్చకస్వాములు తీసుకొచ్చి అక్కడ అమ్మవారికి పూజాదికాలు జరిపించారు. జపాన్ టోక్యోకు చెందిన ఇద్దరు మహిళలుశ్రీ అమ్మవారి పుష్పార్చనలో పాల్గొనడం విశేషం.

# టాటా ఆస్తుల్లో సింహభాగం దాతృత్వానికే!

## స్నేహితులను సైతం మరువని రతన్ టాటా..

**ముంబయి, ఏప్రిల్ 1:** టాటా సన్స్ మాజీ ఛైర్మన్ దివంగత దిగ్గజ పారిశ్రామికవేత్త తన ఆస్తుల్లో సింహభాగం దాతృత్వానికే కేటాయించారు. ఆయన రాసిన వీలునామా వివరాలు వెల్లడ కావడంతో టాటా దాతృత్వ కార్యక్రమాలకు ఎక్కువ విలువనిచ్చినట్లు తెలుస్తోంది. మరణానంతరం రతన్‌టాటాకు ఉన్న ఆస్తుల్లో సుమారు రూ.3,800 కోట్ల సంపదను తాను స్థాపించిన రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, ఎండోమెంట్ ట్రస్ట్‌కు కేటాయించినట్లు ప్రచారం వచ్చింది. టాటా సన్స్‌లో తనకున్న వాటాలు ఇతర ఆస్తులు ఈషేర్లను విక్రయించాల్సివస్తే టాటాసన్స్‌లోని ప్రస్తుతం ఉన్న వాటాదారులకే అమ్మాలని ఆయన వీలునామాలో రాసారు. తన సవతి సోదరీమణులు శిరీన్ జజీభోయ్, దియానా జజీభోయ్‌పేరిట రూ.800 కోట్లు రాసారు. వీటిలో ఎఫ్‌డిలు, స్టాక్స్‌తోపాటు ఖరీదైన వాచ్‌లు పెయింటింగ్‌లు కూడా ఉన్నాయి. టాటా గ్రూప్‌మాజీ ఉద్యోగి రతన్ సన్నిహితుడు మోహిన్ ఎం దత్తాకు కూడా రూ.800 కోట్ల విలువైన ఆస్తులు రాసారు. ఇక జుహూ బంగ్లాలో షేర్‌తోపాటు కొన్ని వెండి, బంగారు ఆభరణాలు సోదరుడు జిమ్మీనావల్ టాటాకు కేటాయించారు. ఆలిబాగ్‌లోని బంగ్లా, మూడు పిస్టళ్లు తన మిత్రుడు మెహిల్ మిస్త్రీపేరిట రాసారని తాజా కథనాలు చెపుతున్నాయి. అలాగే తన వీలునామాలో పెంపుడు శునకాల సంరోణకోసం 12లక్షల ఫండ్ పక్కనపెట్టారు. ప్రతి త్రైమాసికానికి రూ.30వేల చొప్పున వాటికి ఖర్చుచేసేలా ఈ నిధులు ఇచ్చారు. ఇక శంతనునాయుడు టాటాకు చివరి రోజుల్లో కేర్‌టేకర్‌గా జనరల్ మేనేజర్‌గా ఉన్నారు. గతంలో శంతనుకు ఇచ్చిన విద్యార్థి రుణాన్ని మాఫీచేసారు. పొరుగింట్లో ఉండే జెక్‌మాలిటే అనే వ్యక్తికి ఇచ్చిన 23 లక్షల అప్పును కూడా రద్దు చేస్తూ వీలునామాలో పేర్కొన్నట్లు సమాచారం. విదేశాల్లో ఉన్న రూ.40 కోట్ల ఆస్తులు, సీషెల్స్‌లో భూములు, మోర్గాన్‌స్టాన్లీ, వెల్స్‌ఫార్గో వంట సంస్థల్లో బ్యాంకు ఖాతాలు ఆల్కోవా కార్పొరేషన్ హౌమెట్ ఏరోస్పేస్ వంటి కంపెనీల్లో షేర్లు ఉన్నాయి. ప్రముఖ బ్రాండ్ల 65 ఖరీదైన వాచ్‌లున్నాయి. 2022 ఫిబ్రవరి 23న రాసినట్లు తెలుస్తోంది. ఈ విల్లును పరిశీలించి ఆస్తులు కేటాయింపులు జరగాలని ఇప్పటికే బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలయింది. ఆ ప్రక్రియ పూర్తయే నాటికిమరో ఆరునెలలు పట్టే వీలుంది.



# హెచ్‌సియు భూముల వేలం కుదరదు

## హైకోర్టులో కేసు కొనసాగుతోంది

## ఆ 400 ఎకరాల భూమి అటవీపరిధిలోనిదే..

## కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** హెచ్‌సియు భూములను వేలం వేయడం కుదరదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కంచ గచ్చిబౌలి భూములపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయాలనుకున్న 400 ఎకరాల భూమి అటవీ పరిధిలోనిదన్నారు. అటవీ లక్షణాలు కలిగిన ఏ భూమినైనా కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా నరికివేయలేమని సుప్రీంకోర్టు తీర్పు లున్నాయని, కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తోందన్నారు. వట ఫౌండేషన్ అనే ఎన్‌జిఓ దాఖలు చేసిన కేసులో ఏప్రిల్ 7 నాటికి కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు. ఈ విషయం తెలిసి రాష్ట్ర ప్రభుత్వం భూముల చదను పేరుతో కోర్టు ధిక్కరణకు పాల్పడుతుందన్నారు. చెట్లను తొలగిస్తూ, మొక్కలను పీకేస్తూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతుందన్నారు. ఆ భూములను డీఫారెస్టైజేషన్ చేసి అమ్మి వేల కోట్లు దండుకోవాలనుకోవడం దుర్మార్గం అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించి కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజాప్రయోజనాలకు కాకుండా ప్రభుత్వ భూములను అడ్డగోలుగా విక్రయించడాన్ని రేవంత్‌రెడ్డి గతంలో వ్యతిరేకించిన సంగతి మర్చిపోయారా? అంటూ ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి భూముల విక్రయం కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. తక్షణమే గచ్చిబౌలి భూముల అమ్మ కంపై ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసం హరించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

# హెచ్‌సియు విద్యార్థులను రెచ్చగొట్టే యత్నం

## 20 యేళ్ల క్రితమే ప్రభుత్వానికి వర్సిటీ మధ్య భూబదలాయింపు

## కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిఆర్ఎస్‌లవి ఒకే గొంతుక

## బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** తెలంగాణ సెంట్రల్ యూనివర్సిటీ స్థలం గుంజుకుంటున్నట్లు ఆరోపణలు చేస్తూ విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తు న్నారని బిసి సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రబాకర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2023 డిసెంబర్ 7న తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అప్పటివరకు ఉన్న ముళ్ల కంచెలు తొలగించి ఇందిరాపార్క్ ధర్నాచౌక్ ఓపెన్‌చేసి ప్రజాస్వామిక పరిపాలన కొనసాగించామన్నారు. అయితే ఎన్నికైన మొదటి నెల నుండి బిఆర్ఎస్, బిజెపి రెండు కవల పిల్లల లాగా ప్రజాప్రభుత్వానికి పిల్లి శాపనార్థాలు పెడుతూ ప్రభుత్వం కూలిపోతుందని, ప్రభుత్వం సక్సెస్ కావద్దని ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నా రని ఆరోపించారు. ప్రభుత్వం తెలంగాణ సెంట్రల్ యూనివర్సిటీ స్థలం గుంజు కుంటున్నట్టు ఆరోపణలు చేస్తూ విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నానని, 2004లో పంచనామాచేసి 400 ఎకరాలు వర్సిటీకి సంబంధం లేదని గోపనపల్లిలో ఆల్టర్నేటివ్ ల్యాండ్ కింద తీసుకోవడం జరిగిందని 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వానికి యూనివర్సిటీకి మధ్య భూబదలాయింపు జరిగిందని మంత్రి పొన్నం వివరించారు. కంచె, గోపనపల్లి గ్రామాల పరిసరాల్లో 132 ఎకరాలు ఎన్జీఒలకు కేటాయించారని, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాల్లో అధికారంలో ఉండి కోర్టులో కేసులు నడుస్తుంటే వర్సిటీకి సంబంధించిన అధికారులు కూడా ఈ స్థలం మాది అని కూడా న్యాయపరమైన పోరాటంలో భాగస్వామ్యం తీసుకోలేదని తెలిపారు. 2004 నుండి న్యాయబద్ధమైన పోరాటం ప్రభుత్వం చేస్తున్నదని ఈ 400 ఎకరాలు కోర్టు ద్వారా ప్రభుత్వానికి వచ్చిందని హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి ఈ భూమికి సంబంధం లేదన్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బిఆర్ఎస్ పార్టీ ఒకే గొంతుగా తానా తందనా అంటూ విద్యార్థులను రెచ్చగొడుతూ ప్రభుత్వం తప్పు చేస్తుందని అభద్రతా భావంతో మాట్లా డుతున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# పంట రుణాల మాఫీ, రైతు భరోసాపై గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** వ్యవసాయ పంట రుణ మాఫీ, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల జాబితాలను ఇక నుండి గ్రామాల్లో ప్రదర్శించనున్నారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని అమలు చేయడం లేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ధీటుగా సమాధానం ఇచ్చేందుకు తెలంగాణ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ రెండు పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన జాబితాను గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయాలని చేయనుంది. ఇందులో భాగంగా ఒక్కో గ్రామ పంచాయతీకి 6-3 సైజుల్లో మూడు ఫ్లెక్సీల చొప్పున ఏర్పాటు చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఒక్కో ఫ్లెక్సీకి రూ.350 చొప్పున రేటు నిర్ణయించారు. జిల్లాల్లో రుణమాఫీ, రైతు భరోసా ఫ్లెక్సీ తయారీకి సంబంధించి ఇప్పటికే వివిధ సంస్థలకు అధికారులు టెండర్లు ఖరారు చేశారు.

# హెచ్‌సియు భూములపై విద్యార్థులతో చర్చించాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆందోళనలు కొనసాగుతున్న హెచ్‌సియు భూముల వ్యవహారంపై విద్యార్థి ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములకు సంబంధించి ఆందోళన వ్యక్తం చేస్తున్న హెచ్‌సియు విద్యార్థుల ప్రతినిధి బృందంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని ..అవి హెచ్‌సియు భూములని విద్యార్థులు అంటుండగా.. కాదు రాష్ట్ర ప్రభుత్వానివేనని ప్రభుత్వం అంటున్నదని కూనంనేని అన్నారు.

ఆ 400 ఎకరాలకు బదులుగా.. వర్సిటీకి అంతే మొత్తంలో భూములు ఇచ్చామని రాష్ట్ర ప్రభుత్వం రికార్డులు చూపిస్తుందన్నారు. ఈ అంశంపై సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యార్థుల ప్రతినిధి బృందంతో చర్చించి.. వారి అభిప్రాయాలను స్వీకరించాలన్నారు. అదే సమయంలో వర్సిటీ విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని ఖండిస్తున్నామని.. అరెస్టయిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, వారిపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

భూముల అమ్మకం విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. ఇటువంటి ఆందోళనలను తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించడం మంచిదని.. ప్రభుత్వం ముందుకొచ్చి మాట్లాడితే మంచి సంకేతాలు ఇచ్చినట్లు అవుతుందన్నారు. ఇలాంటి సున్నితమైన అంశాల విషయంలో పోలీసులు అతిగా ప్రవర్తించవద్దని.. దాని వల్ల సమస్య జఠిలమవుతుందన్నారు. విద్యార్థులకు సహజంగానే ఆందోళన ఉంటుందని.. దానిని అర్థం చేసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్‌దే అధికారం

## వరంగల్ ముఖ్యనేతలతో కెసిఆర్ సమీక్ష సమావేశం



వరంగల్ ఉమ్మడి జిల్లా నేతలతో సమీక్షిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్

**మర్కుక్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** ఈనెల 27న జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వేడుకలను వరంగల్ జిల్లాలో నిర్వహించేందుకు గానూ మంగళవారం మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తన వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్ ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సిఎం కెసిఆర్ రజతోత్సవ సభకు సంబంధించి పలు సూచనలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ దిశగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నేతలు సైనికుల్లా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలతో ఎన్నో అబద్దపు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిందని, వాటన్నింటినీ అమలు చేసే వరకు ప్రజా క్షేత్రంలో ప్రజాప్రతినిధులు ఎండ గట్టాలని పిలుపునిచ్చారు.

ఈ సమీక్ష సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్, మాజీ స్పీకర్ మధుసూద నాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రావు, గండ్ర వెంకట రమణారెడ్డి, గండ్ర జ్యోతి, వినయ్‌భాస్కర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నరేంద్ర, మాలోతు కవిత, రాజ్యసభ సభ్యులు సంతోష్‌రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పార్లమెంటుకు చేరిన హెచ్‌సియు భూముల వ్యవహారం

## రాజ్యసభలో ప్రస్తావించిన బిజెపి ఎంపి కె.లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని అమ్మే ప్రక్రియను రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం రాజ్యసభలో ఈ కీలకమైన అంశంపై ఆయన మాట్లాడారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయానికి 1974లో విద్య, పరిశోధనల కోసం ఈ 400 ఎకరాల భూమి కేటాయించబడిందని చెప్పారు. ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో విశ్వ విద్యాలయ భూములను ఇతర ప్రాజెక్టుల కోసం తీసుకుపోయాయని హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఆరోపించింది. ప్రభుత్వానికి ఈ భూమిని అమ్మకాలు చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

# శ్రీవారి ఆలయంలో 6న శ్రీరామనవమి ఆస్థానం

## 7న పట్టాభిషేకం




**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** త్రేతాయుగంలో సాక్షాత్తు శ్రీరామచంద్ర మూర్తి కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించారనే పురాణగ్రంధాల ఆధా రంగా తిరుమలలో శ్రీరామనవమి ఆస్థా నం శాస్త్రోక్తంగా జరిపించడం ఆన వాయితీగా వస్తోంది. ఈనెల 6వతేదీ వెంకన్న ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం, 7న శ్రీరామపట్టాభిషేకం మహో త్సవాలు వేడుకగా నిర్వహించనున్నారు. 6వతేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి 11గంటల వరకు రంగనాయకుల మండపంలో శ్రీసీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపిస్తారు. ఇందులో పాలు,పెరుగు,తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు,చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం6.30గంటల నుండి 8గంటలవరకు హనుమంతవాహనసేవ తిరుమలలో వైభవంగా జరగనుంది. ఆ తరువాత రాత్రి 9గంటల నుంచి 10గంటలవరకు బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ రద్దయ్యింది. 7వతేదీ సోమవారం రాత్రి 8గంటల నుంచి 9గంటల వరకు బంగారువాకిలిలో ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేక ఆస్థాన మహోత్సవం వేడుకగా నిర్వహిస్తారు.

# అనారోగ్యంతో తమిళనాడు భక్తుడు మృతి

**తిరుమల,ఏప్రిల్ 1 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన తమిళనాడు భక్తుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆలయానికి సమీపంలోని సహస్రదీపాలంకారసేవ జరిగే ప్రాంతంలో అతను ప్రాణాలు కోల్పోయాడు. తిరుమల పోలీసుల సమాచారం మేరకు.....తమిళనాడు తిరువళ్ళూరుకు చెందిన ఎస్. మోహన్‌సుందర్(35)గా గుర్తించారు. అతని జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో మృతి చెందాడనేది పోలీసుల సమాచారం. అయితే మరెలాంటి వివరాలు లేకపోవడంతో దర్శనానికి వచ్చి ఇలా జరిగిందా లేక ఏదేని కారణాలు ఉన్నాయా అనేది పోస్టుమార్టమ్ నివేదికలో తేలాల్సివుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు. తిరుమల 1టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

# బేడిఆంజనేయస్వామి మూలమూర్తికి నిధులు విడుదలైనా అమలుకాని బంగారుతాపడం



**తిరుమల,ఏప్రిల్ 1ప్రభాతవార్తప్రతినిధి:** మూడేళ్ళక్రిందట అప్పటి అధికారంలో ఉన్న టిటిడి పాలకమండలి ప్రతిపాద నలకు నేటికీ మోక్షం కలగలేదు. ఆ ఆమోదం అమలుకాకపోగా ఆ వైదిక కార్యక్రమం కోసం విడుదలైన నిధులు ఏమయ్యాయో?అనేది ఇప్పుడు టిటిడి అర్చకుల్లో చర్చ మొదలైంది. ప్రస్తుతం వెండి తాపడాలతోనే బేడి ఆంజనేయ స్వామి భక్తులకు దర్శనమిస్తుండటం విశేషం. కలియుగవైకుంఠం తిరుమలకొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా బేడిఆంజనేయస్వామి ఆలయం ఉంది.

ఈ ఆలయానికి ప్రత్యేకత కూడా లేకపోలేదు. సాక్షాత్తు స్వామివారి ప్రియభక్తుడుగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడ బేడి ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు బంగారుతాపడం చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం 2002 జులైలో నిర్ణయించింది. ఇందుకు అవసరమైన సుమారు 18.75లక్షలు రూపాయలు నిధులను మంజూరుచేస్తూ అప్పటి పాలకమండలి ఆమోదించింది. ఈ పనులు అదే ఏడాది సెప్టెంబర్‌లో వెంకన్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యేనాటికి పూర్తిచేసే దిశగా టిటిడి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ఈ పనులు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం బేడిఆంజనేయస్వామికి వెండితోతయారుచేయబడిన కవచాలును అమర్చిఉన్నారు. వీటిపై బంగారుతాపడం చేయాలని భక్తుల కోరిక మేరకు టిటిడి ఈ పనులు మొదలుపెట్టాలని, ఇందుకు దాతల సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించారు.

అయితే గత మూడేళ్ళుగా ఇవేమీ అమలు కాలేదు. తిరుమలలో ఏదేని ఆలయ శుభకార్యాలు, పట్టువస్త్రాలు సమర్పణ, మఠాధిపతులు, పీఠాధిపతులు పెద్దమర్యాద సమయాల్లో, బ్రహ్మోత్సవాల్లో గొడుగులు సమర్పణకు ముందు వాటిని తొలుత బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకువచ్చి ఇక్కడ ఉంచి ప్రత్యేక పూజలు చేయడం సంప్రదాయం. దీంతో బేడి ఆంజనేయస్వామికి మరింత విశిష్టత సంతరించుకుంది. ఇక్కడ స్వామివారికి బంగారు తాపడం చేయాలనేది భక్తుల అభిప్రాయాలు మాత్రం కాగితాలపైనే ఉండిపోయింది. అంతేగాక తిరుమల ఆలయంలో మూలవిరాట్టు శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైఉన్న బంగారువాకిలిని కూడా స్వర్ణమయం చేయాలని సంకల్పం నెరవేరడం లేదు.

వార్త

తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే, చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

-కాల్టన్

# పంచాయతీలను నిర్వీర్యం చేయొద్దు!

జాతిపిత మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశలో అడుగులు వేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని పాలకపెద్దలు ఏనాటి నుంచో చెప్తున్నా ఆచరణకు వచ్చేసరికి హామీలుగానే మిగిలిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ వ్యవస్థ అస్తవ్యస్తంగానే ఉన్నది. కనీసం రాజ్యాంగం కల్పించిన అధికారాలు కూడా స్థానిక సంస్థల ప్రతినిధులకు అప్పగించేందుకు పాలకపెద్దలు ఇష్టపడడం లేదు. కొత్త అధికారాల సంగతి దేవుడెరుగు. సర్పంచులకు గతంలో ఉన్న అధికారాలు కూడా క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. ఒకనాడు గ్రామాల్లో తిరుగులేని అధికారాలు, హోదా ఉన్న సర్పంచులు నేడు ఉత్సవ విగ్రహాలుగా మారిపోతున్నారనే చెప్పొచ్చు. వాస్తవంగా గ్రామస్వరాజ్యం గురించి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎందరో నాయకులు పెద్దపెద్ద మాటలు చెప్తూనే ఉన్నారు. వాటి పటిష్టతే తమ ధ్యేయమని పదేపదే ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాటికి కేటాయించిన నిధులు, విధులు అప్పగిస్తామని ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవంగా చూస్తే గ్రామసర్పంచులకు ఒక వ్యూహం ప్రకారం ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. చివరకు స్వతంత్రంగా చీపురుకట్ట కొనలేని దురదృష్టపు పరిస్థితులుతెచ్చిపెట్టారు. ఇందుకు కారణం వారూవీరు అనే దానికంటే ఎవరు అధికారంలో ఉన్నా పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు తమవంతు ప్రయత్నాలు చేశారు, చేస్తున్నారు. గ్రామస్థాయిలో ఎన్నో కమిటీలను పెట్టి సర్పంచులను పక్కకు పెట్టారు. వారి ప్రమేయం లేకుండానే వారికి తెలియకుండా ఎన్నో కార్యక్రమాలు గ్రామాల్లో జరిగే పరిస్థితులు తీసుకువచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే సర్పంచులకు సమాంతరంగా పదవులు సృష్టించారు. నిన్న మొన్నటివరకు ఆంధ్రప్రదేశ్‌లో వాలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి సర్పంచుల ఉనికినే ప్రశ్నార్థకం చేశారు. ఇలాంటి చర్యలతో ఉన్న ప్రాధాన్యత కూడా లేకుండాపోయింది. నేతల వాగ్దానాలు, ఉపన్యాసాలు, హామీలతో ఏదో సాధించాలని సమాజానికి ఏదోచేయాలని నూతన ఉత్సాహంతో ఎందరో యువతీయువకులు పోటీచేసి ఎన్నోవ్యయప్రయాసలకులోనై సర్పంచులయ్యారు. గ్రామాభివృద్ధికి తాము చేసిన వాగ్దానాలు తీర్చేందుకు నడుం కట్టారు. కానీ ఈ చట్టాల వలలో, రాజకీయాల వ్యూహాలలో తాము ఏమీ చేయలేమనే విషయం అర్థంకావడానికి వారికి చాలాకాలం పట్టింది. అయితే తమ గ్రామప్రజలకు తాము చేసిన వాగ్దానాలు పూర్తిచేసేందుకు తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి కొన్నిగ్రామాల్లో పనులు పూర్తిచేశారు. అయితే ఎంతకూ ఆ బిల్లులు రాకపోవడం ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి ఇంకొకపక్క అప్పులు, వడ్డీలుపెరిగి మరొకపక్క గ్రామప్రజల ముందు తలవంచుకోలేక డజను మందికిపైగా తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈ పరిస్థితిలో గతయేడాది జనవరి 31వ తేదీతో వారి పదవీ కాలం గడువు పూర్తయిపోయింది. అప్పటి నుంచి వారు మాజీలుగా మారిపోయారు. అయినా ఇప్పటికీ వారికి బిల్లుల డబ్బులు రాకపోవడంతో సర్పంచులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. మరొకపక్క ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. రికార్డులన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికీ బిల్లులు వస్తాయో రావో తెలియదు. వస్తే ఎప్పుడువస్తాయో చెప్పేవారు లేరు. అంతా అగమ్యగోచరంగా ఉంది. ఒకనాడు పంచాయతీరాజ్ వ్యవస్థలో సర్పంచులంటే గౌరవమర్యాదలుండేవి. భారత దేశంలో స్థానిక సంస్థలకు రెండువేల సంవత్సరాలకుపైగా చరిత్రఉంది. చంద్రగుప్తుడి కంటే ముందు నుంచి గ్రామాలు, గ్రామవ్యవస్థ అమలులో ఉన్నట్లు ఆధారాలున్నాయి. ఆనాడు కూడా గ్రామసభలుండేవి. గ్రామసభల నిర్ణయమే కీలకం. వాటి నిర్ణయాలకు ఆనాటి రాజరికం వ్యవస్థ ఎంతో ప్రాముఖ్యత ఇచ్చేది. ప్రాచీన కాలం నుండి గ్రామీణ వ్యవస్థ ఏదోఒక రూపంలో భారత్‌లో కొనసాగుతూనే ఉన్నది. 1882లో బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి లార్డ్‌రిప్పన్ స్థానిక సంస్థలకు ఒక ప్రతిపత్తి కల్పించారు. గాంధీ మహాత్ముడు ప్రవచించిన గ్రామస్వరాజ్య లక్ష్యంలో స్థానిక సంస్థల పటిష్టత అన్నది ముఖ్యాంశం. భారతరాజ్యాంగంలో స్థానిక సంస్థలకు అవసరమైన అధికారాలు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. 1952 నుంచి ఎన్నో కమిటీలు, మరెన్నో అధ్యయనాల అనంతరం ఎన్నో మార్పులు చేర్పులు చేశారు. కానీ సర్పంచులకు రాజ్యాంగం కల్పించిన అధికారాలు ఇవ్వడానికి మాత్రం పాలకపెద్దలకు మనసు ఒప్పడం లేదు. రాను రాను పంచాయతీరాజ్ వ్యవస్థను నామమాత్రంగా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలతో ఎన్నికైన సర్పంచులను సస్పెండ్ చేసే అధికారం అధికారులకు కట్టబెట్టిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. ఈ వ్యవస్థలో ఎన్నో మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నా, ప్రభుత్వాలు మారినా అధికార వికేంద్రీకరణలో మాత్రం ఆది నుంచి అధికారంలో ఉన్న పెద్దలు జాగ్రత్తపడుతూనే ఉన్నారు. ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థ పునాది వంటిది. అందులో సర్పంచులు చాలాకీలకం. రాష్ట్రానికి మరిన్ని అధికారాలు కావాలని కేంద్రం ముందు కేకలు పెడుతున్న నాయకులు స్థానిక సంస్థలకు మాత్రం అధికారాలు ఇవ్వకపోవడందురదృష్టకరం. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ పదేపదే వల్లించే నేతలు పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులతో కాలం గడపడం ఏ కోణంలో చూసినా సమంజసం కాదు.



వినడంలో మనిషి తొందర పడాలి, కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు. అపార్థం చేసుకోవడంలో అసలు త్వరపడకూడదు.

జేమ్స్ జ్యూడిత్



మనస్సును మంచి ఆరోగ్యకరమైన ఆలోచనలతో నింపండి. అవే జీవితాన్ని సుఖమయం చేస్తాయి.

విల్‌కిన్స్

# ప్రజావాక్కు

## అయ్యో! బర్మా

**పెను** భూకంపం ధాటికి మయన్మార్ (బర్మా) కకావికలమైంది. పదహారు వందలకుపైగా మానవప్రాణాలు పోయినట్లు, మూడు వేల మంది క్షతగాత్రులైనట్టు లెక్క ఇప్పటికి తేలినా, గంట గంటకు ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమెరికా అంచనాల ప్రకారం విగత జీవుల సంఖ్య కొన్ని వేలల్లో ఉండొచ్చు. అక్కడి రెండు పెద్ద నగరాలు కూలిన భవనాలు, నిర్మాణాలతో మట్టిదిబ్బలుగామారినట్లు ఛాయా చిత్రాలుచెప్తున్నాయి. ఆ శిథిలనగరాల్లో చిక్కుకున్న ప్రాణాలు ఎన్ని ఉన్నాయో, ఎంతవరకు నిలబడతాయో ఎవరూ చెప్పలేరు. వెంటనే అక్కడ సహాయకచర్యలు అందించడానికి భారత్ ముందుకురావడం, 139 టన్నుల సహాయక సామగ్రి, పలు సహాయక బృందాలు, విపత్తు నిర్వహణా టీములు వెంటనే పనిలోకి దిగడం అభినందనీయం.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

## పథకాలతో ప్రయోజనాలు

**ఇటీవల** తెలంగాణ ప్రభుత్వము తెస్తున్న రెండు పథకాలలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇది భూమిలేని నిరుపేదల పాలిటవరం. ఎందుకంటే రాజ్యగంలో ప్రస్తావించిన అధికరణ 41 ద్వారా పౌరుల పనికి హక్కును కల్పిస్తూ మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ చట్టంద్వారా పౌరులను కనీస సమయం పనిలో కచ్చితంగా భాగస్వాములను చేస్తూ మీవెంట మేమున్నాం అనే భరోసాను కల్పిస్తుంది. మరొకవైపు వడ్డీలేని రుణాలను మహిళలకు పెద్దమొత్తంలో అందిస్తూ మహిళలలో నాయకత్వ బాధ్యతను సమిష్టి తనాన్ని పెంచుతూ మహిళలను ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములను చేస్తూ బ్యాంకులద్వారా రుణాలు ఇవ్వడం ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతమవుతుంది.

-భారత అవినాష్, జనగామ

## అభివృద్ధికి కృషి చేయాలి

**హైదరాబాద్** సెంట్రల్ యూనివర్శిటీ భూమిని యూనివర్సిటీకే అప్పగించాలని కోరుతూ విద్యావ్యవస్థ బలోపేతంలో భాగంగా యూనివర్సిటీ భూములు యూనివర్సిటీ అభివృద్ధికే ఉపయోగించాలని తెలుపుతూభవిష్యత్తు తరాలకు సంపూర్ణ విద్యను అందించాలి అంటే యూనివర్సిటీలలోఉన్న భూములను క్రీడా మైదానాలకు ల్యాబ్‌లకు, నూతనకోర్సులు ప్రవేశపెట్టి భవన నిర్మాణాలు చేపట్టాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## 16వ వసంతంలోకి విద్యహక్కు చట్టం

**ఆరు** నుండి పధ్నాలుగు సంవత్సరాలు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అందించడం కోసం భారత పార్లమెంటులో 2009 ఆగస్ట్ 4న ఆమోదం పొందిఆగస్టు 26నాడు రాష్ట్రపతి ఆమోదం పొందింది. 2010 ఏప్రిల్ 1నుండి విద్యహక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఆర్టికల్ 21లో ఇది పొందుపర్చారు. విద్యను ప్రాథమిక హక్కుగా అందించే 135 దేశాల సరసన మనదేశం చేరింది. 7 అధ్యాయాలు, 38సెక్షన్లు, ఒక అనుబంధ సెక్షన్ పొందుపరిచారు. బడుల మంజూరు, విద్య పని దినాలు, ఉపాధ్యాయ విధులు, ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకి సీట్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. చట్టం అమలులోకి వచ్చి 16 సంవత్సరాలు అవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. బడులను మంజూరు చేయాలని చట్టంలో ఉంటే దేశ వ్యాప్తంగా హేతుబద్ధీకరణ పేరుతో బడులు మూసివేయడం చెస్తున్నారు. ఇప్పటికైన విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు చేయాలి. టీచర్లను బడుల్లో బోధనకు మాత్రమే వినియోగించుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేలా అందరూ కలిసి కృషి చేయాలి.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## తల్లిదండ్రులను గౌరవించండి

**తమ** జీవితాంతం పిల్లల కోసం బతికిన తల్లిదండ్రులనుచివరకు వృద్ధాశ్రమంలో, రోడ్లపైనా వదిలేస్తున్నారు కొందరు. తల్లిగా ప్రేమను పంచిన అమ్మ, కష్టపడి సంపాదించి చదువు చెప్పించి బిడ్డల ఉన్నతికి కారణమైన తండ్రి, రోడ్డుపై , వృద్ధాశ్రమంలో జీవిత చరమాంకంలో ఒంటరిగా, అనాథలా కాలం గడపాల్సి వస్తుంది. అదెంత బాధాకరం అనే విషయాన్ని పిల్లలు తెలుసుకోవాలి. రేపు తమ బిడ్డలు కూడా అలాగే చేస్తే అని ఒక్కసారి ఊహించుకుంటే ఇంకెప్పుడు అలాంటి తప్పు చెయ్యరు. పిల్లలు వృద్ధ తల్లిదండ్రులకు అండగా ఉంటే, సమాజం మరింత సంతోషకరంగా మారుతుంది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## తెలుగు భాషపై కమిటీ వేయాలి

**సుమేరియన్లు** తెలంగాణ ప్రాంతం నుండి వలస వెళ్ళారని ప్రొ. జేమ్స్ ఎడ్గర్ స్వైన్ పేర్కొన్నారు. తెలుగు భాష నుండే సుమేరియన్ భాష ఆవిర్భవించింది. తెలుగు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన భాష. తెలుగు భాష ప్రాచీనత గురించి అధ్యయనం చేయడానికి రాష్ట్రప్రభుత్వం కమిటీనిఏర్పాటు చేయాలి.

-పుట్లూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్'తో న్యాయం సాధ్యమా?

**న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలను కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏవిధంగా చట్టపరంగా పరిష్కరించగలదు అన్నదే దేశం ఎదుర్కొం టున్న సమస్య. తెరమీదికి అప్పుడప్పుడూ వచ్చే ఈ అంశం ఇప్పుడు ఢిల్లీ జడ్జి ఇంట్లోని కరెన్సీ మంటల ఆరోపణల నేపథ్యంలో తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన అంతర్గత న్యాయాధీశుల కమిటీ ఎలాంటి రిపోర్టు ఇస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాన్యుడు పౌరుడిగా ఈ దేశంలో జీవించే వ్యక్తి కోరుతున్నది ఒక్కటే. అవినీతి ఆరోపణ రాజకీయ నాయకుడు ఎదుర్కొన్నా, న్యాయాధీశులు ఎదుర్కొన్నా, ప్రభుత్వ ఉద్యోగస్థులు ఎదుర్కొన్నా చట్టాలు వారి పట్ల పారదర్శకతతో న్యాయాన్ని బాహాటంగా చేస్తేనే ప్రజాస్వామ్య విలువలను, మనుగడను కాపాడినట్లవుతుంది. ఈ అంటుకున్న నిప్పును కేవలం నామమాత్రంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌తో తాత్కాలికంగా ఆర్పుతే న్యాయం జరగదు.**



రావులపాటి సీతారాంరావు

ఢిల్లీ హైకోర్టు జస్టిస్ యశ్వంత్ వర్మ బంగ్లాలో అవుట్‌హౌస్‌గా పిలవబడే ఇంటి పరిసరాలలోనే తగలబడిన లెక్కకు మించిన కరెన్సీ నోట్లు, నిప్పును ఆర్పటానికి వచ్చిన ఫైర్ డిపార్టుమెంట్ వారు చూసి పోలీసులకు చెప్పారని అదీ, జస్టిస్ ఊళ్లోలేని సమయంలో జరిగిందని కథలుకథలుగా ఘటన గురించి వదంతులో, నిజాలో బయటకు వచ్చాయి. మొదట ఫైర్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి కాలిన కరెన్సీ మాట నిజం కాదన్నారు. తర్వాత నీళ్లు నమిలారు. కానీ ఈ సంఘటన జరిగిన మరునాటి సాయంత్రం ఢిల్లీ చీఫ్ జస్టిస్‌కు ఢిల్లీ పోలీసు కమిషనర్ సంఘటన గురించి తెలియపర్చారు. ఆ తర్వాత చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాకు కూడా తెలిసింది. వివాదంలో చిక్కుకున్న జడ్జిని తిరిగి అలహాబాద్ హైకోర్టుకు (ఆయన పారెంట్ కోర్టు) పంపటం జరిగింది. జడ్జిగారు ఆరోపణనుఖండించారు. బహుశా ఎవరి కుట్ర అయినా వుండొచ్చు అన్న సందేహాన్ని కూడా వెలిబుచ్చారు. ఉన్నతస్థాయిలో ఉన్న జడ్జీలు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవటం చాలా అరుదు. అన్నివ్యవస్థలూ పారదర్శకత లోపించి, అవినీతికి పాల్పడుతున్నప్పుడు న్యాయస్థానాలు నిప్పులాంటివి అని, చెదలు అంటవని భారతదేశవాసుల ప్రగాఢనమ్మకం. ఆ నమ్మకం నీరు కారిపోవటంతో న్యాయవ్యవస్థ కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న జాబితాలో చేరటం, వ్యవస్థకు కాదు నష్టం, దేశం అనుసరిస్తున్న రాజ్యాంగానికీ, ప్రజాస్వామ్యానికి అపార నష్టం కలిగిన భావనతో ప్రస్తుత సమాజం ఉండటం కదు విషాదకరం. ఇది కేవలం టీకప్పులో తుఫాన్‌గా చెదిరిపోవాలనే సామాన్యులు ఇప్పటికీ ఆశిస్తున్నారు. న్యాయస్థానాలలో అవినీతి చోటు చేసుకుంటున్న అంశం పూర్వాపరాలు గమనిస్తేఇదేమీ కొత్తగా బయటకు వచ్చిన మురికికాదు అని విశ్లేషకుల అభిప్రాయం. అభిప్రాయాలు వేరు, నిజాలువేరు. నిజాలు నిగ్గుతేల్చడానికే ఉన్నత న్యాయస్థానం అంతర్గతంగా ఒక జడ్జీల కమిటీని నియమించి వారు ఇచ్చేరిపోర్టు కోసం ఎదురు చూస్తున్నది. సుప్రీంకోర్టే కాదు, దేశంలో అన్నివ్యవస్థలతోపాటు సామాన్య ప్రజానీకం కూడా ఎదురుచూస్తున్న మాట నిజం. కొన్నేళ్ల కిందట పట్టాభిరామారావు అనే సెషన్స్ జడ్జి స్థాయి న్యాయాధీశుడు, అందరికీ తెలిసిన కర్ణాటక మైనింగ్ కింగ్, గాలిజనార్ధన రెడ్డి కేసు విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని, అరెస్టు కాబడి, అవమాన భారాన్ని తట్టుకోలేక బెయిల్ మీద ఉన్నప్పుడు ఆత్మహత్య కు పాల్పడ్డారని ఒక కథనంగా ఘటనగా ఇప్పటికీ మర్చిపో లేదు. ఈ కొత్త ఆరోపణ, ఉన్నత న్యాయాధీశుడు మీద వెలుగులోకి రావటంతో మళ్లీ ఈ సంఘటన గురించి చర్చించుకుంటున్నారు. లోయర్ లెవల్‌లో ఉన్న జడ్జి కాబట్టి సి. బి.ఐ ఆయన మీద తీవ్రచర్యలు తీసుకున్నట్లుగా భావిస్తున్నారు కానీ, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయాధీశులకు ఇంపీ చ్‌మెంట్ మాత్రమే చర్యలకు ఆఖరిఅస్త్రంగా ఉండటం గమనార్హం. సామాన్యుడికి ఒక న్యాయం, న్యాయం చెప్పే వారికి మరొక న్యాయం



అన్న అంశం బయటపడింది. రాజ్యాంగంలో ఇలాంటి భేదాలు చోటు చేసుకున్నాయా, న్యాయస్థానాలు చట్టాలను విశ్లేషించి అవసరమైతే తగు చర్యలతోపాటు లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ఉన్నది కదా అన్నదే చర్చ. ఒకటో, రెండో కేసులు వారి పరిధిలో విచారణకు వచ్చిఉండొచ్చు. కానీ అవి అంతగా వెలుగుచూడ లేదు. ప్రజాబాహుళ్యంలో నాన లేదు. అందుకే ఇంకా ఈ చట్టం గురించి అవగాహనా లోపం వల్లనో, స్పష్టత లేకపోవడం వల్లనో పరిస్థితులు, న్యాయాన్యాయాలు క్షుణ్ణంగా ప్రజాస్వామ్యంలో వ్యవహరిస్తున్న మనదేశంలోని చట్టసవర ణకు ప్రతిపాదనలు చోటు చేసుకోలేదు. ప్రముఖ పబ్లిక్ ఇంట్రెస్ట్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఈ సమస్యను వివరిస్తూ మీడియాలో ఒక వ్యాసం ద్వారా తన అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సంఘటన వల్ల ఉత్పన్నమైన పరిస్థితుల ను ప్రభుత్వం తమకు వీలుగా మల్చుకొనే ప్రయత్నంలో భాగంగా జడ్జీలను నియమించే విషయాన్ని పూర్తిగా తమ కంట్రోల్‌లోకి తీసుకొనేప్రయత్నం మరొకసారి చేస్తున్నదని అభిప్రాయపడ్డారు. అందుచేతే రాజ్యసభ ఛైర్మన్ వైస్ ప్రెసి డెంట్ రాజకీయ నాయకులను (అన్ని పక్షాల నుంచి) సమావేశపర్చి నేషనల్ జ్యూడిషియల్ అపాయింట్‌మెంట్ యాక్ట్‌ను కొట్టేసిన తిరిగి ఎందుకు చట్టపరిధిలోకి తీసుకొని రాకూడదన్న వివాదాంశాన్ని తెరమీదికి తీసుకొని వచ్చారు. (సుప్రీం ఆ యాక్ట్ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను ఉల్లంఘిస్తుందని కొట్టి వేయడం జరిగింది)సుప్రీంకోర్టు జ్యుడిషియల్ అపా యింట్‌మెంట్స్ విషయంలో ప్రభుత్వ జోక్యం సరికాదన్న భావనతో ఈ యాక్ట్‌ను కొట్టేసింది. ఆ విషయాన్ని జడ్జిల అవినీతి ఆరోపణలతో ముడిపెట్టిన చర్చలు అవసరమా? విషయం ఒకటవుతే మరొక విషయాన్ని ముడిపెట్టి సమస్య పరిష్కారం బదులు సమస్యలో భాగంకావడం ఎంతవరకు సమంజసమని కొందరు విజ్ఞులు కూడాభావిస్తున్నారు. అయితే జడ్జీల నియామకాలు కొలీజియం వ్యవస్థ పారదర్శకత లోపించి పూర్తిన్యాయం చేకూర్చటం లేదన్న భావన కూడా న్యాయనిపుణులలో ఉంది. ఆ సమస్యను తేలిగ్గా తీసివేయడం సమంజసం కాదని మరి కొందరి అనుభవజ్ఞుల అభిప్రాయం. ప్రభుత్వం ఎక్కువగా న్యాయమూర్తుల నియామకాలు నియంత్రణ చేయడంకూడా ఈ సమస్యకు పరిష్కారంకాదు. కొలీజియంలోని సిట్టింగ్ జడ్జీలు పనిభారంతో సతమతమ వుతున్నారు. అందుకనే నియామకాల బాధ్యతను పూర్తి ఏకాగ్రతతతో నిర్వర్తించలేకపోతున్నారు. సంవత్సరానికి వందలమంది జడ్జీల నియామకాలు జరగాల్సిన అవసరంఉంది. పూర్తిస్వేచ్ఛతో ఈ బాధ్యతను నిర్వహించటానికి జ్యుడిషియల్ అప్పాయింట్‌మెంట్ కమిషన్ లాంటిది మిగతా నియామకాల వ్యవస్థల మాదిరి చట్టం ద్వారా నిర్దిష్టమైన మార్గదర్శకాలతోటి, అనుభవం కలిగిన వ్యక్తులతోటి జడ్జిలనియా మకాలు చేపట్టటం అనేది మరొక పరిష్కారంగా భావించవచ్చు. న్యాయవ్యవస్థలోని అవినీతి ఆరోపణలను కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఏవిధంగా చట్టపరంగా పరిష్కరించగలదు అన్నదే దేశం ఎదుర్కొంటున్న సమస్య. తెరమీదికి అప్పుడప్పుడూ వచ్చే ఈ అంశం ఇప్పుడు ఢిల్లీ జడ్జి ఇంట్లోని కరెన్సీ మంటల ఆరోపణల నేపథ్యంలో తక్షణ పరిష్కారాన్ని కోరుతున్నది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన అంతర్గత న్యాయాధీశుల కమిటీ ఎలాంటి రిపోర్టు ఇస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. సామాన్యుడు పౌరుడిగా ఈ దేశంలో జీవించే వ్యక్తి కోరుతున్నది ఒక్కటే. అవినీతి ఆరోపణ రాజకీయ నాయకుడు ఎదుర్కొన్నా, న్యాయాధీశులు ఎదుర్కొన్నా, ప్రభుత్వ ఉద్యోగస్థులు ఎదుర్కొన్నా చట్టాలు వారి పట్ల పారదర్శకతతో న్యాయాన్ని బాహాటంగా చేస్తేనే ప్రజాస్వామ్య విలువలను, మనుగడను కాపాడినట్లవుతుంది. ఈ అంటుకున్న నిప్పును కేవలం నామమాత్రంగా ఫైర్ ఫైటింగ్ ఆపరేషన్‌తో తాత్కాలికంగా ఆర్పుతే న్యాయం జరగదు. •

# వినియోగదారుల హక్కుల పట్ల అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, ప్రమాణం. వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల హక్కు అని అర్థం. భారత దేశంలో 1986లో వినియోగదారుల ప్రయోజనార్థం, వారి హక్కుల పరిరక్షణ కోసం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం రూపొందించారు. ఈ చట్టం ప్రకారం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రకటించింది. వినియోగదారుల రక్షణ మానవ ప్రాణాలకు, ఆస్తికి ప్రమాదకారక వస్తువులు, సేవల నుంచి రక్షణపొందే హక్కు. అవసరాలు తీర్చడమే కాకుండా, దీర్ఘకాలం మన్నే వస్తువులు సేవలను పొందాలి. అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు వస్తు నాణ్యత, బరువు, స్వచ్ఛత, పుష్టి, ప్రమాణం గురించి తెలియజేయాలి. నాణ్యమైన సేవలు పొందే సమాచారాన్ని తెలుసుకునే హక్కు ఉంది. వస్తువులను, సేవలను ఎంపిక చేసుకునే హక్కు. వివిధ రకాల వస్తువులు, సేవలు పొందేటప్పుడు వాటి మధ్య రేటు తెలుసుకోవడం మంచిది. సముచిత రేటులో నాణ్యత, సేవలు పొందడం. వినియోగదారుల ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా సేవాలోపాలు, లోపాల నుండి పరిహారం పొందేహక్కు. వినియోగదారులు మోసానికి గురయినప్పుడు ఫోరంలో కేసులు వేసి, తగిన పరిహారాన్ని పొందడం. వినియోగ దారుల విద్య హక్కు. వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ, తమ జ్ఞానాన్ని పెంచుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతోఅవసరం. గ్రామీణ ప్రాంతాలలో వినియోగదారులు హక్కుల పట్ల అవగాహన లేకఎంతో మోసపోతున్నారు. నూతన వ్యాపారాభివృద్ధి సంస్కరణల వల్ల ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో, ఈకామర్స్, టెలిషాపింగ్ విధానంలో వస్తువుల్ని కొనుగోలు చేస్తున్నారు. తక్కువ సమయంలో, అతి తక్కువ రుసుంతో, దళారుల ప్రమేయం లేకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ వినియోగదారుల ఫోరాల్ని, కమిషన్లను ఆశ్రయించి వ్యక్తిగతంగా సత్వర న్యాయం పొందే సౌలభ్యం దీని ద్వారా లభించింది. వినియోగదారు రక్షణచట్టంలోని 9వ సెక్షన్ మూడు అంచెల వివాద పరిష్కారసంస్థల ఏర్పాటుకు మార్గంసుగమం చేసింది. కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేసే జాతీయ వినియోగదారు వివాదాల పరిష్కార సంఘం. ఈ కోర్టునే జాతీయ సంఘంగా వ్యవహరిస్తారు. కేంద్రప్రభుత్వం ముందస్తు అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటుచేసే రాష్ట్రవినియోగదారు పరిష్కారసంఘం. ఈ కోర్టునే రాష్ట్ర సంఘంగా కూడా వ్యవహరిస్తారు. ఈ ఏజెన్సీలన్నీ వాటి స్వభావం, అధికారాల పరంగా క్వాసీ జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి. జాతీయస్థాయిలో సెంట్రల్ కన్స్యూమర్ అథారిటీ అనే ప్రత్యేక వ్యవస్థను రూపొందించి తగిన విచారణాధికారాలు, విచక్షణాధికారాలు కల్పించారు. ఇందులో డైరెక్టర్ జనరల్ స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉంటుంది. నేరాలకు పాల్పడినట్లు నిరూపితమైన వ్యక్తులపై, సంస్థలపై అవసరమైన చర్యలు తీసుకుంటారు. నూతన చట్టం ప్రకారం అరెస్టులు చేయించే అధికారం, మూడు సంవత్సరాల వరకు జైలు శిక్షను, పది లక్షల రూపాయల వరకూ జరిమానాను విధించే అధికారం సెంట్రల్ అథారిటీకి ఉంటుంది. జిల్లా కమిషన్లు ఇచ్చిన తీర్పులపై ఉన్నత రాష్ట్రస్థాయి కమిషన్‌ను ఆశ్రయించేందుకు వ్యతిరేక పార్టీ కనీసం యాభైశాతం లేదా రూ.25 వేలు రాష్ట్ర కమిషన్‌లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. •

# తీవ్ర ఒత్తిడిలో ఉపాధ్యాయ లోకం

శ్రీశ్రీ కుమార్

విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ లోకమే నేడు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నట్టు స్పష్టమవుతున్నది. పరీక్షలు, ఫలితాలు వాటితో పాటుగా ప్రమాణాల పేరుతో రకరకాల సర్వేలు, రిపోర్టులు తయారవుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి పెరుగుతుండడం గమనార్హం. పబ్లిక్ పరీక్షలలో ఫలితాలు ఇంత శాతం సాధించాలని జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ప్రతి సంవత్సరం నిర్దేశించడం మామూలే. ఫలితాలు అనేవి నిర్దేశిస్తే వచ్చేవి కావని మన అధికారులు ఎప్పటికీ గ్రహించలేరు. వారు క్షేత్రస్థాయిలో వాస్తవాలు గ్రహించకుండా కేవలం ప్రభుత్వాల మెప్పుపొందడం కోసమే ఈ రకమైన నిర్దేశాలు, ఆదేశాలు జారీ చేస్తారు. వారు ఆ రకంగా ఉపాధ్యాయ లోకంపై ఒత్తిడి పెంచడం, ఉపాధ్యాయులు విద్యార్థులపై ఒత్తిడి పెంచడం పర్యవసానంగా విద్యార్థులు తీవ్రమైన చర్యలకు అనగా ఆత్మహత్య లాంటి చర్యలకు పాల్పడడం మనం ప్రతి ఏడూ చదువుతాం. ఫలితాలలో ప్రమాణంగా భావించినంత కాలం నిజమైన ప్రమాణాల స్థాయి ఎప్పటికీ మెరుగుపడదనేది వారు గ్రహించాలి. మనదేశంలో విద్యను ఆషామాషీగా ఆటపాటలుగా నేర్చుకోవడం జరగడం లేదు. అది ఒక తపస్సు లాగాసాగుతుంది. మే నెలలోనే తదుపరి విద్యా సంవత్సరానికి ఒక క్యాలెండర్ తయారు చేయించడం కోసం కొంతమంది మేధావులు నియమింపబడుతారు. వారు తమదైనశైలిలో తమస్థాయిలో ఒక క్యాలెండర్ తయారు చేసి ఆమోదింపచేసుకున్న తర్వాత అన్ని పాఠశాలలకు కళాశాలలకు పంపడం జరుగుతుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులతో నిమిత్తం లేకుండా ఏసీ గదుల్లో కూర్చుని తయారు చేసే క్యాలెండర్ వాస్తవాల లోతుల్లోకి చూడకపోగా కనీసం వాటి దరిదాపుల్లో కూడా చేరదు. అందుకే అవన్నీ ప్రయోగాత్మక వైఫల్యాలే. కేవలం పరీక్షల నిర్వహణా మాత్రమే ఆ క్యాలెండర్ ప్రకారం సజావుగా జరుగుతుంది. వాటిలక్ష్యాలు, స్పష్టీకరణలు ఏ మేరకు సాధించగలుగుతున్నారనే ఒక చర్చ ఏనాడూ జరగదు. ప్రతి పాఠ్యాంశానికి సంబంధించిన విషయ బోధన, గ్రహణ లాంటివి ఆచరణాత్మకంగా తయారు కావాలి. సెకండరీ స్థాయిలో కూడా విద్యార్థులకు కనీస సామర్థ్యాలు లేకపోవడం శోచనీయం. అందుకు ఉపాధ్యాయులను నిందించడం దుర్మార్గం. అనేక కారణాలు సమస్యలు ముప్పిరిగొన్న నేపథ్యంలో కనీస సామర్థ్యాల సాధన ఎప్పటికైనా అందని ద్రాక్షే. ఉపాధ్యాయులకు స్వేచ్ఛ లేదు. వారిని ఒక చట్రంలో బిగించి ఈ విధంగానే బోధించాలి, ఇవే బోధించాలి, వాటి ఫలితాలు ఇవే కావాలి అన్నట్లు అధికారులు నిర్దేశించడం హేతుబద్ధం కాదు. అసలు వారికి తరగతి గది పనికి మించి ఇతర కార్యక్రమాలు పనులు ఎక్కువవుతున్నాయి. చివరికి వారు కంప్యూటర్ల లాగానే మానవ రోబోలుగాను మారే పరిస్థితులు దాపురించాయి. బోధన కన్నా బోధనేతర పనులు ఎక్కువైనాయి. అధికారులు కూడా విద్యా ప్రమాణాల గూర్చి, తరగతి బోధనగూర్చి ఏనాడూ పట్టించుకున్న పాపాన పోరు. వారికి కావలసిన, వారు తిరిగి పైఅధికారులకు సమర్పించవలసిన సమాచారం కాగితాల రూపంలో అందిందా లేదా అన్నదే వారి బాధ. అంకెల రూపంలో సమాచారం మాత్రమే వారికి ముఖ్యం. క్షేత్రస్థాయిలో నిజమైన బోధన జరుగుతున్నదో లేదో వారికి



అనవసరం. ప్రమాణాలు మెరుగుపడుతున్నాయా లేదా విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెరుగుదల వారికి ఏనాడు పట్టవు. నైపుణ్యం వెలికి తీసే చర్యలు ఏమీఉండవు. ఆలోచనలకు, సృజనాత్మకతకు తావులేకుండా మన విద్యాధికారులు ఒక ఏడాదికి సరిపోను కార్యక్రమాలు తయారు చేయడం శోచనీయం. వారు మనుషులతో కాకుండా కాగితాలతోనే మాట్లాడతారనేది వాస్తవం. అసలు మంత్రులైనా, అధికారులైనా క్షేత్రస్థాయిలో వాస్తవాలు అధ్యయనం చేశారా వాటిపై సమగ్రమైన సమీక్ష జరిపారా అనేది ఉపాధ్యాయ లోకం ప్రశ్నించాలి. ముఖ్యంగా కరోనా అనంతరపరిస్థితుల్లో విద్యార్థులను నాలుగు గదులకు పరిమితం చేసి వారిచే పాఠ్యాంశాలు చదివించడం, వారికి వినిపించడం ఉపాధ్యాయులకు గగన కుసుమమైన పరిస్థితి. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడటం ఒక సంవత్సరానికి పైగా పాఠశాలలకు దూరం కావడం చదువుకు దూరం కావడం ఇలాంటి సమస్యలు మనం తరగతి గదిలో ఎదుర్కొంటున్నాం. కొవిడ్ తర్వాత విద్యార్థులలో మానసిక శారీరక మార్పులు చోటు చేసుకోవడంతో వారిని నియంత్రించడం సరైన మార్గంలో నడిపించడం ఉపాధ్యాయులకు కష్ట సాధ్యమవుతుందనేది కాదనలేని వాస్తవం. కానీ ఇవన్నీ పట్టని అధికారులుమాత్రం మీరు ఏ విధంగానైనా తాము నిర్దేశించిన ఫలితాలు తేవాల్సిందే అనడం ఉపాధ్యాయ లోకాన్ని మరింత సమస్యల వలయంలోకి నెట్టివేస్తున్నది. వారిచే ఇష్టం లేని అనైతిక చర్యలకు పాల్పడేలా చేస్తున్నది. ఎందుకంటే ప్రమాణాల కంటే ఫలితాలు అధికారులను సంతృప్తి పరుస్తాయి. ప్రశ్నపత్రం సరిగా తయారు చేయించలేని లీకులు లేకుండా పరీక్షలు సక్రమంగా జరుపలేని ప్రభుత్వాలు ఫలితాల విషయంలో మాత్రం ఉపాధ్యాయ లోకాన్ని తప్పుపడుతున్నది. ఇటు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, అటు అధికారుల మధ్య ఉపాధ్యాయులు నలిగిపోయి తమ విధులుసక్రమంగా నిర్వహించలేకపోతున్నారనేది కఠినమైన నిజం. మొన్న విజయనగరం జిల్లాలో ఒక ప్రధానోపాధ్యాయుడు ఉదయం పూట విద్యార్థుల ఎదుట తనను తాను శిక్షించుకున్నాడు. విద్యార్థులు సరిగాచదవలేకపోతున్నారని వారు కనీస సామర్థ్యాలు సాధించలేకపోతున్నారని బాధతో ఒక నిస్సహాయ పరిస్థితుల్లో మాత్రమే సదరు ప్రధాన ఉపాధ్యాయుడు ఆ రకమైన చర్యకు పాల్పడ్డాడు. అది ఆ ఒక్కప్రధాన ఉపాధ్యాయుడి స్థితి మాత్రమే కాదు. మొత్తం ఉపాధ్యాయ లోకం మానసిక దైనస్థితిని తెలియజేస్తున్నది. దానికి కారణాలు విశ్లేషించాలి. వాటికి పరిష్కారాలు కనుక్కోవాలి. సమస్య లోతుల్లోనికి పోకుండా రోగనిర్ధారణ సరిగా జరగకుండా కేవలం పైపూత మందులు పనిచేయవు. ఉపాధ్యాయులు తరగతి గదులలో అద్భుతాలు సృష్టించగలరు కానీ వారు సంతోషంగా స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులుండాలి. విద్యార్థి ఒక్క ఉపాధ్యాయుడితో ఉండేది కేవలం 45 నుండి 50 నిమిషాలు మాత్రమే. మొత్తం పాఠశాలలో ఆరు గంటలు ఉంటాడు. ఒక్కొక్క ఉపాధ్యాయుడు విద్యార్థులను ఒక్కొక్క రీతిలో ప్రభావితం చేస్తాడు. సమగ్ర మూర్తిమత్వ రూపకల్పనలో ఎన్నో అంశాలు విద్యార్థిని ప్రభావితం చేస్తుంటాయి. ఇవికాక తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలు, ఆకాంక్షలు, తోటి విద్యార్థుల ఆలోచనలు కూడా ఇందులోభాగమే. అధికారులు రకరకాల పేర్లతోవిద్యార్థుల సామర్థ్యాల మదింపు చేస్తూ ఉపాధ్యాయులను విద్యార్థులను గందరగోళంలో పడవేస్తున్నారు. స్వీయ శిక్షలు క్రమశిక్షణరాహిత్యాన్ని మార్చలేవు. కేవలం సానుభూ తిని మాత్రమే పెంచుతాయి. చాలీచాలని జీతంతో, డిమాండ్ చేసినా తమ హక్కు అయిన డిఏలు రాక, తమ సొంత పిల్లల చదువులు పట్టించుకోలేక తమ ఆరోగ్యాలు పణంగా పెట్టి నిస్వార్థంగా సేవచేసే ఉపాధ్యాయులకు ఇటు ప్రభు త్వంలోనూ సమాజంలోనూ గుర్తింపు గౌరవం లోపిస్తున్న సందర్భం ఇది. పిఆర్సి గొంతెమ్మ కోరిక అయినది. డిఏలు అడగొద్దంటున్నారు. విద్యకు నిధులు కేటాయింపులు అరకొరగానే ఉంటున్నాయి. ఏనాడో చెప్పిన ఆరు శాతానికి ఆరు దశాబ్దాలు దాటినా దిక్కులేదు. నిత్యం అసంతృప్తితో పని చేస్తే ఆ పనిలో ఎవరూ పరిపూర్ణత సాధించలేరు. •

# నెలాఖరుకల్లా బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక!

## పది నెలలుగా పెండింగ్‌లోనే..



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** భారతీయ జనతాపార్టీకి సుదీర్ఘకాలంగాపెండింగ్‌లో ఉన్న జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ఈ నెలాఖరుకు పూర్తి అవుతుందని అంచనా. గడచిన పదినెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ బిజెపిదేశాధ్యక్షుడి ఎన్నికకు కసరత్తులు ముమ్మరంచేస్తున్నారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన వెంటనే బిజెపి ఇక సంస్థాగత కార్యక్రమాలపై ఫోకస్ పెంచుతోంది. ఎన్నికలు ఇప్పటికే ట్రాక్‌లోకి వచ్చాయి. గత నెల 15వ తేదీనాటికే జరగాల్సి ఉన్నప్పటికీ పార్లమెంటు సమావేశాలకారణంగా వాయిదాపడింది. మొత్తం 13 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించారు. మిగిలిన 13 రాష్ట్రాల సంస్థాగత అధ్యక్షుల ఎన్నిక పూర్తి అయిన వెంటనే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక మొదలవుతుంది. వచ్చే వారంరోజుల్లోనే మిగిలి ఉనన కీలక రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లలో రాష్ట్ర చీఫ్‌లను ప్రకటిస్తారు. మొత్తం 19 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించిన తర్వాత పార్టీపరంగా జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం అవుతుంది. బిజెపి జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు 50 శాతం రాష్ట్రాల సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకుని రాష్ట్రాల చీఫ్‌లను ప్రకటించి ఉండాలి. అంతకుముందే బూత్, మండల్, జిల్లాస్థాయిలో ఎన్నికలు పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డా బిజెపి జాతీయ అధ్యక్షుడుగా 2019లో బాధ్యతలు చేపట్టారు. 2020లో ఆయన బిజెపి జాతీయ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుత హోంమంత్రి అమిత్‌షానుంచి ఆయన పాలనపగ్గాలుచేపట్టారు. ఆ తర్వాత ఆయన పదవీకాలం 2024 జూన్‌వరకూ పొడిగించారు. ఆకాలంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నందున సంస్థాగత ప్రక్రియను వాయిదావేసారు. ఇక కేంద్రకేబినెట్‌లోకి ఆయన్ను చేర్చుకోవడంతో ఇపుడు జోడుపదవులకు బ్రేక్‌చెపుతూ అర్హుడైన జాతీయ నాయకుడికోసం అన్వేషణ సాగుతోంది. ఈప్రక్రియలో బిజెపి కులాల సమీకరణ చూడాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇటీవలి కాలంలో పెరిగిపోయిన ఉత్తర దక్షిణ వివాదాలను కూడా సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. అలాగే పునర్విభజన, భాషా వివాదాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాల్సి ఉంటుంది. ఉత్తరప్రదేశ్‌లో పార్టీబేస్‌ను మరింత శక్తివంతంచేసుకునేందుకు ఇప్పటికే బిజెపి ఒత్తిడి ఎదుర్కొంటున్నది. లోక్‌సభ ఎన్నికల్లో కొంతమేర పార్టీకి విఘాతం కలిగిన సంగతి తెలిసిందే. యుపిలో సీట్లు మెజార్టీ సాధిస్తే లోక్‌సభలో సింగిల్ హ్యాండెడ్‌గా నడుస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. అన్నివర్గాలకు ఆమోదయోగ్యుడయిన వ్యక్తి పార్టీ అధ్యక్షుడిగా రావాలి. బిజెపి సైద్ధాంతిక గురువు రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ ప్రభావంతోపాటు సంస్థాగత విలువలను పరిరక్షించుకుంటూ ముందుకుపోయే నాయకుడి అన్వేషణకు బిజెపి ఇప్పటినుంచే మొదలు పెట్టింది.

# ఒకరి అరెస్టు తప్పదు

**ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు**



**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ (డిఒజిఇ) శాఖ సారథిగా ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోషల్ సెక్యూరిటీ డేటాబేస్ నుంచి 4 లక్షల నంబర్లు దొంగలించిన వ్యక్తి రేపు అరెస్టు అవుతారని పేర్కొన్నారు. మస్క్ మాట్లాడిన ఒక వాయిస్ నోట్‌ను డోజ్ డిజైనర్స్ ఎక్స్‌లో పోస్టు చేసింది. ఆడియో ప్రకారం 'రేపు ఒకరిని అరెస్టు చేయ బోతున్నారు. అతడు సోషల్ సెక్యూరిటీ డేటా బేస్ నుంచి 4 లక్షల సోషల్ సెక్యూరిటీ నం బర్లను, వ్యక్తగత సమాచారాన్ని దొంగలించి, విక్ర యించాడు. ఇది వలసదారులను అక్రమ ఓటర్లుగా మార్చే వేదికగా మారింది' అని మస్క్ పేర్కొన్నారు. అమెరికా పౌరులు ఆని ప్రజలకు వీటిని అందించి తమకు ఇష్టమైన వ్యక్తులకు ఓటు వేసేలా ప్రేరేపిస్తున్నారని మస్క్ ఆరోపించారు. ఈ సందర్భంగా మస్క్ డెమోక్రాట్లపైనా పలు విమర్శలు చేశారు. అక్రమ వలసదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు డెమోక్రాట్లు ప్రభుత్వంలోని ప్రతిదాన్ని వినియోగించార న్నారు. జాతీయ విపత్తులు నుంచి దేశంలోని పౌరులను రక్షించేందుకు ఫెమాకు అందించే నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపించారు. వాటిని న్యూయార్క్‌లోని లగ్జరీ హోటల్స్‌లో అక్రమ వలసదారులను ఉంచేందుకు వినియోగించారన్నారు. గతంలోనూ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ మస్క్ ఇదే వ్యాఖ్యలు చేశారు. ఇక ఈ అంశంపై దర్యాప్తు సంస్థలు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఇటీవల కాంగ్రెస్‌లో ప్రసంగించే సమయంలో సోషల్ సెక్యూరిటీ నిధుల దుర్వినియోగంపై ట్రంప్ పలు వ్యాఖ్యలు చేశారు. భారీ స్థాయిలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలిందన్నారు. సోషల్ సెక్యూరిటీ మాజీ కమిషనర్ ఆస్ట్రూ దీనిపై స్పందించారు. ట్రంప్ యంత్రాంగానికి సోషల్ సెక్యూరిటీపై సరైన అవగాహన లేదని విమర్శించారు. దీనికి ఉపయోగించే పాత, ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై డోజ్ బృందానికి నైపుణ్యం లేదన్నారు.

# భూకంప మృతులు 2719 పైనే..!

## మరో 441 మంది ఆచూకీ గల్లంతు

## తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్న 4521 మంది క్షతగాత్రులు



**నాయ్‌పైథా(మైన్మార్), ఏప్రిల్ 1:** మైన్మార్‌లో సంభవించినభూకంపాలలో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గతవారంలో వచ్చిన ఈ భూకంప ధాటికి 2719 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సూనిక ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో ఐదేళ్లలోపు చిన్నారులు 50 మంది ఉన్నారని తెలిపాయి. 4521 మంది గాయపడగా 441 మంది ఆచూకీ ఇప్పటికీ లభించాల్సి ఉంది. సైనికపాలన అంతర్యుద్ధాలతో మగ్గిపోతున్న మైన్మార్‌ప్రజలపై గత వారం సంభవించిన భూకంపం తీవ్రప్రభావమే చూపించింది. ప్రాణ, ఆస్తినష్టం భారీస్థాయిలో ఉంది. సహాయక బృందాలు చేరుకోలేని ప్రాంతాలు ఇప్పటికీ అనేకం ఉన్నాయి. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది. మండుటెండలో ఉత్త చేతులతో చిన్నచిన్న పారలతో శిథిలాలను తొలగిస్తూ ఎవరైనా ప్రాణాలతో ఉన్నారేమో తెలుసుకునేందుకు వారి కుటుంబీకులు యత్నిస్తున్నారు. ప్రీస్కూలు కూలిపోవడంతో 50 మందిచిన్నారులు, ఇద్దరు టీచర్లు చనిపోయినట్లు ఐక్యరాజ్యసమితి సిబ్బంది వెల్లడించారు. కొన్ని భూకంప తాకిడిప్రాంతాలకు తరలివెళ్లేందుకు ఆయా చోట్లప్రభుత్వ తిరుగు బాటు దళాలమధ్య జరుగుతున్న ఘర్షణలు అవరోధంగా మారాయి. ఈ పరిణామాలమధ్య మృతులసంఖ్య ఎంతకు చేరుతుందోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం నీరు, షెల్టర్ తక్షణమే అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. ఇదిలా ఉంటే బ్యాంకాక్‌లో కూలిన భారీ భవనం శిథిలాల్లో అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. బ్యాంకాక్‌నిర్మాణంలో ఉన్న 30 అంతస్తుల భవంతి పేకమేడలా కూలిపోయింది. మొత్తం 74 మంది శిథిలాలకింద ఉన్నారని చెపుతున్నా ఆ శిథిలాలకింద 300నుంచి 400కు పైగా ఉంటుందని అధికారులే అంచనాలు వేస్తున్నారు. శిథిలాలకింద చిక్కుకున్నవారిలో 60 మంది మైన్మార్ వాసులున్నారు. మిగిలిన వారంతా కూలిపనులకోసం విదేశాలనుంచి తీసు కువచ్చిన కార్మికులేనని చెపుతున్నారు. 2020లో ఈభవన నిర్మాణంప్రారంభించారు. చైనాకు చెందిన ఒకసంస్థకు భాగస్వామ్యం ఉంది. ఈ భవంతి కూలినతర్వాత నలగురు చైనీయులు శిథిలాలు ఉన్న ప్రాంతం వద్దకు అక్రమంగా వెళ్లి కొన్ని పత్రాలు తీసుకునేందుకు యత్నించారని తేలింది. ఇతర భవనాలు సురక్షితంగానే ఉన్నా ఈ భవనం కూలిపోవడం అనుమానాలకు తావిస్తోంది నాసిరకం ఉక్కు, ఇతర నిర్మాణ సామగ్రి వాడినట్లు గుర్తిం చామన్నారు.

# నేను ఒక యోగిని.. పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్‌కాదు

**యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్**



**లక్నో, ఏప్రిల్ 1:** ప్రధాని నరేంద్ర మోడీ వారసత్వం గురించి మహారాష్ట్ర అధికారి, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తన రాజకీయ జీవితంపై యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నేను రాష్ట్రానికి ముఖ్యమంత్రిని . పార్టీ నన్ను యుపి ప్రజల కోసం నియమించింది. అందుకే రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తున్నారు. ఇక పాలిటిక్స్ నాకు ఫుల్‌టైమ్ జాబ్ కాదు. వాస్తవానికి 'నేను ఒక యోగిని' అని ఆయన పేర్కొన్నారు. ప్రతి పనికి ఒక కాలపరిమితి ఉంటుందని అదేవిధంగా తన రాజకీయ జీవితానికి కూడా పరిమితి ఉంటుందని అన్నారు. జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపి హైకమాండ్‌తో తనకు విభేదాలు ఉన్నాయని వస్తున్న వార్తలను యోగి ఖండించారు. తనకు పార్టీ ఇచ్చిన అవకాశం వల్లే ఇక్కడ కూర్చున్నానని, పార్టీ పెద్దలతో విభేదాలు ఉంటే ముఖ్యమంత్రి స్థానంలో కొనసాగేవాడిని కాదని అన్నారు. ఎవరో ఒకరు తప్పుడు ప్రచారాలు చేస్తూనే ఉంటారని వాటిని తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. నాగ్‌పుర్‌లోని సంఘ్ ప్రధాన కార్యాలయాన్ని ప్రధాని నరేంద్రమోడీ సందర్శించడంపై శివసేన నేత సంజయ్‌రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

గత పదేళ్లలో ఎన్నడూ ఆర్‌ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లని ప్రధాని ఇప్పుడు వెళ్లడం వెనుక ముఖ్యమైన కారణం ఉండవచ్చని అన్నారు. ఆయన పదవీవిరమణ చేయాలని యోచిస్తున్నారని తన రిటైర్మెంట్ ప్రణాళికల గురించి ఆర్‌ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో చర్చలు జరపడానికే అక్కడికి వెళ్లి ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశ రాజకీయ నాయకత్వంలో ఆరెస్సెస్ మార్పు కోరుకుంటోందని, మోడీ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని అన్నారు. ఆయన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కొట్టిపడేశారు. ఈ నేపథ్యంలో యోగి ఆదిత్యనాథ్ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## పార్కు చేసిన ట్యాంకర్ నుంచి విషవాయువు లీక్

# ముగ్గురు మృతి, 50 మందికి తీవ్ర అస్వస్థత



**జైపూర్,ఏప్రిల్ 1:** రాష్ట్రంలోని బేవార్‌జిల్లాలో ఉన్న రసాయన కర్మాగారంలో పార్కుచేసిన ట్యాంకర్‌నుంచి ప్రమాదకర విషవాయువు విడుదల కావడంతో ముగ్గురు చనిపోయారు. 50 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఫ్యాక్టరీ యజమానితోపాటు మరో ఇద్దరు కూడా చనిపోయినట్లు తేలింది. జిల్లాకలెక్టర్ మహేంద్ర ఖడ్‌గావత్ మాట్లాడుతూ నైట్రిక్‌యాసిడ్ లీకు వల్ల ఈప్రమాదం జరిగిందని, నివాసిత ప్రాంతం అయిన బైద్య ప్రాంతంలో అక్రమంగా నిల్వచేసి ఉంచారని, ఈప్రమాదంలో 53 మందికిపైగా గాయపడినట్లు గుర్తించామని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఎస్పీ శ్యాంసింగ్ చెప్పారు. అనేకమంది ఈప్రాంతం పరిసరాల్లో ఉన్నవారు కూడా అస్వస్థతకు లోను కాగా వారందరినీ వివిధ ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఫ్యాక్టరీ యజమాని సునీల్ సింఘాల్(47) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. స్థానికులు దయారామ్, నరేంద్ర సోలంకి అనే ఇద్దరు మంగళవారం చనిపోయారు. ఈప్రాంతంలో అనేకమందికి ఈ విషవాయుప్రభావం సోకడంతో వారిని కూడా ఆసుపత్రులకు తరలించారు. అందరికీ శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు, వాంతులు రావడంతో అందరినీ ఆసుపత్రులకు తరలించామన్నారు. ఇద్దరి పరిస్థితి విషమంగా మారడంతో వీరిని అజ్మేర్‌లోని జెఎల్ఎన్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఫ్యాక్టరీ పరిసరప్రాంతాలుమొత్తం ఖాళీ చేయించినట్లు కలెక్టర్ చెప్పారు. అంతేకాకుండా నగరపరిషత్, రెవెన్యూ,పోలీస్‌శాఖలతో కమిటీలుఏర్పాటుచేసి అనుమతుల్లేకుండా కొనసాగిస్తున్న ఫ్యాక్టరీలను సర్వే చేయాలని ఆదేశించారు.

# సౌదీకి ట్రంప్ తొలి విదేశ పర్యటన..

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా పాలనపగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ తొలి విదేశీపర్యటనకు రెడీ అవుతున్నారు. వచ్చే నెలలో అరబ్‌దేశాల్లో పర్యటించనున్నట్లు ఆయన స్వయంగా ప్రకటించారు. వైట్‌హౌస్ మీడియా మీట్‌లో ఆయనే ఈ సమాచారం తెలిపారు. తాను ఖతార్, యుఎఇ, సౌదీ అరేబియా దేశాల్లో పర్యటిస్తానని ట్రంప్ తెలిపారు. అయితే పర్యటన పూర్తి షెడ్యూల్, అజెండా వంటి వివరాలపై అధ్యక్షుడు స్పష్టత నివ్వలేదు. అమెరికా కంపెనీల్లో సౌదీ ఒక ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్న అంశాన్ని ట్రంప్ గుర్తుచేసారు. ఆ కంపెనీలు సౌదీతోపాటు మధ్యప్రాచ్యంలోని ఇతర దేశాలకు కావాల్సిన పరికరాలు తయారు చేస్తాయన్నారు. మధ్యప్రాచ్యదేశాలతో కూడా తనకు మంచి సంబంధాలున్నాయన్నారు. 2017లో ట్రంప్ అధ్యక్ష హోదాలో తొలిసారి సౌదీలో పర్యటించారు. ఆ సమయంలో రియాద్‌తో ఆయన సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నారు. అవి కొనసాగించాలనే లక్ష్యంతోనే తొలిపర్యటనకు అక్కడికే వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఇజ్రాయెల్ దాడులతో ధ్వంసమైన గాజాను స్వాధీనంచేసుకుని అమెరికా పునర్నిర్మిస్తుందని ట్రంప్ ప్రకటించారు. అంతకంటే ముందు గాజాలో యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీలకు అరబ్‌దేశాలు ఆశ్రయం కల్పించాలని ప్రతిపాదిస్తే ఆదేశాలు ఖండించాయి. తమ ప్రతిపాదనలు నిరాకరిస్తే అమెరికా నుంచి అందే సాయం నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఈజిప్టు రూపొందించిన గాజా అభివృద్ధిప్రణాళికవైపు గల్ఫ్ దేశాలు మొగ్గుచూపాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ అరబ్‌దేశాల పర్యటనకు వెళతానని ప్రకటించడం గమనార్హం.

# గడువుకు ముందే.. భారత్ వేసే సుంకాలు తగ్గొచ్చు

**యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ స్పందన**



**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** భారత్ సహా కీలక భాగ స్వామ్యదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సుంకాలపై రేపు (బుధవారం) తుది నిర్ణయం వెలువడనుంది. ఈ తరుణంలో మన దేశాన్ని ఉద్దేశించి ట్రంప్ స్పందించారు. లిబరేషన్ డే డెడ్‌లైన్‌కు ముందే భారత్ నుంచి భారీగా టారిఫ్ కోతలు ఉంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై సుంకాలను గణనీయంగా తగ్గించాలని నిర్ణయానికి వచ్చిందని పేర్కొన్నారు. 'అమెరికాతో అన్యాయంగా ప్రవర్తించిన చాలా దేశాలు తమ సుంకాలను తగ్గించుకుంటాయి.ఇయు ఇప్పటికే 2.5 శాతం మేర తగ్గించుకుంది. భారత్ కూడా గణనీయంగా సుంకాలను తగ్గించుకుంటుందని ఇటీవల విన్నాను' అని అధ్యక్షుడు తాజాగా మాట్లాడారు. పరస్పర సుంకాల తగ్గింపు అమలులోకి తీసుకురావాలనుకుంటున్న రోజునే ఆయన లిబరేషన్ డేగా అభివర్ణిస్తున్నారు. ఈనెల 3నుంచి వాహ నాలు, వాటి విడిభాగాలపై 25శాతం సుంకాలు అమలు కానున్నాయి. ఇంతకుముందు ఇదే అంశంపై వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ మాట్లాడారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ 100శాతం సుంకాలు వసూలు చేస్తోం దని అన్నారు. ఇతర దేశాలు విధించే అధిక సుంకాల వల్ల అమెరికా ఉత్పత్తులను ఎగుమతి చేయడం అసాధ్యంగా మారుతోందని అన్నారు. అందుకే వాటిపై ప్రతీకార సుంకాలకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం భారత్‌కు అమెరికా చేసే ఎగుమతులకు సగటున 7.7 శాతం టారిఫ్ ఉండగా అమెరికాకు భారత ఎగుమతులపై కేవలం 2.8శాతమే ఉంది. అంటే వ్యత్యాసం 4.9శాతం. ఒకవేళ భారత్ నుంచి ఎగుమతయ్యే అన్నిఉత్పత్తులపై ఏకరీతిలో అమెరికా టారిఫ్‌లు విధిస్తే అదనంగా ఈ 4.9 శాతం మేర పెరగొచ్చు. ఒకవేళ వ్యవసాయ, పారిశ్రామికరంగాల ఉత్పత్తులకు వేరుగా టారిఫ్‌లు విధించాలని నిర్ణయిస్తే భారత్ నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు 32.4శాతం, పారిశ్రామిక ఉత్పత్తులకు 3.3శాతం మేర టారిఫ్‌లు పెరిగే అవకాశం ఉంటుంది.

# ధోలాఘాట్‌లో సిలిండర్ పేలి ఏడుగురు మృతి



**కోల్‌కతా, ఏప్రిల్ 1:** రాష్ట్రంలోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని పథర్‌ప్రతిమా ప్రాంతంలో ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్‌ఫేలి ఏడుగురు మరణించారు. వీరిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. పథర్‌ప్రతిమ బ్లాక్‌లోని ధోలాఘాట్‌గ్రామంలో రాత్రి తొమ్మిది గంటలప్రాంతంలో ఈసంఘటన జరిగిందని సుందర్బన్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు తెలిపారు. మృతదేహాలన్నింటినీ స్వాధీనంచేసుకుని పోస్టుమార్టంకు పంపించారని, తీవ్రంగా గాయపడిన ఒక మహిళను మాత్రం ఆసుపత్రిలో చేర్పించామని అన్నారు. ఇంట్లో రెండు గ్యాస్‌సిలిండర్లు ఉన్నాయని, ఇదే ఇంట్లో బాణాసంచాను కూడా దాచిపెట్టడంతో ఈ మంటలు మరింత వ్యాపించాయని రావ్ వెల్లడించారు. ముందు బాణాసంచా పేలి ప్రమాదం జరిగిందని భావించారు. కానీ గ్యాస్ సిలిండర్ అని తర్వాత నిర్ధారణ అయింది. ఇదే మరో సంఘటనలో వారణాసి కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ సమీపంలో ఒకసిలిండర్ పేలి అనేక షాపులు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. సిగ్రా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఒ సంజయ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ రైల్వేష్టేషన్ 59వ పిల్లర్ వద్ద ఈ పేలుడు సంభవించిందని సమాచారం తెలిసిన వెంటనేఫైర్‌మెన్, పోలీసులు స్పాట్‌కు చేరుకుని మంటలను అదుపుచేసారని అన్నారు. కొన్ని షాపులు దెబ్బతిన్నాయని అయితే ఎలాంటి మరణాలు సంభవించలేదని పోలీసులు తెలిపారు.

# మాకు వేరే అవకాశం లేదు.. అణ్వాయుధాల వైపే: ఇరాన్



**టెహరాన్, ఏప్రిల్ 1:** అణ్వాయుధాల ఒప్పందం విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. అగ్రరాజ్యం తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయుత్లా అలీ ఖమేనీ హెచ్చరించిన విషయం విదితమే. తాజాగా ఈ విషయమై ఖమేనీ సలహాదారుడు అలీ లారిజానీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే తాము అణ్వాయుధాల వైపు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. 'మేం అణ్వాయుధాల వైపు వెళ్లాలనుకోవడం లేదు. మీరు ఇరాన్ విషయంలో ఏదైనా తప్పు చేస్తే దేశాన్ని రక్షించుకోవాల్సిన అత్యవసర పరిస్థితుల్లో వాటిని వినియోగించడంపై దృష్టి పెట్టాల్సి వస్తుంది' అని ఆయన హెచ్చరించారు. ఇంతకుమించి తమకు వేరు అవకాశం లేదన్నారు.

ఇరాన్ చుట్టూ ఉన్న ప్రాంతంలో అమెరికన్లకు కనీసం 10 స్థావరాలు 50,000 మంది సైనికులు ఉన్నారని ఇరాన్ ఇస్లామికన రివల్యూషనరీ గార్డ్ సీనియర్ కమాండర్ జనరల్ అమిరాలి హాజీజాదే పేర్కొన్నారు. అద్దాలమేడలో కూర్చున్న అధికారులు తమపై రాళ్లు విసిరితే అవి తిరిగి మేడలనే కూల్చేసే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి తమపై విమర్శలు చేసే ముందు అగ్రరాజ్యం మరోసారి ఆలోచించుకోవాలని హితవు పలికారు.

ఇరాన్-అమెరికా మధ్య గత కొన్ని రోజులుగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. హూతీ తిరుగుబాటుదారులకు అండగా నిలుస్తున్న టెహ్రాన్‌కు అగ్రరాజ్యం గట్టిగానే హెచ్చరికలు చేసింది.

దీనికి ఇరాన్ స్పందిస్తూ తన కొత్త భూగర్భ క్షిపణి నగరానికి సంబంధించిన విడియోను విడుదల చేసింది. ఇందులో ఖైబర్ షేకాన్స్, ఘద్రహస్, సెజ్జిల్స్, హాజ్ ఖాసీమ్స్, పవేహ్ ల్యాండ్ అటాక్ క్షిపణులు ఉన్నాయి. మరోవైపు, ఈ ఉద్రిక్తతలకు మరింత ఆజ్యం పోసేలా అణుఒప్పందం విషయంలో అగ్రరాజ్యం ప్రత్యక్ష చర్చల ఆహ్వానాన్ని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తిరస్కరించారు. పరోక్ష చర్చలకు మాత్రం దారులు తెరిచే ఉన్నాయని అన్నారు. ఈ పరిణామాలతో అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన స్వరాన్ని పెంచారు.

ఒప్పందాన్ని కుదుర్చుకోని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులకూ వెనకా డబోమని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు తప్పవని బెదరింపులకు పాల్పడ్డారు.

# లైంగిక హింసకేసులో వివాదాస్పద పాస్టర్‌కు జీవితఖైదు

**అమృత్‌సర్, ఏప్రిల్ 1:** అత్యాచారం కేసులో సెల్ఫ్ స్టైల్డ్ క్రిస్టియన్ పాస్టర్ బాజిందర్ సింగ్‌కు పంజాబ్‌కోర్టు శిక్ష ఖరారుచేసింది. ఆయనకు జీవితఖైదు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. యేసు యేసు ప్రొఫెట్‌గా సింగ్ పాపులార్ అయ్యారు. బాజిందర్‌సింగ్ తనపై అత్యాచారానికి పాల్పడినట్లు 2018లో పంజాబ్‌లోని జిరాక్‌పూర్‌కు చెందిన ఒక మహిళ ఆరోపించింది. విదేశాలకు తీసుకెళతానని మాయ మాటలు చెప్పి బాజిందర్ తనను శారీరకంగా వాడుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆయనపై కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు మొత్తం ఏడుగురిపై ఈ కేసులో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ జరిపిన ట్రయల్ కోర్టు బాజిందర్‌సింగ్‌ను నాలుగు రోజుల క్రితమే దోషిగా తేల్చింది. కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మిగిలిన ఆరుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈక్రమంలో ఈరోజు ఆతడికి శిక్షఖరారుచేసింది. బాజిందర్‌సింగ్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పు వెలువరించింది. అయితే బాజిందర్‌సింగ్ తరచూ వివాదాల్లో ముందుంటాడు. ఆయన తన కార్యాలయంలో ఒక మహిళపైనా మరో వ్యక్తిపైనా దాడికి పాల్పడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వారిని చెంపలపై కొట్టడం, చేతికి ఏది దొరికితే అది విసరడం వంటి దృశ్యాలు విడియోలో ఉన్నాయి. 2022లో ఓ మహిళ తనను లైంగికంగా వేధించాడని సింగ్‌పై ఆరోపణలుచేసింది. అలాగే అనారోగ్యంతో ఉన్న ఒక మహిళను బాగుచేస్తానని చెప్పి ఆమె కుంటుం బనుంచి భారీగా డబ్బులు వసూలు చేసాడు. అయితే ఆమె మరణించింది.



# 13యేళ్ల తర్వాత బంగ్లాకు పాక్ విదేశాంగమంత్రి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** పాకిస్థాన్‌ప్రధానమంత్రి షెహబాజ్‌షరీఫ్ బంగ్లాదేశ్ కేర్‌టేకర్ చీఫ్ మహ్మద్‌యూనస్‌తో ఫోన్‌లోసంభాషించిన తర్వాత ఆదేశ విదేశాంగమంత్రి ఇషాక్‌దర్ సుమారు 13 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్ పర్యటనకు వస్తున్నట్లు ఖరారుచేసారు. ఇరువురు అగ్రనేతలు ఈద్ ఉల్‌ఫితర్ శుభాకాంక్షలు చెప్పుకున్న తర్వాత రెండుదేశాలమధ్య ద్వైపాక్షిక బంధం మరింతశక్తివంతం కావాలని ఆకాక్షించారు. పాకిస్థాన్‌కు రావాలని షరీఫ్ యూనస్‌ను ఆహ్వానించారు. అంతేకాకుండా బంగ్లాదేశీ సాంస్కృతిక బృందాన్ని కూడా ఆహ్వానించారు. ప్రముఖ గాయని రూనా లైలా కచేరి పాకిస్థాన్‌లో ఏర్పాటుచేయాలని ఆయన కోరారు. ఇక డిప్యూటిప్రధానమంత్రి విదేశాంగమంత్రి అయిన ఇషాక్‌ధర్ కూడా బంగ్లాదేశ్ పర్యటనకు వస్తున్నారు. ఈనెల 22 నుంచి 24తేదీల్లో ఆయన పర్యటిస్తారు. యూనస్‌తోభేటీ అయి వివిధ అంశాలపై చర్చలు జరుపుతారు. బంగ్లాదేశ్ విదేశాంగ సలహాదారు తౌహీద్ హొస్సేన్ ఇతర కేబినెట్ సభ్యులతో చర్చలు జరుపుతారు. కొన్ని ఎంఒయులు కూడా చేసుకుంటారని అంచనా. వాణిజ్యం, ఇతర ఒప్పందాలు, ప్రజలమధ్య నేరుగా సంబంధాలు వంటి వాటిపై ఒప్పందాలు జరుగుతాయని అంచనా. పాక్‌కుచ ఎందిన విదేశాంగమంత్రి హినా రబ్బాని ఖర్ ఒక్కరే బంగ్లాదేశ్‌ను చివరిసారిగా పర్యటించిన పాక్ విదేశాంగ మంత్రిగా నిలిచారు. అమె 2012లో బంగ్లాలో పర్యటించారు. సముద్రమార్గంలో నేరుగా కెనెక్టివిటీ పెంచుకన్న తర్వాత మొదటి కార్గోనౌక బంగ్లా సముద్రజలాల్లోకి వచ్చిన తర్వాతనుంచి పాక్ బంగ్లాదేశ్ రెండూ కూడా వాణిజ్యబంధం పెంచుకోవాలని భావిస్తున్నాయి. బంగ్లాలో రెండో అత్యున్నత ఆర్మీ అధికారి ప్రిన్సిపల్ స్టాఫ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్ఎం కమరుల్ హస్సన్ కూడా ఇటీవలే పాకిస్థాన్‌లో పలుసార్లు పర్యటించారు.



# ప్రభుత్వం భూములు అమ్ముతూ పోతే ప్రజల భవిష్యత్ ఏమిటి?

## బిజెపి శాసనసభాపక్ష ఉపనాయకుడు పాయల్ శంకర్



మంగళవారం బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న శాసనసభ పక్ష ఉపనాయకుడు పాయల్ శంకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూములు అమ్ముతూ పోతే ప్రజల భవిష్యత్ ఏమిటని బిజెపి శాసనసభ పక్ష ఉపనాయకులు పాయల్ శంకర్ ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఉన్న టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ బాటలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నారన్నారు.

గతంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి, 'ప్రభుత్వ భూములు అమ్మడానికా ప్రభుత్వాలు? భూములు అమ్మాలనుకుంటే ప్రభుత్వాలు ఎందుకు? రియల్ ఎస్టేట్ ఏజెంట్లకే అప్పగిస్తే సరిపోతుంది' అని ప్రశ్నించారు. కానీ, ప్రస్తుతం స్వయంగా ప్రభుత్వ భూములు అమ్మే ప్రయత్నం చేయడం మూర్ఖత్వం అన్నారు. విద్యార్థులు, పర్యావరణ సంఘాలు, రాజకీయ పార్టీలు అందరూ హెచ్‌సియుకు చెందిన 400 ఎకరాల భూమిని అమ్మొద్దని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం "సుప్రీంకోర్టులో గెలిచాం, భూములు అమ్మే అధికారం మాదే' అనే వాదనను ముందుకు తీసుకువస్తుందన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం వేల ఎకరాల విలువైన భూములను అమ్మి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలో నెట్టే ప్రయత్నం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదేలా వ్యవహారిస్తోందన్నారు. ఇప్పటికే కాలుష్య ప్రభావిత నగరాల్లో హైదరాబాద్, ఢిల్లీ తర్వాతి స్థానం పొందే ప్రమాదం ఉందన్నారు. ఒకవైపు "హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చుతామంటూ హామీలు, మరోవైపు పర్యావరణానికి హాని చేసే నిర్ణయాలు ఇలా చేస్తే విశ్వనగరంగా మారుతుందా? అన్నారు. ప్రభుత్వ భూములను అమ్మితే హైదరాబాద్ విశ్వనగరం అవుతుందా..? ఇదేనా మీ భిన్నమైన పరిపాలన..? అన్నారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా భూముల విషయంలో ప్రజలను అయోమయానికి గురిచేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం "భూమాత పోర్టల్" తెచ్చి భూములను రక్షిస్తామని చెప్పినా, చేతల్లో మాత్రం భూముల అమ్మకానికే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చినంత మాత్రాన, భూముల విక్రయానికి సర్టిఫికెట్ ఇచ్చినట్లు కాదన్నారు.

### హెచ్‌సియు విద్యార్థులకు మద్దతు ఇస్తాం

### బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకుండా భారతీయ జనతా పార్టీ విద్యార్థుల తరఫున పోరాడుతుందని బిజెపి శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. యూనివర్సిటీలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడానికి వెళ్లిన బిజెపి ఎమ్మెల్యేలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి పరిశోధన కేంద్రాలు స్థాపిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అనేక ప్రాజెక్టులకు భూములు కేటాయించలేకపోతుందన్నారు.

రాష్ట్రంలోని భూములను ఇలా అమ్మేస్తే భవిష్యత్తులో అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూములు ఎక్కడి నుంచి కేటాయిస్తారు? అన్నారు. ప్రభుత్వ భూములను విద్యార్థుల భవిష్యత్తు కోసం లైబ్రరీలు, కమ్యూనిటీ హాళ్లు, ఆసుపత్రులు, స్కూళ్ల కోసం ఉపయోగిస్తామని గతంలో రేవంత్ రెడ్డి చెప్పారు. కాని ఇప్పుడు అవే భూములను అమ్మాలని ప్రయత్నం చేస్తున్నారు. భూములను ఇష్టానుసారంగా అమ్ముతూ పోతే పర్యావరణానికి, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నియంతృత్వ విధానాన్ని అమలు చేస్తోందన్నారు.

# శాతవాహన వర్సిటీకి లా కాలేజీని మంజూరు చేయండి

## కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌మేఘ్వాల్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

### సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) అనుమతి ఇవ్వాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర



న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కోరారు. మంగళవారం శాతవాహన వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావులతో కలిసి బండి సంజయ్ మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో అర గంటకుపైగా కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. శాతవాహనవర్సిటీ పరిధిలో వచ్చేవిద్యా సంవత్సరానికిగాను 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి గతంలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వర్చువల్ ద్వారా తనిఖీ నిర్వహించిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వివరణలతో కూడిన నివేదిక కోరిందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపామని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల లా కోర్సుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బండి సంజయ్ వినతికి సానుకూలంగా స్పందించిన అర్జున్ మేఘ్వాల్ అందుకు అనుగుణంగా శాతవాహన వర్సిటీకి అనుబంధంగా సాధ్యమైనంత తొందర్లో లా కాలేజీకి అనుమతి ఇస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరం(2025-26) నుండే లా కాలేజీ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు.

# లైంగిక దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షిస్తాం: మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట, హైదరాబాద్ లైంగిక దాడుల ఘటనలపై మంత్రి సీతక్క సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె సంబంధిత పోలీసు అధికారులు, మహిళా సంక్షేమ అధికారులతో మాట్లాడారు. ఈ కేసులకు సంబంధించిన పురోగతి వివరాలను అడిగి తెలుసుకుని, బాధితులకు అన్ని రకాల సాయం అందించడంతోపాటు నింధితులను కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నాగర్ కర్నూల్‌కు జిల్లా ఉరవకొండ, హైదరాబాద్ లైంగిక దాడులను నింధితులను అరెస్టు చేశామని, ఈ సందర్భంగా అధికారులు మంత్రి సీతక్కకు వివరించారు. అంతే కాకుండా వారిని తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సఖీ సెంటర్ సంరక్షణలో బాధితులను సంరక్షిస్తున్నామని, వారి బాగోగులను ప్రభుత్వం చూసుకుంటుందని మంత్రికి తెలిపారు. లైంగిక దాడి సంఘటలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, పోలీసు అధికారులు సహకారంతో ఇటువంటి సంఘటలను పునరావృతంగా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో నీటిఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

## గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** : రాష్ట్రంలో మూడు నెలలు అధిక ఉష్ణోగ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మార్చి నుండి ఉష్ణోగ్రత రాష్ట్రవ్యాప్తంగా అధికంగా పెరగడం వల్ల రాబోయే మూడు నెలలు ఏజెన్సీ ప్రాంతాల్లో, మైదాన గిరిజన ప్రాంతాల్లో తాగునీరు కోసం ఆదివాసి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో తాగునీటి కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలన్నారు.

ఆదివాసీ గిరిజనులు పట్టణాలకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఏజెన్సీ ప్రాంతాల్లో మైదాన ప్రాంతాలలో నీటి వనరులకు దూరంగా వారి గూడాలు తాండాల్లో వేసవి ప్రారంభానికి ముందే ఏజెన్సీలో నీటిమట్టం తీవ్రంగా పడి పోవడం.. తాగునీటి కోసం గిరిజనులు, ఇప్పటికే కొన్ని కిలోమీటర్ల దూరంలోని చెలిమెల ద్వారా, ఊట బావుల ద్వారా నీటికోసం గంటల తరబడి ఎదురుచూడాల్సి నటువంటి పరిస్థితి నెలకొంద న్నారు. రక్షిత మంచినీటి కోసం ఎండాకాలం ప్రారంభమై ఏప్రిల్ నెలలో ప్రవేశించినప్పటికీ ముందుగానే ప్రభుత్వం వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలో తీసుకొని వారి గూడాల్లో తండాల్లో మంచినీటి సౌకర్యం అందేలా గిరిజనులు, వయోవృద్ధులు గర్భిణులు చిన్నపిల్లలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

# 30 వరకు బిసి ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల స్వీకరణ

## 2025 జనవరి స్ప్రింగ్ సెషన్‌కు దరఖాస్తులు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** : రాష్ట్రంలో బిసి, ఈబిసి విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడానికి మహాత్మా జ్యోతిబా పూలే బిసి ఓవర్సీస్ విద్యా నిధికి సంబంధించిన దరఖాస్తులన ప్రక్రియను ప్రారంభించారు. దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించనున్నట్టు ఇప్పటికే బిసి సంక్షేమ శాఖ అధికారులు ప్రకటించారు. 2025 జనవరి, ఫిబ్రవరి స్ప్రింగ్ సెషన్‌కి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు అధికారులు ప్రకటించినప్పటికీ.. ఏప్రిల్ 1 ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఎవరూ దరఖాస్తు చేయనట్టు తెలిసింది. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, అగ్రికల్చర్ సైన్స్, మెడిసిన్ అండ్ నర్సింగ్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు పోస్టున గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సును విదేశాల్లో చేయాలనుకునే బిసి, ఈబిసి విద్యార్థులు బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకంలో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది.

గ్రాడ్యుయేషన్‌లో వారు 60 శాతం మార్కులను సాధించి ఉండాలి.. అలాగే వారి కుటుంబ వార్షికాదాయం రూ. 5 లక్షలకు మించకుండా ఉండాలని.. దరఖాస్తు చేసే నాటికి వారి వయస్సు 35 సంవత్సరాలు మించకుండా ఉండాలని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా బిసి ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 2025లో జనవరి స్ప్రింగ్ సెషన్‌కి సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి.. ఈ నెల 30 వరకు దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది.

# 65 రకాల మందులు సీజ్

## రూ.3.3 లక్షల విలువైన ఔషధాలను స్వాధీనం చేసుకున్న డిసిఎ



**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** : తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ ఆడ్మినిస్ట్రేషన్ (డిసిఎ)అధికారులు గత మార్చి నెలలో నకిలీ, గడువు దాటిన సుమారు రూ.3.3 లక్షల విలువ చేసే 65 రకాల మందులను సీజ్ చేసింది. సరైన మందుల చీటి లేకుండా కొంత మంది మెడికల్ షాప్ నిర్వహాకులు మందులను ఇస్తున్నట్లు తమ విచారణలో తేలిందని అధికారులు చెబుతున్నారు. గతంలో ఇదే అంశంపై పలు మెడికల్ షాప్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. గడువు తేదీ దాటిన మందులను వినియోగించడం ద్వారా వినియోగదారులు తీవ్ర అస్వస్థతలకు లోనుకావడమే కాకుండా కొన్ని సందర్భాల్లో అత్యంత విలువైన ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. మందులు కొనుగోలు సమయంలో వాటి ధరతోపాటు గడువు తేదీని కూడా పరిశీలించాలన్నారు. అంతేకాకుండా సంబంధిత మెడికల్ షాప్‌లకు లైసెన్స్ ఉందా లేదా అనే అంశాలను డిసిఎ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. కొత్త మెడికల్ షాప్ నిర్వాహకులు అనుమతి లేకపోయినా అత్యంత ప్రమాదకరమైన మందులను అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చందని, అటువంటి షాపులను ఎట్టి పరిస్థితుల్లో వదిలేది లేదని, ఆయా షాపులు నిర్వాహకులపై కేసులు పెట్టి కఠినంగా శిక్షంచడమే కాకుండా, వాటి లైసెన్స్‌లను కూడా రద్దు చేస్తామని వారు హెచ్చరించారు.

# శాంతికుమారి



మంగళవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

# సన్న బియ్యం, నాణ్యత, పరిమాణ ఫిర్యాదులు రాకుండా చూడాలి

## కలెక్టర్‌లకు సిఎస్ శాంతికుమారి సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :రాష్ట్ర ప్రభుత్వం ఉగాది రోజున ప్రారంభించిన సన్న బియ్యంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షించారు. సన్న బియ్యం, నాణ్యత, పరిమాణానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు. మంగళవారం సిఎస్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని సమీక్షించారు.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని, ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించేందుకు మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు తగిన విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇప్పటికే యాభై శాతానికి పైగా సన్నబియ్యం చౌక ధరల (రేషన్ షాప్) దుకాణాలకు వచ్చాయని, మిగిలిన స్టాక్‌ను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని సిఎస్ తెలిపారు.

# కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో బిఆర్ఎస్ ఎంపిల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. ఏప్రిల్1:** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కేఆర్ సురేష్‌రెడ్డి, ఉప నాయకుడు వద్దిరాజు రవిచంద్ర, విప్ దివకొండ దామోదర్‌రావు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి కలిశారు.

పార్లమెంటు ఆవరణలోని మంత్రి చాంబర్‌లో మంగళవారం ఆయనతో ఎంపీలు సమావేశమై తెలంగాణలో విమానాశ్రయాల ఏర్పాటుపై చర్చించారు. వరంగల్‌లోని మామూనూరు విమానాశ్రయం పనులు ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాల్సిందిగా కోరారు.

నిజాం కాలంలో నిర్మించిన మామూనూరు నుంచి గతంలో విమానాలు నడిచాయని, ఇక్కడి నుంచి విమాన సర్వీసులు పునరుద్ధరిస్తే వరంగల్, చుట్టుపక్కల జిల్లాల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని ఎంపీలు సురేష్‌రెడ్డి, రవిచంద్ర, దామోదర్‌రావు, పార్థసారథి రెడ్డి మంత్రి రామ్మోహన్ నాయుడుకు వివరించారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి సమీపాన ప్రతిపాదిత విమానశ్రయం ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిందిగా వారు మంత్రిని కోరారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు, నవభారత్, ఐటీసీ, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ వంటి అనేక పరిశ్రమలు అక్కడ నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చేపోయే భక్తులకు ఇక్కడ ఏర్పాటు చేసే విమానాశ్రయం సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రికి బీఆర్ఎస్ ఎంపీలు వివరించారు.

అదేవిధంగా ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల సమీపాన ప్రతిపాదిత విమానశ్రయాల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సిందిగా ఎంపీలు కోరగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు.




# రీవాల్యుయేషన్ చేసి గ్రూప్1 అభ్యర్థులకు న్యాయం చేయండి

## బిఆర్ఎస్ నేత రాకేష్‌రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** :రీవాల్యుయేషన్ నిర్వహించి గ్రూప్1 అభ్యర్థులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మెయిన్స్ పేపర్స్ వాల్యువేషన్‌లోపాలు- పేపర్ల రీవాల్యుయేషన్ చేయాలి అనే అంశంపై గ్రూప్1 అభ్యర్థులు నిర్వహించిన సమావేశానికిరాకేష్ రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని చెబుతున్నారు గ్రూప్1 పరీక్షలు ఫలితాలు అన్ని లోప భూయిష్టమేనని అన్నారు. కేవలం 10, 15 సెంటర్లకు చెందిన వారే టాపర్లుగా నిలవడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. మాతృభాషలో పరీక్షలు రాసిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రీవాల్యూషన్ నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఎన్నికల హామీల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పారని, ఆ ఉద్యోగాల మాట పక్కన పెడితే కనీసం గ్రూప్ పరీక్షలు సక్రమంగా నిర్వహించడంలో విఫలమయ్యారన్నారు. గ్రూప్ 1లో 40 శాతం విద్యార్థులు తెలుగు మీడియంకు సంబంధించిన వారు ఉన్నారని, కనీసం టాప్ 500లో ఒక్కడంటే ఒక్క విద్యార్థి కూడా లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తన తప్పులు సరిదిద్దుకొని వెంటనే గ్రూప్1లోని అన్ని పేపర్ల రివాల్యూయేషన్ చేయించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయులో ప్రభుత్వం చేపట్టిన విధ్వంసంలో 700 జీవరాశులు, 200 వృక్షాలు అంతరించిపోతున్నాయని, బుల్డోజరు చక్రాల కింద జాతీయ పక్షిలు నలిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని కావాలని కలలుగంటున్న రాహుల్‌గాంధీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే రేవంత్ రెడ్డిని సిఎం పదవీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ విఠల్, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీ రాజ్, ఉద్యమ నేతలు జనార్ధన్, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఊర్కొండపేట ఘటనపై సిఎం ఆరా

## అత్యాచార బాధితురాలికి అండగా ఉంటాం: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారిస్తాం

## నిందితులను కఠినంగా శిక్షిస్తాం..

## జోగులాంబ గద్వాల మల్టీజోన్ ఐజి సత్యనారాయణ వెల్లడి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 1, ప్రభాతావార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట అత్యాచార ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఈ సంఘటన లో నిందితులు ఎవరైనాప్పటికీ వారిని కఠినంగా శిక్షించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఊర్కొండ పేట ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఒక వివాహిత మహిళపై సామూహిక అత్యాచార సంఘటన జరిగిన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక ఆలయ అధికారులు పోలీస్ అధికారులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊర్కొండ పేట ప్రాంతం నుంచి మొదటిసారి జెడ్పిటిసి సభ్యుడిగా గెలిచారని ఆ తరువాత ఆయన ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి ఊర్కొండ పేట ఆంజనేయ స్వామి ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు జరిపించారని తెలిపారు. ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయ సమీపంలో జరిగిన ఈ సంఘటనను సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా పరిగణిస్తున్నారని, ఈ విషయం గా తనతో సీఎం ఫోన్లో మాట్లాడారని అనిరుద్ రెడ్డి వివరించారు. జరిగిన సంఘటనలో 8 మంది నిందితులు ఉన్నారని చెప్తుండగా వారిలో ఆరు మంది బిఆర్ఎస్, ఇద్దరు బిజెపి పార్టీలకు చెందిన వారు ఉన్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ అత్యాచార సంఘటన ఆంజనేయ స్వామి ఆలయానికి సమీపంలోనే జరిగిందని దుష్ప్రచారం చేస్తున్నారని వాస్తవానికి ఈ సంఘటన జరిగిన ప్రాంతానికి ఆలయం చాలా దూరంగా ఉందని సంఘటన జరిగిన ప్రదేశం కూడా ఆలయానికి చెందిన భూమి కాదని అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సంఘటన లో కిలక పాత్ర పోషించినట్లు చెప్పబడుతున్న ఆలయ తాత్కాలిక ఉద్యోగిని ఇప్పటికే ఉద్యోగం నుండి తొలగించడం జరిగిందన్నారు. ప్రస్తుత ఆలయ ఈవో వచ్చిన తర్వాతనే అవినీతి తగ్గిందని ఆలయానికి నూతనంగా నియమించిన పాలకమండలి బాధ్యతలు చేపట్టిన తర్వాతనే ఆలయ పరిసరాలలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అనిరుధ్ రెడ్డి వివరించారు.

### ఇదీ జరిగింది..

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండ పేట ఆంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న భజన, ఆధ్యాత్మిక కార్యక్రమాలను తిలకించేందుకు మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలానికి చెందిన ఓ మహిళ శనివారం సాయంత్రం తన సహచరుడుతో కలిసి వెళ్లింది. అదే రాత్రి సమయంలో తిరిగి వస్తూ ఆలయ సమీపంలో ఉన్న చెట్టు చాటున మాట్లాడుకుంటున్నారు. ఈ తతంగం అంతా ఆలయంలోనే పనిచేసే ఓ యువకుడు గమనిస్తూ వచ్చాడు. వారు భార్యాభర్తలు కాదని, వారికి వ్యవహారం చూసి ఇక అంచనాకు వచ్చి వారిని ఫాలో అయ్యారు. ఆలయ సమీపంలోని ఓ గుట్ట వద్ద చెట్టు చాటున ఉన్న వారిని గమనించి ఇదే అదనుగా భావించి వెంటనే అతడు తన మిత్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఏడుగురు యువకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వారు భార్యభర్తలు కాకపోవడంతో ఈ సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నారంటూ పోలీసులకు చెబుతామంటూ బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమె వెంట ఉన్న వ్యక్తికి చితకబాది ఒకరి తర్వాత ఒకరు వివాహితపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఆమెపట్ల అత్యంత అమానవీయంగా పాశవికంగా వ్యవహరించారు. ఆమె సహచరుడిని చెట్టుకు కట్టేసి కొట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. బాధిత మహిళలకు కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించారు.




మీడియాతో మాట్లాడుతున్న ఐజి సత్యనారాయణ

### ఐజి సందర్శన..

ఊర్కొండపేట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో ఓ మహిళపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన అత్యంత పాశావికమని జోగులాంబ గద్వాల్ మల్టీజోన్ ఐజి సత్యనారాయణ పేర్కొన్నారు. మహిళపై సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన స్థలాన్ని మంగళవారం జోగులాంబ గద్వాల్ మల్టీజోన్ ఐజి సత్యనారాయణ, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ తో కలిసి పరిశీలించారు. ఇది అత్యంత పాశవిక చర్యగా భావిస్తున్నామని ఆయన తెలిపారు. ఏడుగురు ఒకరి తర్వాత ఒకరు వివాహితపై లైంగికదాడికి పాల్పడినట్లు తెలిపారు. వారితో నగదు కొంత బంగారం కూడా తీసుకొని బెదిరిస్తూ అక్కడి నుంచి పరారయ్యారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందుతులకు గుర్తించామని అవసరమైతే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్ష పడేలా చూస్తామని తెలిపారు.

# హెచ్‌సియులో ఒక్క ఇంచ్ భూమిని కూడా ప్రభుత్వం తీసుకోదు: మంత్రి శ్రీధర్‌బాబు

## విద్యార్థుల ముసుగులో బిఆర్ఎస్ వ్యక్తుల అరాచకం: మంత్రి పొంగులేటి



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి, భట్టి, శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్1:** కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల భూమి ముమ్మాటికి ప్రభుత్వ ఆస్తి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం కావాలనే అందర్నీ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది వారికి తగదు. రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేలా రాజకీయాలు చేయడం మంచిది కాదు' అని హితవు చెప్పారు. సచివాలయంలో మంగళశారం ఆయన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో కలిసి మీడయాతో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఒక్క ఇంచు భూమిని కూడా ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం తీసుకోదని స్పష్టం చేశారు. ఇప్పటీ వరకు ఒక్క ఎకరం భూమిపై కూడా యూనివర్సిటీకి చట్టబద్ధ హక్కులు లేవని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది ఎప్పటి నుంచో కోరుతున్నారని చెప్పారు. కానీ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు పట్టించు కోలేదు. ఇప్పుడేమో పని గట్టుకొని మాపై దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. వారం రోజుల కిందట యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌తో మేం ప్రత్యేకంగా సమావేశమయ్యామని, వారికి స్పష్టంగా చెప్పాం, చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని భావించాం, యూనివర్సిటీ భూమి యూనివర్సిటీకే ఉండాలని వారికి తెలియజేశామని చెప్పారు. అక్కడున్న నేచురల్ రాక్ ఫార్మేషన్స్, సహజ సిద్ధంగా ఏర్పడిన నీటి వనరులను కనుమరుగు చేస్తున్నామంటూ కొందరూ మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇది అసత్యమని వివరించారు. ప్రకృతిని పరిరక్షించేందుకు పక్కా కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని, ప్రసిద్ధిగాంచిన మష్రూమ్ రాక్స్, పికాక్ లేక్‌ను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్‌సియు పరిసరాల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడుతామని, అవన్నీ ప్రభుత్వ భూముల్లో ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం పనికి అడ్డుతగిలిగే ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. గత రెండు రోజుల నుంచి మీడియా సంస్థలు, కొన్ని పార్టీలకు సంబంధించిన సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఒక్కటీ గమనించాలి. వాస్తవం తెలుసుకోవాలని సూచించారు. 2003లో అప్పటి ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని మేం అధికారంలోకి వచ్చాకా సరిదిద్దాం. 400 ఎకరాల ప్రభుత్వ భూమిని న్యాయపరంగానే తీసుకుంటున్నామని, చట్టబద్ధంగానే ముందుకు వెళ్తామని చెప్పారు. తప్పుడు ప్రచారంతో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, పర్యావరణ ప్రేమికులు ఆందోళనకు గురి కావొద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిపై రెండు ప్రతిపక్ష పార్టీల నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. అబద్ధాలను నిజాలుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. ఫెవికాల్ బంధం ఉన్న ఆ రెండు పార్టీలకు అక్కడ హై రైజ్ భవనాలు కడితే పర్యావరణం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఆనాడు ప్రభుత్వ పెద్దలు ఆ భూమిని కొట్టేయాలని చూశారని ఆరోపించారు. తాము కొట్లాడి ప్రభుత్వ స్వాధీనం చేస్తే జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. అటవీ ప్రాణులకు అక్కడ నష్టం జరిగిందా.. ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపిద్దామని సవాల్ విసిరారు. హరగోపాల్, నరసింహా రెడ్డి వంటి ప్రొఫెసర్లు, పర్యావరణ వేత్తలు అక్కడి పరిస్థితి తమకు వివరించారని గుర్తుచేశారు. హెచ్‌సీయూ భూమి ఇంచు తగ్గకుండాదానికే టైటిల్ ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. విద్యార్థుల ముసుగులో బిఆర్ఎస్ వ్యక్తులు అరాచకం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. హెచ్‌సీయూ ఏర్పాటు చేసింది ఇందిరాగాంధీ హయాంలోనేనని గుర్తుచేశారు. ఈ భూముల్లోని జంతువులు, పక్షులకు ఎలాంటి హాని జరగలేదని చెప్పారు. జంతువులు చనిపోయినట్లు సోషల్ మీడి యాలో చూపుతున్న చిత్రాలు పాతవని స్పష్టం చేశారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు హెచ్‌సియు పూర్వ విద్యార్థులేనని చెప్పారు. అక్కడి బండరాళ్లు, చెరువులకు ఎలాంటి నష్టం జరగనివ్వబోమని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ కూడా పాల్గొన్నారు.



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి మాండవీయకు వినతిపత్రం అందజేస్తున్న మంత్రి బండి సంజయ్

# కరీంనగర్ అంబేద్కర్ స్టేడియానికి నిధులివ్వండి

## కేంద్ర మంత్రి మన్సూక్ మాండవీయను కలిసిన బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ఖేలో ఇండియా పథకంలో భాగంగా కరీంనగర్ జిల్లాలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్టేడియంలో క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ కేంద్ర కార్మిక, ఉపాధి, క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి మన్సూక్ మాండవీయను కోరారు. మంగళవారం ఉదయం ఢిల్లీలో కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, శాతవాహన యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్‌లతో కలిసి బండి సంజయ్ కేంద్ర మంత్రి మాండ వీయను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బండిసంజయ్ మాట్లాడుతూ తెలంగాణలోని అత్యంత పెద్దనగరాలలో ఒకటైన కరీంనగర్ విద్య, క్రీడల్లో ప్రత్యేక గుర్తింపు పొం దిందన్నారు. అందులో భాగంగా కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్, వైద్య కళాశాలల తోపాటు ఇతర విద్యాసంస్థలున్నాయి. ముఖ్యంగా క్రీడల్లో కరీంనగర్ ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. అర్జున అవార్డు గ్రహీత మడాసు శ్రీనివాసరావు కరీంనగర్‌కు చెందినవారే. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖేలో ఇండియాగానీ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాల ద్వారా కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం అభివృద్ధికి తగిననిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సునీల్‌రావుతో కలిసి స్టేడియంలోని క్రీడా సదుపాయాలను వివరించారు.

# కేబినెట్ విస్తరణ..

## కాంగ్రెస్ హైకమాండ్‌కు జానారెడ్డి లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్1:** త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉండే చాన్స్ ఉందనే ప్రచారం నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి లేఖ రాశారు. ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ సంస్థాగత కార్యదర్శి కేసి వేణుగోపాల్‌కు లేఖ రాశారు. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడిరంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని ఆయన కోరారు. ఈ నిర్ణయంతో ప్రజలకు ప్రయోజనమే కాకుండా. కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహద పడుతుందని ఆయన లేఖలో పేర్కొన్నారు. కాగా, తెలంగాణ కేబినెట్ విస్తరణకు రేవంత్‌రెడ్డి సర్కార్ రెడీ అవుతోంది. ఇప్పటికే ఆశావాహుల జాబితాను హైకమాండ్‌కు పంపించినట్లు సమాచారం. ఇప్పటికే తమ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఐటీవల మాదిగ, లంబాడి, బీసీ సమాజిక వర్గ ఎమ్మెల్యేలు కూడా అధిష్ఠానానికి లేఖలు రాశారు. ఈ మేరకు ఎఐసిసి నేతలు రాహుల్, ఖర్గే, కేసీ వేణుగోపాల్, పార్టీ ఇన్‌చార్జీ మీనాక్షి నగరాజన్‌లకు తమ వినతులను పంపారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉండగా, ఇందులో నాలుగింటిని భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

# ఎల్ఎస్జీపై చెలరేగి గెలిచిన పంజాబ్‌కింగ్స్

## సొంతగడ్డపై 8 వికెట్ల తేడాతో లక్నో జట్టు చిత్తుగా ఓటమి



**లక్నో, ఏప్రిల్ 1:** ఐపిఎల్ 2025సీజన్‌లో 13వ మ్యాచ్‌లో పంజాబ్‌కింగ్స్ చెలరేగిపోయింది. సొంతమైదానంలో లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఓటమి తప్పలేదు. ఐపిఎల్ 18వ సీజన్‌లో పంజాబ్‌కింగ్స్ రెండో విజయం సాధించింది. తొలిపోరులో గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చిన పంజాబ్ లక్నో గ్రౌండ్‌లో ఎల్ఎస్జీ జట్టును చిత్తుచేసింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్‌సింగ్ 69 పరుగులు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 52పరుగులుచేసారు. అయ్యర్ నాటౌట్‌గానే నిలిచారు. ఇంపాక్ట్ ప్లేయర్ నేహాల్ వధేరా 43పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి మెరుపులతోనే లక్నోపై 8 వికెట్ల తేడాతో పంజాబ్‌కింగ్స్ విజయం సాధించింది. 16.2 ఓవర్లలోనే ఎల్ఎస్జీ టార్గెట్ ఛేదించింది. హిట్టర్లతో నిండిన ఎల్ఎస్జీ భారీ స్కోరు కూడా చేయలేకపోయింది. పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్ మూడు 43 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసాడు. ఆదినుంచి కూడా లక్నోజట్టు తడబడుతూ వచ్చింది. పవర్‌ప్లేలోనే 3 కీలక వికెట్లు కోల్పోయింది. నికొలస్ పూర్ 44, ఆయుష్ బదోనిలు జట్టును ఆదుకున్నారు. పంజాబ్ స్పిన్నర్లను ధీటుగా ఎదుర్కొంటూ లక్నో స్కోరుబోర్డును ఉరికించారు. అర్ధసెంచరీకి ముందు పూరన్ ఔట్ అయినా అబ్దుల్‌సమద్ 27 పరుగులుచేసి బదోని కూడా అంతే దూకుడుతో ఆడి స్కోరుపెంచారు. దీనితో పంత్‌సేన నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 171 పరుగులుచేసి విజయం తన ఖాతాలో వేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో జట్టుకు ఆరంభంలోనే అర్షదీప్ షాకిచ్చాడు. తొలి ఓవర్ లో నాలుగో బంతికే మిచెల్‌మార్ష్ వికెట్ నష్టపోయాడు. తర్వాత మార్క్‌రమ్ 28 పరుగులు చేసి నాల్గవ ఓవర్‌లో ఔట్ అయ్యాడు.



మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విత్తన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ నిపుణులు

# 4 నుంచి6 వరకు 'తెలంగాణ విత్తనాల పండుగ'

**హైదరాబాద్, ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** విత్తన స్వేచ్ఛ, విత్తనాలపై పట్టు, అజమాయిషి రైతుకే ఉండేలా పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి ఏటా విత్తనాల పండుగ జరగాలని పలువురు వ్యవసాయ నిపుణులు పిలుపునిచ్చారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషరన్, భారత్ బీజ్ స్వరాజ్ మచ్ కలిసి నిర్వహిస్తున్న తొలి తెలంగాణ "విత్తనాల పండుగ" ఇన్విటేషన్ పోస్టర్‌ను మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో లాంఛనంగా విడుదల చేశారు. ఈ తొలి తెలంగాణ విత్తన పండుగ ఏప్రిల్ 4,5,6 తేదీల్లో దఎర్త్ సెంటర్, అన్మాస్‌పల్లి (గ్రామం), కడ్తాల్ (మండలం), రంగారెడ్డి జిల్లాలో జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహజ సమృద్ధ సంస్థ అధ్యక్షులు జి. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మన పూర్వీకుల విత్తన సంపదని తిరిగి తీసుకువచ్చే బాధ్యత మనందరి పైన ఉందని చెప్పుకొచ్చారు. కర్ణాటక, తమిళనాడు లో ఉన్నట్టుగానే తెలంగాణలో కూడా వైవిద్య భరితమైన విత్తన సంపద ఉన్నదని, అది మీడియా సహకారంతో రైతు సమాజంలోకి ప్రాచుర్యం పొందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ఉత్సవం సంప్రదాయ విత్తనాల వైభవాన్ని తెలియజేసేందుకు, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విత్తనం, విత్తనజ్ఞానం, అనుభవాల ప్రదర్శనకు 50 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వ్యవసాయ విత్తన నిపుణులు ఈ పండుగలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ పాలసీ ఎక్స్పర్ట్ డా. దొంతి నరసింహారెడ్డి, ఎక్స్ ఆర్టిఐ కమిషనర్ దిలీప్ రెడ్డి, బయోడైవర్సిటీ నిపుణులు డా. తులసిరావు, కె.లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిర్విరామంగా స్టీల్ తొలగింపు

## వేగంగా కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ పనులు

## నేడు సహాయక చర్యలను పరిశీలించనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్1, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యలకు ఆటంకంగా ఉన్న స్టీలు, ఇనుము పదార్థాలను నిర్విరామంగా టన్నెల్ బయటకు తరలిస్తున్నారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఆఫీస్ వద్ద సొరంగం ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్న సహాయక బృందాల ఉన్నత అధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వ హించారు. సొరంగం లోపల జరుగుతున్న సహాయక చర్యలపై, సహాయక బృందాలు చేపడు తున్న పనులపై వివరాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ టీబీఎం చివరి భాగాలను కత్తిరించి మట్టి తవ్వకాలు చేపట్టినట్లు, సహాయక పనులకు అడ్డంకి గా ఉన్న టీబీఎం భాగాలను బయటకు తరలిస్తున్నట్లు, ఊట నీటిని బయటకు తరలించే ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు వివరించారు. కేంద్ర రాష్ట్ర సహాయక బృందాలు సమన్వయంతో సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్లు, కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ పనులు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని, తెలిపారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఉదయం 11గంటలకు దోమలపెంటలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ ను సందర్శించనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి అధికారి మాధవ రావు, ఎన్డిఆర్ఎఫ్ అధికారులు మన్మోహన్ యాదవ్, సత్యనారాయణ, ఎస్డిఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి జయ ప్రకాష్, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేత చంద్ర, రవీంద్ర నాథ్, ర్యాట్ హోల్ మైనర్స్ ప్రతినిధి ఫిరోజ్ ఖురేషి, కేరళ కడవర్ డాగ్స్ ప్రతినిధి, ప్రభాత్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మేం తెలుగు,తమిళం ఇతరభాషలు బోధిస్తున్నాం

## త్రిభాషా సూత్రంపై యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్



**లక్నో, ఏప్రిల్ 1:** జాతీయ విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలు పరంగా కేంద్రం తమిళనాడు ప్రభుత్వం మధ్య గత కొన్నిరోజులుగా వివాదం కొనసాగుతోంది. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని స్టాలిన్ ప్రభుత్వం ముందునుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది. దక్షిణాది రాష్ట్రాలపై హిందీని బలవంతంగా రుద్దడం ఏంటని ప్రశ్నిస్తోంది. ఈ వ్యవహారంపై యుపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తాజాగా స్పందించారు. యుపి పాఠశాలల్లో విద్యార్థులకు తమిళం, తెలుగుతోపాటు ఇతర రాష్ట్రాల అధికారిక భాషలను కూడా బోధిస్తున్నట్లు చెప్పారు. తమిళనాడులోని స్టాలిన్‌ప్రభుత్వంపై ఆయన తీవ్రంగా విమర్శించారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోనాలకోసమే త్రిభాషా విధానంపై వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీఎంయోగి వ్యాఖ్యలపై కాంగ్రెస్‌నేత కార్తి చిదంబరం స్పందించారు. ఈమేరకు స్టాప్ హిందీ ఇంపొజిషన్ అనే హ్యాష్ ట్యాగ్‌తో ఎక్స్‌లో పోస్టుపెట్టారు. యుపి ప్రభుత్వం తమ పాఠశాలల్లో తమిళంలో పాఠాలు చెప్పేందుకు ఎంతమంది టీచర్లున్నారన్న వివరాలు ఇస్తుందా. తమిళ భాషకోసం ఎంతమంది రిజిస్టరు చేసుకున్నారని ఆయన ప్రశ్నిం చారు. తమిళనాడులోని విద్యార్థులు హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరంలేదని ఈ సందర్భంగా కార్తీ అన్నారు.

# జిఎస్టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

## మరోసారి రికార్డు స్థాయిలో రాబడులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** వస్తుసేవల పన్ను వసూళ్ల మరోసారి రికార్డుస్థాయిలో వృద్ధిని నమోదు చేసాయి. జీఎస్టీ గత ఏడాది మార్చితో పోలిస్తే ఈఏడాది మార్చిలో జీఎస్టీ వసూళ్ల 9.9శాతంపెరిగి 1.96 లక్షలకోట్లకు చేరాయి. ఈమొత్తంలో సిజిఎస్టీ వసూళ్ల రూ.38,100 కోట్లు, ఎస్జీఎస్టీ వసూళ్ల రూ.49,900 కోట్లుగా ఉన్నాయి. ఇకసమీకృత జిఎస్టీరూపంలో రూ.95,900కోట్లు సెస్సులరూపంలో రూ.12,300 కోట్లు వసూలయ్యాయని ఆర్ధికశాఖ ప్రకటించింది. దేశీయ లావాదేవీలు 8.8శాతం పెరిగి రూ.1490 లక్షలకోట్లు ఆదాయం వచ్చింది. దిగుమతిచేసిన వస్తువులపై వచ్చేఆదాయంలో13.56శాతం వృద్ధితో రూ.46,919 కోట్లు సమకూరినట్లు కేంద్రం ప్రకటించింది. రీఫండ్స్‌రూపంలో రూ.19,615కోట్లు చెల్లించగా నికరంగా రూ.1.76 లక్షలకోట్ల జీఎస్టీ వసూళ్ల నమోదయినట్లు కేంద్ర ఆర్థికశాఖ వెల్లడించింది.

# కొత్తగా గిరిజన హాస్టళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల కోసం కొత్తగా గిరిజన హాస్టళ్లను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ హాస్టళ్ల వచ్చే విద్యా సంవత్సరం 2025-26 ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా తొలుత హైదరాబాద్ లోని బేగంపేట, రామంతపూర్ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్ల నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. వీటి కోసం కోసం రూ.20 లక్షలు మరియు రూ. 1.33 కోట్లు ఖర్చు చేయనున్నారు. హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌తో పాటు రామంతపూర్‌లో అడ్మిషన్స్ పొందే గిరిజన విద్యార్థులకు ఈ రెండు హాస్టళ్ల మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటిని బాలికలు మరియు బాలలకు వేరు వేరుగా నిర్మించనున్నారు. హెచ్‌పీఎస్ (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్) వద్ద ఈ హాస్టల్‌కు రూ. 20 లక్షల 30 వేలు ఖర్చు చేయనుంది. అలాగే రామాంతపూర్ హాస్టల్‌కు రూ. కోటి 33లక్షలు ఖర్చు చేయాలని గిరిజన సంక్షేమశాఖ ప్రకటించింది. హైదరాబాద్ బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌తో పాటు, రామంపూర్‌లో అడ్మిషన్స్ పొందే గిరిజన విద్యార్థులకు ఈ రెండు హాస్టళ్లను మంజూరు చేశారు. గిరిజన పిల్లల విద్యకోసం సమర్థమైన వసతులు ఏర్పరచడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ వెల్లడించింది.

# వక్ఫ్‌బిల్లుపై ఇండియా కూటమి తిరుగుబాటు జెండా..

## ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కూటమి సమావేశంలో నిర్ణయం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** లోక్‌సభలో బుధవారం ప్రవేశపెడుతున్న వక్ఫ్‌సవరణ బిల్లును ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ప్రతిపక్ష ఇండియా కూటమి నిర్ణయించింది. మంగళవారం సాయంత్రం ఖర్గే అధ్యక్షతన జరిగిన ఇండియా కూటమి సమావేశం బిల్లును సమైక్యంగా వ్యతిరేకించాలని అడ్డుకోవాలని నిర్ణయించారు. సమావేశం తర్వాత ఆర్ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమచంద్రన్‌మాట్లాడుతూ ప్రతిపక్షం మొత్తం ఈ బిల్లుకు వ్యతిరేకమని, అడుగడుగునా అట్టుకుంటామని చెప్పారు. ఎలాంటి వాకౌట్‌లు ఉండవని, నిరసనప్రదర్శనలు, సభలో ఆటంకాలు వంటివి ఉండవని, అయితే బిల్లువల్ల జరిగే అనర్థాలు, నష్టాలను సభముందుంచుతామని అన్నారు. ఒకరకంగా చెప్పాలంటే వక్ఫ్‌సవరణ బిల్లుపై జరిగే చర్చ విద్యారంగచర్చగానే కొనసాగుతుందన్నారు. ఇండియా కూటమితోపాటు అన్ని భావసారూప్యత కలిగిన పార్టీలు కూడా కలిసిరావాలని పిలుపునిచ్చామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ చెప్పారు. ఎఐఎడిఎంకె ఇప్పటికే బిల్లుకు వ్యతిరేకంగా ఓటువేస్తామని చెప్పిందన్నారు. ఇక నవీన్ పట్నాయక్ బిజెడి, కెసిఆర్ ఆధ్వర్యంలోని బిఆర్ఎస్‌లు తమ నిర్ణయాలను వెల్లడించలేదు. దేశంలోని వక్ఫ్‌ఆస్తులకు జవాబుదారీతనం పెంచడం, సరైనరీతిలో వీటి పర్యవేక్షణ ఉండేందుకు వీలుగానే సవరణలు తెచామని ఎన్డీయే చెపుతోంది. అందువల్లనే లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఎనిమిది గంటలుపాటు చర్చను ఆహ్వానిస్తున్నామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు.

# ఉత్కంఠనడుమ నేడు లోక్‌సభకు వక్ఫ్ సవరణల బిల్లు




**న్యూఢిల్లీ, ఏప్రిల్1:** వక్ఫ్‌సవరణ బిల్లును బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధంచేసారు. బిజెపి ఎంపిలకు బుధవారం తప్పనిసరిగా పార్లమెంటుకు హాజరుకావాలని విప్ జారీచేసారు. బిజెపి ఎంపిలు మొత్తం లోక్‌సభలో ఉండాలని రెండులైన్ల విప్ జారీ అయింది. ఈ బిల్లును ఇండియాకూటమి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. బుధ, గురువారాల్లో కూడా ఈ బిల్లుపై ఉభయసభల్లో చర్చించే అవకాశం ఉంది. రాజ్యసభలో మూడో తేదీ, లోక్‌సభలో రెండోతేదీ చర్చలు జరపాలని ఉభయసభల బిఎసి సమావేశంలో నిర్ణయించారు. రెండుసభల్లోను ఈ బిల్లుపై చర్చలకోసం 8గంటలు చొప్పున కేటాయించారు. కొందరు బిజెపి మిత్రపక్షాలు ఈ బిల్లుపై మరికొన్ని సవరణలు తీసుకురావాలని కోరుతున్నాయి. సీనియర్‌బిజెపి మిత్రపార్టీ అయితే తమ అభిప్రాయాలను ఈ బిల్లులో చేర్చినట్లు భావిస్తున్నామని చెప్పారు. జెపిసిలో కూడా తమ అభిప్రాయాలు వ్యక్తంచేసినట్లు విపక్షాలు కూడా పేర్కొంటున్నాయి. మొత్తంగా చూస్తే ఎన్డీయే భాగస్వామ్య పార్టీలన్నీ కూడా ఈ బిల్లు ఆమోదిం చేందుకు సమైక్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి, జెడియు రెండు పెద్ద మిత్రపక్షాలు కూడా ఇందుకు సంబంధించి తమ పార్టీ ఎంపిలకు విప్ జారీ చేసాయి. ఇండియా కూటమి పార్టీలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాలని నిర్ణయించాయి. పార్లమెంట్ హౌస్‌లో జరిగిన సమావేశంలోనే ఈ మేరకు పార్టీలన్నీ ఉమ్మడిగా బిల్లును వ్యతిరేకించాలని నాయకులు పేర్కొన్నారు. మైనార్టీలు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ అన్ని మేజర్‌పార్టీలతో బిఎసి సమావేశం నిర్వహించారని, ఎనిమిది గంటలు చర్చకు నిర్ణయిస్తే విపక్ష పార్టీలు 12 గంటలు కోరుతున్నాయని చెప్పారు. అన్ని పార్టీలు కూడా తమకు నాలుగునుంచి ఆరుగంటలుసమయం కావాలని కోరుతున్నాయని, విపక్షం మొత్తంగా 12 గంటలు కోరుతోందని చెప్పారు. ఎనిమిది గంటలుదాటితే సభలో చర్చను మరింత పొడిగించే అవకాశం ఉందని ఆయన అన్నారు. గురువారం రాజ్యసభలో ఈ బిల్లు ప్రవేశపెడతారన్నారు.

# హైదరాబాద్ శివార్లలో విదేశీ యువతిపై అత్యాచారం

## పహాడీషరీఫ్ పిఎస్ పరిధిలో ఘటన: నిందితుడి అరెస్టు




నిందితుడు అస్లం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలో ఓ విదేశీ యువతిపై కారు డ్రైవర్ అత్యాచారానికి ఒడిగట్టాడు. జర్మన్ దేశానికి చెందిన సదరు యువతిని బెదిరించి కారులోనే నిందితుడు అత్యాచార ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అత్యాచారానికి ఒడిగట్టిన నింది తుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటలీలోని మెస్సినా యూనివర్సిటీలో చదు వుకుంటున్న మీర్‌పేట్ మిథిలానగర్ నివాసి మంగళగిరి శరత్ చంద్ర చౌదరికి స్నేహితులైన జర్మనీ దేశస్తులు మాక్సిమిలియన్ అనే యువకుడు, అతని స్నేహితురాలైన మరో యువతి గత నెల మార్చిన 4న హైదరాబాద్ పర్యటన నిమిత్తం వచ్చారు. ఈ నేపథ్యంలో వారు శరత్ చంద్ర చౌదరి నివాసం వద్ద ఉంటూ నగరంలోని పర్యాటక ప్రాంతాలను చూస్తున్నారు. అయితే సోమవారం సాయంత్రం జర్మనీ దేశస్తులు ఇద్దరూ కలిసి కూరగాయల మార్కెట్‌కు వెళ్ళడానికి ఇంటి నుండి బయటకు ప్రధాన రోడ్డుపైకి వచ్చారు. అయితే అదే సమయంలో దుబాయ్‌లో డ్రైవర్‌గా పని చేస్తూ స్వస్థలానికి తిరిగి వచ్చి గత ఏడాది నుండి ఏ పని చేయకుండా ఉంటున్న పాతబస్తీ యాకత్‌పురా ఎస్ఆర్‌టి కాలనీకి చెందిన మహ్మద్ అబ్దుల్ అస్లం (25) సి ఫ్ట్ కారులో 9 నుండి 16 సంవత్సరాల లోపు ఉన్న ఐదు మంది మైనర్ బాలురతో కలిసి వచ్చాడు. అద్దె కారు తీసుకొని లాంగ్ డ్రైవ్ యాప్‌తో అవసరమున్న వారిని గమ్య స్థానాలకు చేర్చే అస్లం మీర్‌పేట్ మిథి లానగర్ మెయిన్ రోడ్డుపై నుండి నడుచుకుం టూ వెళ్తున్న జర్మన్ దేశీయులతో మాట్లాడి కారులో ఎక్కించుకున్నాడు. మార్కెట్ వద్ద డ్రాప్ చేస్తానంటూ తీసుకెళ్ళిన డ్రైవర్ మైనర్ పిల్లలను డ్రాప్ చేశాడు. ఆ తర్వాత జర్మన్ దేశీయులతో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లి ప్రాంతాల్లో తిప్పాడు. ఈ క్రమంలో జర్మన్ యువకుడిని కొంత దూరంలో వదిలి కారులో ముం దుకు వెళ్ళి ఆ తర్వాత బెదిరించి యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం కారులో యువతిని తీసుకొని వెళ్తుండగా ఓ చోట కొద్దిగా కారు నెమ్మదించడంతో యువతి బయటకు దూకి తన స్నేహితుడి వద్దకు చేరుకుంది. అనంతరం జరిగిన విషయాన్ని అతనికి చెప్పడంతో ఇద్దరు అక్కడ కలిసిన వారి సాయంతో పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఫిరా ్యదు చేశారు. దీంతో కేసును నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి బాధిత యువతి ఇచ్చిన ఆధారాలతో అస్లంను అరెస్టు చేశారు. యువతిని వైద్యపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్నేహితుడు శరత్‌చంద్ర చౌదరి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# 'అర్జున్ S/O వైజయంతి' సాంగ్ లాంచ్ ఈవెంట్

నందమూరి కళ్యాణ్ రామ్ హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ డ్రామా అర్జున్ S/O వైజయంతి ఈ వేసవి సీజన్‌లో బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు దూకుడుగా జరుగుతున్నాయి. టీజర్ భారీ అంచనాలను నెలకొల్పింది. టీజర్



తోనే సినిమా థియేటర్, నాన్ థియేటర్ బిజినెస్ మొత్తం క్లోజ్ అయ్యింది. కళ్యాణ్ రామ్ కెరీర్లో హైయెస్ట్ ప్రి రిలీజ్ బిజినెస్ జరిగిన సినిమాగా అర్జున్ S/O వైజయంతి రికార్డు క్రియేట్ చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రంలో విజయ శాంతి ఐపిఎస్ అధికారిగా కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ఫస్ట్ సింగిల్ నాయల్ది రిలీజ్ చేయడంతో కిక్ స్టార్ట్ చేశారు. ఈ సాంగ్ లాంచ్ నరసరావుపేటలోని రవి కళా మందిర్‌లో భారీగా తరలివచ్చి ఫ్యాన్స్ సమక్షంలో చాలా గ్రాండ్‌గా జరిగింది. ఈ సందర్భంగా అభిమానులు భారీ ర్యాలీని నిర్వహించారు. సాంగ్స్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. నాయల్ది సాంగ్ కళ్యాణ్ రామ్, సాయి మంజ్రేకర్ మధ్య సిజలింగ్ కెమిస్ట్రీని ప్రజెంట్ చేసింది. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ఈ ట్రాక్, రఘురామ్ రాసిన లిరిక్స్ తో సాయి అందం పట్ల కళ్యాణ్ రామ్ అభిమానాన్ని ఆకట్టుకునే శైలిలో అందంగా చిత్రీకరించారు. సాఫ్ట్ అండ్ మెలోడీగా మొదలైన సాంగ్ క్రమంగా ఊపందుకుంది. అదిరిపోయే డ్యాన్స్ నంబర్‌గా మారుతుంది. కళ్యాణ్ రామ్ స్టైలిష్, మోడరన్ దుస్తులలో మెరిశారు. డ్యాన్స్ ఫ్లోర్‌లో అతని కమాండింగ్‌తో అదరగొట్టారు. అద్భుతమైన డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నారు. శేఖర్ విజె మాస్టర్ హైఎనర్జీ కొరియోగ్రఫీ చేశారు. సాంప్రదాయ చీరలో ధరించిన సాయి మంజ్రేకర్, కళ్యాణ్ రామ్ ఎనర్జీని మ్యాచ్ చేశారు. ఫస్ట్ సాంగ్‌కి వచ్చిన ఇన్స్టంట్ అండ్ ట్రెమండస్ రెస్పాన్స్‌తో మ్యూజిక్ ప్రమోషన్లు బ్లాక్ బస్టర్ ప్రారంభం అయ్యాయి. ఈ పాట మ్యూజిక్ చార్టులలో టాప్ సాంగ్‌గా ట్రెండ్ అవుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందించగా, తమ్మిరాజు ఎడిటర్. శ్రీకాంత్ విస్సా స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.

# 'చైనా పీస్' ఫస్ట్ లుక్ రిలీజ్

నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా చైనా పీస్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. మేకర్స్ వాలి పాత్రలో నిహాల్ కోధాటిని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. నిహాల్‌ని ఇంటెన్స్ లుక్‌లో ప్రజెంట్ చేసి ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఈ సినిమాలో ఆయన క్యారెక్టర్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ సురేష్ రగుతు అందిస్తుండగా సంగీతం కార్తీక్ రోడ్రిగ్జ్ సమకూరుస్తున్నారు. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్. ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకుంది. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తారు. నటీనటులు: నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్, హర్షిత బండ్కమూరి, కమల్ కామరాజు, గులాబీ, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్, టెక్నికల్ టీం: రచన, దర్శకత్వం: అక్కి విశ్వనాధ రెడ్డి, బ్యానర్: మూన్ లైట్ డ్రీమ్స్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ రగుతు సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్.





సిద్ధి ఇద్నాని నయా లుక్

# 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' ట్రైలర్ అదుర్స్

టీవీ యాంకర్ టర్న్ హీరో ప్రదీప్ మాచిరాజు మోస్ట్ ఎవైటెడ్ మూవీ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి వేసవిలో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ గా ఏప్రిల్ 11న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెడ్ డైరెక్టర్స్ డుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ ఎగ్జైటింగ్ ఎంటర్‌టైనర్‌లో దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది. టీజర్, పాటలు ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ అందుకున్నాయి. మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కథ ఒక మారుమూల గ్రామంలో ఒక ప్రాజెక్ట్‌ను సూపర్ వైజ్ చేయడానికి నియమించబడిన సివిల్ ఇంజనీర్ చుట్టూ నడిచింది, అక్కడ అతను 60 మంది అనుభవం లేని కార్మికులతో పని చేయించాలి గ్రామస్తులలో, ఒకే ఒక అమ్మాయి ఉంది, ఆమె తండ్రి 60 మందిలో ఒకరిని పెళ్లి చేసుకోవాలని అనౌన్స్ చేస్తాడు. ప్రాజెక్ట్ ముందుకు సాగుతున్న కొద్దీ, ఇంజనీర్ మరియు అమ్మాయి ఇద్దరూ ప్రేమలో పడతారు. తర్వాత జరిగే సిచువేషన్స్ చాలా ఎక్సైటింగ్‌గా టర్న్ అవుతాయి. నితిన్‌భరత్ ద్వయం హ్యూమర్ తో కూడిన ప్రత్యేకమైన కథాంశాన్ని ఎంచుకున్నారు. ఎక్సయిటింగ్ సిచువేషన్స్‌తో నవ్వును అందించడంలో వారు విజయం సాధించారు. డైలాగ్స్



ఆకట్టుకున్నాయి. ప్రదీప్ మాచిరాజు తన పాత్రకు పెర్ఫెక్ట్‌గా ఫిట్ అయ్యారు, తన టైమింగ్‌తో హ్యూమర్‌ని అద్భుతంగా పండించారు. దీపికా పిల్లి పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ వుండే పాత్రలో కనిపించింది. వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను వినోదాన్ని పుష్కలంగా అందించారు. ఎంఎన్ బాల్‌రెడ్డి గ్రామీణ వాతావరణాన్ని అందంగా చూపించారు, రధన్ సంగీతం ప్లజెంట్ గా వుంది. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్. నిర్మాణ విలువలు ఉన్నతంగా వున్నాయి. కథ, డైలాగ్స్ సందీప్ బొల్లా రాశారు. అశ్విజ పులాల ప్రొడక్షన్ డిజైనర్. మొత్తంమీద, అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి రొమాన్స్, విలేజ్ డ్రామాతో కూడిన వినోదాత్మకంగా ఉంటుందని ట్రైలర్ హామీ ఇస్తుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ, అందరికి నమస్కారం. మా టీవీ షోస్ చూసి ఆడియన్స్ అందరూ ఎలా అయితే ఎంటర్టైన్ అయ్యారో అలాగే అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి సినిమాని కూడా ఆడియన్స్ అంతే గొప్పగా ఎంజాయ్ చేస్తారు. సినిమా ఏప్రిల్ 11న రిలీజ్ అవుతుంది. సినిమా ఆద్యంతం ఎంటర్టైన్మెంట్ తో ఉంటుంది. చాలా సరదాగా ఉంటుంది. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాం. మా టీ థాంక్యూ చాలా కష్టపడి పని చేశారు. కథ నచ్చి అందరూ చాలా ఇష్టంగా ఈ ప్రాజెక్టును చేశారు. మా బెస్ట్ ఫ్రెండ్స్ అందరు కలిసి ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమా మాలు మంచి గుర్తింపును తీసుకురావాలని కోరుకున్నాం. ఫ్యూచర్లో మరిన్ని మంచి మంచి సినిమాలు చేయడానికి ఈ సినిమా ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం. పాటలకు టీజర్ ట్రైలర్‌కు ప్రేక్షకులు వండర్ఫుల్ సపోర్ట్ అందించారు. సినిమా తప్పకుండా మీ అందరికీ నచ్చుతుందన్నారు.


# ప్రేక్షకుల్ని ఆకట్టుకునే మూవీ '28$^0$ సి'

ఎమోషనల్ థ్రిల్లర్ లవ్ స్టోరీ మూవీ "28$^0$సి"తో ప్రొడ్యూసర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు యువ నిర్మాత సాయి అభిషేక్. ఆయన వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి హీరో హీరోయిన్లుగా ఈ సినిమాను నిర్మించారు. "పొలిమేర" ఫేమ్ డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ తన మొదటి సినిమాగా "28$^0$సి" రూపొందించారు. ఈ సినిమా ఈ నెల 4వ తేదీన గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. జరిగిన ఇంటర్వ్యూలో "28$^0$సి" మూవీ హైలైట్స్ తెలిపారు నిర్మాత సాయి అభిషేక్. నేను, డైరెక్టర్ డా.అనిల్ విశ్వనాథ్ క్లోజ్ ఫ్రెండ్స్. మూవీస్ మీద మా ఇద్దరికీ ప్యాషన్ ఉండేది. అనిల్ క్షణం సినిమాకు డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌లో జాయిన్‌అయ్యాడు. నేను కూడా డైరెక్షన్ వైపు ప్రయత్నాలు చేశాను. కొద్ది రోజుల తర్వాత మనమే కలిసి మూవీ చేద్దామని నేను, అనిల్ నిర్ణయించుకున్నాం. "28$^0$సి" అనే టెంపరేచర్ పాయింట్‌తో అనిల్ విశ్వనాథ్ చెప్పిన కథ ఇంప్రెస్ చేసింది. ప్రేక్షకులకు కూడా ఇది కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకంతో మూవీ స్టార్ట్ చేశాం. మొదట ఈ మూవీకి వేరే హీరోలను అనుకున్నా, నవీన్ చంద్రకే బాగుంటుందనే నిర్ణయించాం. ఈ మూవీకి ఫస్ట్ అనుకున్న హీరోయిన్ అంజలి. కొంత ట్రెండీగా కొత్త ఫేస్ ఉంటే బాగుంటుందని షాలినీని తీసుకున్నాం. వైజాగ్‌లో షూటింగ్ స్టార్ట్ చేశాం. అక్కడి నుంచి గోవా, ఆ తర్వాత జార్జియా వెళ్లాం. ప్రొడక్షన్ విషయంలో రాజీ పడకుండా హై క్వాలిటీతో మూవీ చేశాం. సినిమా కంటెంట్ మీద మా టీమ్ అందరికీ మంచి నమ్మకం ఉండేది. 2019లోనే "28$^0$సి" మూవీ రెడీ అయ్యింది. 2020 మేలో రిలీజ్ చేయాలని అనుకున్నాం. కరోనా పాండమిక్ వల్ల థియేటర్స్‌లో రిలీజ్ చేయడం కుదరలేదు. ఓటీటీ ఆఫర్స్ వచ్చినా ఈ ప్లాట్ ఫామ్స్‌కు ఇంత డిమాండ్ ఏర్పడుతుందని అప్పుడు ఊహించలేదు. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం సినిమా కదా థియేటర్స్‌లోనే రిలీజ్ చేయాలనే కోరిక ఉండేది. నా కో ప్రొడ్యూసర్స్, అనిల్, టీమ్ అందరితో డిస్కస్ చేశాక వాళ్ల సపోర్ట్‌తో థియేటర్స్‌లోనే రిలీజ్ చేయాలని పట్టుదలగా వేచి చూశాం. కొద్ది రోజుల్లో అంతా మామూలుగా అవుతుందని అనుకుంటే, అది కొన్నినెలల పాటు సాగింది. అలా మామూవీ రిలీజ్ ఆలస్యమైంది. వంశీ నందిపాటి ఇనిషేటివ్‌తో ఈనెల 4న మా "28$^0$సి" సినిమాను థియేట్రికల్‌గా రిలీజ్ చేయబోతున్నాం. హీరోగా నవీన్ చంద్ర మాకు బాగా కోపరేట్ చేశాడు. సినిమాను మాతో పాటు ఆయన బాగా నమ్మాడు. షూటింగ్ టైమ్‌లోనే కాదు ఇప్పుడు ప్రమోషన్స్ లో కూడా సపోర్ట్ చేస్తున్నాడు. ఆయన క్యారెక్టర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది. అలాగే హీరోయిన్ షాలినీ బాగా పర్ఫార్మ్ చేసింది.



# 'మోగ్లీ 2025' ఫస్ట్ లుక్ సూపర్

తన తొలి చిత్రం బబుల్ గమ్‌లో తన అద్భుతమైన నటనతో అలరించిన యంగ్ హీరో రోషన్ కనకాల ప్రస్తుతం మోగ్లీ 2025లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నింగ్ కలర్ ఫోటో డైరెక్టర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో మల్టీ ట్యాలెంటెడ్ బండి సరోజ్ కుమార్ ఓ పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. నోలన్‌గా ఆయన పాత్రని పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. కాండిల్‌తో సిగరెట్ వెలిగిస్తూ ఇంటెన్స్‌గా చూస్తున్న ఫస్ట్ లుక్ అదిరిపోయింది. ఈ చిత్రంలో ఆయన పాత్ర ఎంత రూత్ లెస్‌గా వుండబోతోందో ఈ పోస్టర్ తెలియజేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. గ్లింప్స్ రోషన్‌ను హైఆక్టేన్ యాక్షన్ అవతార్‌లో చూపించింది. ఈ చిత్రంతో సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్‌గా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కిరణ్ మామిడి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తుండగా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రాఫర్ చేస్తున్నారు. స్క్రీన్‌ప్లేను రామ మారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. ప్రతిభావంతులైన తారాగణం, టెక్నికల్ టీంతో రూపొందుతున్న మోగ్లీ 2025 సినీ ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించబోతోంది. మోగ్లీ 2025 ఈ సంవత్సరం చివర్లో విడుదల కానుంది. తారాగణం: రోషన్ కనకాల, సాక్షి సాగర్ మడోల్కర్, బండి సరోజ్ కుమార్ సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సందీప్ రాజ్, నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్, బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సంగీతం: కాల భైరవ డిఓపి: రామ మారుతి ఎం, ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్: కిరణ్ మామిడి, యాక్షన్: నటరాజ్ మాడిగొండ సహ రచయితలు: రామ మారుతి. ఎం అండ్ రాధాకృష్ణరెడ్డి, పీఆర్వో: వంశీ శేఖర్.



# ఎంఎస్ఆర్ క్రియేషన్స్ 'ప్రొడక్షన్ నం.1' షురూ

ప్రముఖ దర్శకుడు మల్లిడి వశిష్ట సోదరుడు మల్లిడి కృష్ణ దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఎంఎస్ఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్.1గా కుశాల్ రాజును హీరోగా పరిచయం చేస్తూ స్కైఫై డ్రామాను తెరకెక్కించబోతున్నారు. డా.లతా రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం సోమవారం అన్నపూర్ణ స్టూడియోలో అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో స్టార్ డైరెక్టర్స్ వీవీ వినాయక్, మల్లిడి వశిష్ట, ఎస్వీ కృష్ణారెడ్డితో పాటు నిర్మాతలు అచ్చిరెడ్డి, బెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి స్క్రిప్ట్‌ను అందజేయగా, వీవీ వినాయక్ ఫస్ట్ షాట్‌కు క్లాప్ కొట్టారు. మల్లిడి వశిష్ట ఫస్ట్ షాట్ డైరెక్టర్ చేశారు. ఎన్నో హిట్ చిత్రాలకు సంగీతం అందించిన శ్రీచరణ్ పాకాల ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పూజా కార్యక్రమంలో దర్శకుడు మల్లిడి కృష్ణ మాట్లాడుతూ, '2012లో నా జర్నీ మొదలైంది. ఎన్నోమలుపులు తిరిగి మీ ముందుకు డైరెక్టర్‌గా వచ్చాను. లతకి నేను ఫస్ట్ థ్యాంక్స్ చెప్పాలి. అలాంటి మంచి నిర్మాత దొరకాలంటే అదృష్టం ఉండాలి. ఇదొక స్కైఫై డ్రామా మూవీ. ఓటీటీల యుగంలో ఇలాంటి కథను ఎంచుకోవాలంటే ధైర్యం ఉండాలి. రాబోయే ఈవెంట్స్‌లో మరిన్ని వివరాలు వెల్లడిస్తా" అని చెప్పారు. సీనియర్ నటుడు పృథ్వీరాజ్ మాట్లాడుతూ, "పెళ్లి సినిమా తర్వాత నేను చేసిన కొన్ని సినిమాలకు ఇలాంటి భారీ ఓపెనింగ్స్ జరిగాయి. మళ్లీ ఇప్పుడు ఇంత భారీ స్థాయిలో గ్రాండ్ ఓపెనింగ్ జరగడం సంతోషంగా ఉంది. ఇందులో నాది పాజిటివ్ క్యారెక్టర్. డైరెక్టర్ వచ్చి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జయిట్ అయ్యాను. యానిమల్ మూవీ తర్వాత నా సెకెండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ అయింది. ప్రస్తుతం నేను 19 సినిమాలు చేస్తున్నా. అందులో ఇది ఒక బెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పొచ్చు. డైరెక్టర్ కృష్ణ వెరీ టాలెంటెడ్ పర్సన్. మొన్న జరిగిన ఫోటో షూట్ తో నాకు ఆ విషయం అర్థమైంది. ఈ సినిమా చాలా పెద్ద హిట్ అవుతుంది." అని చెప్పారు. హీరో కుశాల్ రాజు మాట్లాడుతూ,"నా దర్శకుడు కృష్ణకు నేను థ్యాంక్స్ చెప్పాలి. నన్ను హీరోగా పరిచయం చేయడం కోసం మా అమ్మ లతగారు చాలా కేర్ తీసుకున్నారు. వీవీ వినాయక్‌కి, బెల్లంకొండ శ్రీనివాస్‌కి, మా టీమ్ మొత్తానికి బిగ్ థ్యాంక్స్" అని అన్నారు. నిర్మాత డాక్టర్ లతారాజు మాట్లాడుతూ, "నిర్మాతగా నాకు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ లేదు. మా అబ్బాయి కోరిక మేరకు నేను నిర్మాత అవ్వాల్సి వచ్చింది.



# నేను గర్వపడే మూవీ 'సారంగపాణి జాతకం'

కోర్ట్ చిత్రంతో కెరీర్ బెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న వెర్సటైల్ స్టార్ ప్రియదర్శి టైటిల్ రోల్ ప్లే చేసిన చిత్రం "సారంగపాణి జాతకం". "జెంటిల్ మ్యాన్, సమ్మోహనం" చిత్రాల అనంతరం ఇంద్రగంటి మోహనకృష్ణ శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో ప్రియదర్శి, హీరోయిన్ రూపా కొడవాయూర్, దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్, ఛాయాగ్రాహకుడు పి.జి.విందా, ఈ చిత్రంలో ముఖ్యపాత్రలు పోషించిన అవసరాల శ్రీనివాస్, సాయి శ్రీనివాస్ వడ్లమాని, అశోక్ కుమార్, ప్రదీప్ రుద్ర, నివితా మనోజ్, సమీర భరద్వాజ పాల్గొన్నారు!

**మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత..**

**చాలా మంచి సినిమా!..** చిత్ర ఛాయాగ్రాహకుడు పి.జి.విందా మాట్లాడుతూ, "అష్టాచెమ్మా, అమీతుమీ" తర్వాత ఇంద్రగంటితో



నేను చేసిన మూడో సినిమా "సారంగపాణి జాతకం". శ్రీదేవి మూవీస్‌లో కూడా నాకిది మూడో చిత్రం. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత మంచి సినిమా ఇది. ఈ చిత్రానికి పని చేయడం నాకు గర్వకారణం. దర్శి నుంచి కోరుకునే కామెడీ ఇందులో పుష్కలంగా ఉంటుంది" అన్నారు!

**ఇంద్రగంటి సినిమాల్లో భాగం..**

**..కావడం ఓ భాగ్యంగా భావిస్తా!..**

ఈ చిత్రంలో ఓ ముఖ్యపాత్ర పోషించిన అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ... "ఇంద్రగంటి మోహన్ కృష్ణ గారి సినిమాల్లో భాగం కావడం ఓ అదృష్టంగా భావిస్తాను. ఇందులో జాతకాలు చెప్పే మోడరన్ స్వామిగా ఎంటర్టైన్ చేస్తాను" అన్నారు!

**నా పేరు పరపతి..**

**పదింతలుపెంచే చిత్రం!..** నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, "నిర్మాతగా నా సెకండ్ ఇన్నింగ్స్ ఇంద్రగంటి మోహన్ కృష్ణ "జెంటిల్ మ్యాన్"తో స్టార్ట్ అయ్యింది. "సమ్మోహనం"తో విజయపరంపర కొనసాగింది. సమంత "యశోద" కూడా మంచి విజయం సాధించింది.

# 'ప్రొడక్షన్ నంబర్ 2' అనౌన్స్‌మెంట్

కలర్ ఫోటోతో అందరినీ ఆకట్టుకొని రైటర్ పద్మభూషణ్‌తో బిగ్ సక్సెస్‌ని సాధించిన సుహాస్ మరో కంటెంట్ రిచ్ సినిమాకి సైన్ చేశారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నంబర్ 2గా బి నరేంద్ర రెడ్డి నిర్మించనున్న ఈ న్యూ వెంచర్‌కు గోపి ఆచార దర్శకత్వం వహిస్తున్నారు. రైటర్ పద్మభూషణ్‌తో ప్రశంసలు అందుకున్న షణ్ముక ప్రశాంత్ ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. ఈ చిత్రం అవుట్ అండ్ అవుట్ ఫన్ రైడ్‌గా ఉండబోతోంది. అద్భుతమైన కామెడీ టైమింగ్‌కు పేరుపొందిన సుహాస్ ఈ చిత్రంలో హిలేరియస్ పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు మూడు నెలల్లో ముగుస్తాయని, జూలైలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని మేకర్స్ తెలిపారు. నటీనటులు,సిబ్బందికి సంబంధించిన మరిన్ని అనౌన్స్ మెంట్ త్వరలో రానున్నాయి. తారాగణం: సుహాస్, లసాంకేతిక సిబ్బంది: బ్యానర్: త్రిశూల్ విజనరీ స్టూడియోస్, నిర్మాత: బి నరేంద్ర రెడ్డి, దర్శకత్వం: గోపీ ఆచార, కథ: షణ్ముక ప్రశాంత్, పీఆర్వో: వంశీ శేఖర్.



# ప్రధాని వ్యక్తిగత కార్యదర్శిగా..



ప్రధానమంత్రి మోదీకి ప్రైవేట్ సెక్రటరీగా ఓ అధికారిణి నియమితులయ్యారు. దాంతో ఎవరీమె? అంటూ అందరిలోనూ ఆసక్తి మొదలైంది. ఆవిడే నిధి తివారీ. 2014 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారిణి. వారణాసి మెహమూర్గంజ్‌లో చేరిన ఆమె... సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంకు సాధించారు. ఈ పరీక్ష రాయకముందు అసిస్టెంట్ కమిషనర్ (కమర్షియల్ ట్యాక్స్)గా వారణాసిలో పనిచేశారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్ ర్యాంకు సొంతం చేసుకున్నారు. పీఎంఎలో చేరకముందు విదేశాంగ మంత్రిత్వశాఖలో పని చేశారు ఆ తరవాత 2022లో ప్రధానమంత్రి అండర్ సెక్రటరీగా చేరిన ఆమె తన ప్రతిభతో అనతికాలంలోనే డెప్యూటీ సెక్రటరీగా ఎదిగారు. ఇందులో భాగంగా ఫారెన్ అండ్ సెక్యూరిటీకి చెందిన అంశాలను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్కు ఆమె నివేదించారు. ప్రత్యేకించి అణుశక్తి, విదేశాంగ, భద్రతా సిబ్బందిలో ఆమె కీలకంగా వ్యవహరించారు. ఈ పనితనమే ఆమెను అందరిలోనూ ప్రత్యేకంగా నిలిపింది. ప్రధాని వ్యక్తిగత కార్యదర్శిగా ఎంపికయ్యే అర్హతను సంపాదించేలా చేసింది. ▫

# ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ..



చదువుకునే రోజుల్లోనే తమ మేధస్సుతో అద్భుతాలు సృష్టిస్తున్నారు కొందరు అమ్మాయిలు. శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేస్తూ కొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. భారత సంతతికి చెందిన దివ్య త్యాగం ఇదే కోవకు చెందుతుంది. ప్రస్తుతం పెన్సిల్వేనియా యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ చదువుతున్న ఆమె.. ఏరోడైనమిక్స్ లో మహామహులు సైతం పరిష్కరించలేని వందేళ్ల నాటి సమస్యను ఇటీవలే పరిష్కరించారు. నుండి గాలి మరల రూపకల్పనలో ఆధునాతన మార్గాలకు తెరతీసినట్లయింది. అంతేకాదు.. దివ్య చూపిన పరిష్కార మార్గం బ్రిటిష్ ఏరోడైనమిస్ట్ హెర్మన్ గ్లౌకెట్ రూపొందించిన గాలి మరల నమూనాను మరింత మెరుగుపరిచేలా ఉందంటూ ఈ విశ్వవిద్యా లయం దివ్యపై ప్రశంసలు కురిపించింది. ఈ నేపథ్యంలో ఈ యంగ్ ట్యాలెంట్ గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందాం..!

**పరిశోధనలే ప్రాణంగా...**

వివిధ విషయాలను తెలుసుకోవాలని పరిశోధ నలు చేయడం, కొత్త విషయాలు ఆరాట పడుతోంది నేటి యువత. దివ్య కూడా ఇలాంటి అమ్మాయే! భారత సంతతికి చెందిన ఆమె.. ప్రస్తుతం గ్రేటర్ ఫిలడెల్ఫియాలో నివసిస్తోంది. చిన్నతనం నుంచి విమానయానం, రక్షణ వ్యవస్థలు, అంతరిక్ష నౌకలు.. ఇతర విషయాలపై ఆసక్తి చూపడం. ఈ మక్కువతోనే పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తిచేసిన దివ్య.. ప్రస్తుతం ఇదే యూనివర్సిటీలో, ఇదే డిగ్రీ మాస్టర్స్ చదువుతోంది. తదుపరి సంబంధిత పరిశోధనలూ నిర్వహించామె. ఈ కావనే కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఈఎఫ్ఈ)లో కటింగ్ ఎడ్జ్‌తో పలు ప్రయోగాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఇకపై విమానయాన భద్రతను అందించడంపై దృష్టి పెట్టిన ఈ బ్రిలియంట్ లేడీకి ఈ యూఎస్ నేవీ నుంచి పూర్తి సహకారం కూడా అందుతోంది.

**పందేళ్ల నమూనాకు కొనసాగింపుగా!**"ఆత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ దివ్య నిర్వహించే పరిశోధనలు.. ఈ రంగంలో సరికొత్త వ్యక్తులకు శ్రీకారం చుడుతుంటాయి. అలా మరల పనితీరుపై ఆమె చేసిన పరిశోధన ఈ కాంశంలో వందేళ్ల నాటి గణిత సమస్యకు పరిష్కారం చూపింది. టర్బైన్ రోటర్‌పై ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈ యువ శాస్త్రవేత్త పరిశోధనలు కనుగొన్నారు.. ఈ రంగంలో రాణించాలనే భవిష్యత్ తారల వారికి ఇది మరింత ఉపయోగకరమని.. ఈ అధ్యయనంలో దివ్యకు గైడ్ చేసిన Sven Schmitz తెలిపారు.



ఈ పరిశోధనకు సంబంధించిన థీసిస్ 'విండ్ ఎనర్జీ సైన్స్' అనే జర్నల్లో ప్రచురితమైంది. 'ఉత్తమ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ థీసిస్'గానూ ఘనత ఏర్పడింది. ఇలా దివ్య పరిశోధనకు గుర్తింపుగా "Anthony E. Wolk Award" కూడా దక్కింది.

**ఉత్పత్తి ఎక్కువ.. ఖర్చు తక్కు!** అయితే తాను చేసిన ఈ పరిశోధన భవిష్యత్తులో పవన్ శక్తి ఉత్పత్తిని పెంచడంలో, దానికయ్యే ఖర్చును తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతోంది దివ్య. ఒక పెద్ద గాలి మర శక్తిని 1 శాతం పెంచడం వల్ల టర్బైన్ విడుదల చేసే విద్యుత్ ఉత్పత్తి పెరుగుతుంది.దీనితో ఒక చిన్న గ్రామానికి సరిపడా విద్యుత్ను అందించవచ్చు. ఇలా ఈ మరల సహాయంతో విద్యుత్ ఉత్పత్తి పెరగడం వల్ల ఆటోమెటిక్గా దాన్ని వినియోగించుకునే వారికి కూడా తగ్గుతుంది. ఈ గాలి మరల పరిశోధన కోసం, థీసిస్ రాయడానికి నేను వారానికి 1015 గంటల సమయం కేటాయించాను. అయితే ఇది గణిత శాస్త్రంతో ముడిపడి ఉండటం వల్ల కాస్త ఎక్కువ సమయం పట్టింది. అయినా నా పనితీరు నాకు సంతృప్తినిచ్చింది. పవన్ విద్యుత్ శక్తి అనే అంశంలో సరికొత్త ఒరవడిని సృష్టించినందుకు గర్వంగా అనిపిస్తోంది.. అంటోంది యంగ్ రీసెర్చర్. ఇలా దివ్య చేసిన పరిశోధన, ఆమె ప్రతిభను పెన్సిల్వేనియా యూనివర్సిటీ కొనియాడింది. ఈ పరిశోధనను అటు అమెరికా వ్యాప్తంగా, ఇటు ప్రపంచవ్యాప్తంగా పాఠ్యాంశాల్లో చేర్చాలని నిర్ణయించింది. ▫

# 'చీరె'పై కాలేజి



డిగ్రీ పట్టా తీసుకోవడమనేది ఏ విద్యార్థి జీవితంలోనైనా మైలురాయి. ఆరోజు మీకు నచ్చిన డ్రెస్ వేసుకుని కాలేజీ/యూనివర్సిటీ ప్రాంగణమంతా తిరుగు తుంటారు. ఫొటోలకూ పోజులిస్తారు. కాకినాడకు చెందిన రమ్యారావు చావల అందుకు భిన్నంగా, ఆరోజు తాను కట్టిన చీరపైన తను చదివిన కాలేజీ బొమ్మని వేయించుకున్నారు. హైదరాబాద్‌లోని 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' నుంచి ఇటీవలే రమ్య పీజీపీ ప్రోగ్రాం పూర్తయింది. గ్రాడ్యుయేషన్ డేకు తన చీర కొంగుమీద ఐఎస్‌బీ హైదరాబాద్, మొహాలీ క్యాంపస్ల బొమ్మలను హ్యాండ్‌గా



చేసి తన ప్రత్యేకతను ప్రదర్శించారు. తన వినూత్న ఆలోచనతో డిగ్రీతోపాటు ఆరోజు 'బ్రాండ్ అంబాసిడర్ ఆఫ్ ఐఎస్‌బి' అవార్డును అందుకున్నారు. ▫

# లక్ష్యాలను నిర్దేశించండి

**ఈ రోజుల్లో తల్లిదండ్రులు... పిల్లలు అడిగిందల్లా ఇవ్వడమే గొప్ప అమకుంటున్నారు.** కానీ, ఏ మాత్రం శ్రమించకుండానే కోరినవన్నీ దక్కుకుంటే... భవిష్యత్తులో కష్టనష్టాలను



తట్టుకోలేకపోవచ్చు. ఒకవేళ ఎప్పుడైనా తాము అనుకున్నది జరగనప్పుడు తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం, వాటిని సాధించుకోవడానికి ఇతరులను బెదిరించడం జరగొచ్చు. తాము పడ్డ కష్టాలు తమ బిడ్డలు పడకూడదనుకుంటారు కొందరు తల్లిదండ్రులు. అందుకే అడగకముందే అన్నీ సమకూరుస్తారు. మంచి విషయమే కానీ, అవసరాలకు మించిన సౌకర్యాలు, విలాసాలకు వారు అలవడితే భవిష్యత్తుకే ముప్పు. ముఖ్యంగా కష్టం విలువ తెలియకపోతే, సర్దుబాట్లు అర్థం కాకపోతే ఒక్కోసారి జీవితాన్నే కోల్పోవలసి వస్తుంది. అందుకే ఏ వయసులో ఏమివ్వాలి? ఎంత ఇవ్వాలి? అన్నది పెద్దలకు తెలిసి ఉండాలి.

ఒక్కోసారి పిల్లలు తాము కోరింది చేయాల్సిందే అని పట్టుబడుతుంటారు. మీరు అంగీకరించడం మొదలు పెడితే దాన్నే అలుసుగా తీసుకునే ప్రమాదం ఉంది. అది నో చెప్పాల్సిందే అనుకున్నప్పుడు మొహమాటానికి పోవద్దు. ముఖ్యంగా ఖరీదైన వస్తువులనో, వినోదాలనో ఏంచుకుంటే... మీ స్థాయికి తగ్గ ప్రత్యామ్నాయాలను చూపించండి. తక్కువలోనూ ఎక్కువ సంతృప్తి పొందగలిగే విధానాలను పరిచయం చేయండి. అప్పుడే పిల్లలకు జీవితం విలువ అర్థమవుతుంది. ఏ కారణంతో అయినా పిల్లలు అడిగింది పేచీ పెడితే వెంటనే తలొగ్గకండి. వారు అడిగింది ఎంత చిన్నదైనా, పెద్దదైనా సరే... ఊరకే ఇచ్చేయొద్దు. ఒకవేళ మీరు అంగీకరిం చాల్సి వచ్చినా... దానికి షరతులు విధించండి. దాన్ని సాధించాలంటే.. వారికి కొన్ని లక్ష్యాలను నిర్దేశించండి. వాటిని పూర్తి చేస్తేనే దక్కుతాయనే విషయం చెప్పండి. అప్పుడే ఏదైనా కావాలంటే కష్టపడాలన్న విషయం అర్థమవుతుంది. ▫



మన దేశంలో మహిళల విజయ గాథల ప్రభావం వారు పని చేస్తున్న రంగానికే పరిమితం కాలేదు. ఆ విజయ తరంగాలు ప్రతి మహిళా తనకు నచ్చిన రంగంలో ప్రవేశించి రాణించేలా స్ఫూర్తినిసునతన్నాయి.

**- ఫాల్గుణి నాయర్, నైకా**

# ప్రెగ్నెన్సీలో ప్రయాణాలు మంచిదేనా ?



గర్భం ధరించానని తెలియ గానే కొందరు తమ పనులు తాము కూడా వెనక ముందు అవుతారు. ఇంకొంతమందైతే అత్యవసర పరిస్థితుల్లో తప్ప డెలివరీ అయ్యే వాక ప్రయాణాలు కూడా మానుకుంటారు. ఇలా తమ పనుల వల్ల కడుపులోని బిడ్డకు ఏదైనా కలుగుతుందేమో అని జాగ్రత్తపడుతుంటారు కాబోయే అమ్మలు. అయితే ప్రెగ్నెన్సీ అనేది అనారోగ్యం కాదని, ఈ శరీరం, ఆరోగ్యం సహకరిస్తే ఎవరికి వారు అన్ని పనులు చేసుకోవచ్చని, దీనివల్ల మరింత చురుగ్గా ఉండగలుగు తారని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. గర్భంతో ఉన్నప్పుడు ప్రయాణాలు కూడా చేయకూడదు, అయితే అందుకు ముందుగా డాక్టర్ సలహా ఇస్తున్నారు. ఇక దీనితో పాటు ప్రయాణం చేయాలనుకునే గర్భిణులు కొన్ని జాగ్రత్తలు కూడా పాటించడం అన్ని విధాల శ్రేయస్కరమంటు న్నారు. మరి, ఇంతకీ ఆమెతో తెలుసుకుందాం ..


మన ఉండే ప్రొజెస్టారాన్ హార్మోన్ గర్భాశయానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈ గర్భాశయ ముఖద్వారాన్ని బిగుతుగా ఉంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఫలితంగా మెట్లెక్కడం, ప్రయాణాలు, చిన్నపాటి వ్యాయామాలు.. స్టాండింగ్ చేయడం వల్ల ఎలాంటి ఇబ్బంది కలగదని నిపుణులు చెబుతున్నారు. అయితే గర్భం ధరించిన మహిళల్లో ఒక్కొక్కరి ఆరోగ్య పరిస్థితి ఒక్కోలా ఉంటుంది. ఈ ఎవరైనా చురుగ్గా ఉంటే మరికొందరు ఎక్కువ సమయం విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుంది. కాబోయే అమ్మలు మాత్రం ప్రయాణాలు చేసేటప్పుడు వైద్యుల సలహాతో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.

**తేలికైన ఆహారం.. అనుకూలమైన దుస్తులు !**

గర్భం ధరించిన మహిళల్లో వికారం, వంతులు.. వంటి లక్షణాలు కొన్ని నెలల పాటు కొనసాగుతాయి. అందుకే ప్రయాణాల్లో ఇలాంటి సమస్యలు లేకుండా ఉండాలంటే సులభంగా జీర్ణమయ్యే పోషకాహారాన్ని తక్కువ మొత్తంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ప్రయాణ సమయంలోనూ తేలికపాటి ఆహారమే మంచిది. మీ ప్రెగ్నెన్సీ రిపోర్టులు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్స్, మందులు.. వంటివన్నీ ఎప్పుడూ మీ వెంటే ఉంచుకోవాలి. ఏదైనా అత్యవసరం వస్తే వెంటనే అక్కడికి దగ్గరలోని ఆసుపత్రిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవచ్చు. ఓ నీళ్ల బాటిల్ను వెంట ఉంచుకోవడమూ మరవద్దు. అలాగే మధ్యమధ్యలో వీలుంటే కొబ్బరి నీళ్ల తాగడం వల్ల శరీరంలో నీటి స్థాయులు పడిపోకుండా ఉంటాయి.. అలాగే శరీరానికి తక్షణ శక్తి కూడా వస్తుంది. ఇక పండ్ల రసాలు తాగాలనుకున్న వారు ఇంటి నుంచే తయారు చేసి పట్టుకెళ్లడం ఉత్తమం. ప్రయాణాల్లో బిగుతైన దుస్తులు కాకుండా వదులు, వస్తువులు ఉండే దుస్తులు వేసుకోవడం మంచిది. కూర్చున్నా ఇబ్బందిగా అనిపించదు. అలాగే చెప్పుల విషయంలోనూ ఫ్లాట్స్‌ఖిని ఏంచుకుంటే కంఫర్టబుల్గా నడవడానికి వీలవుతుంది. ఇక మధ్యమధ్యలో టాయిలెట్స్‌కి వెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఈ విధంగా ఆయా వాష్రూమ్స్ డోర్స్, నర్సిని తాకినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడానికి వీలుగా మీ వెంటే ఓ మినీ హ్యాండ్‌వాష్ బాటిల్‌ను ఉంచుకోవడం మంచిది. అలాగే మధ్యమధ్యలో చేతులు శానిటైజ్ చేసుకోవడమూ ముఖ్యమే. జెస్టేషనల్ డయాబెటిస్ లేదంటే మల్టిపుల్ ప్రెగ్నెన్సీ (కవలలు, ట్రిప్లెట్స్‌కు జన్మనివ్వబోయే తల్లులు) ఉన్న వారు విమానాల్లో ప్రయాణించకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. అలాగే గర్భం ధరించి 35 వారాలు దాటిన వారు కూడా విమాన ప్రయాణానికి నో చెప్పడమే మంచిదట! ఎందుకంటే ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రి-మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయట! ఇక కారులో వెళ్లే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మధ్యమధ్యలో ప్రశాంతమైన వాతావరణం ఉన్న ప్రదేశంలో వాహనాన్ని ఆపి కాసేపు రిలాకనసవడం, అటూ ఇటూ తిరగడం వల్ల ప్రయాణ అలసటను దూరం చేసుకోవచ్చు.

**ఈ సమస్యలుంటే వద్దే వద్దు ! ...**

అయితే కొన్ని అనారోగ్యాలున్న గర్భిణులు మాత్రం ప్రయాణాలు చేయకపోవడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. గతంలో గర్భస్రావం లేదా ప్రీ మెచ్యూర్ డెలివరీ అయిన వారు గర్భాశయంలో ఏదైనా సమస్యలుంటే. గర్భం దాల్చిన తొలి నెలల్లో రక్తస్రావం లేదా ఇతర సమస్య లెదురైతే.. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ (గర్భాశయం వెలుపల పిండం పెరగడం), లేటు వయసులో గర్భం ధరించడం, కవలలు లేదా



ట్రిప్లెట్స్ తమ గర్భంలో పెరుగుతున్నప్పుడు (మల్టిపుల్ ప్రెగ్నెన్సీ)... ఇలాంటి వారు ప్రయాణాలు చేయకపోవడమే మంచిదట. ▫

# ఆమ్‌చూర్ పొడర్ చేద్దామా !

కూరలు, చిరుతిళ్లలో ఆమచూర్ పొడర్ వాడుతాం. కొన్ని సార్లు చారులో కూడా చింతపండు లేదా నిమ్మ రసానికి బదులు దీన్నే వేస్తాం. సమోసా చాట్, శాండ్విచ్లోనూ ఇదుండాల్సిందే! ఆ రుచి అలాంటిది. ఇంత ముఖ్యమైన ఆమూర్ పొడర్ని కొనకుండా ఇంట్లోనే చేసుకుంటే ఇంకెంత బాగుంటుంది కదూ? ! ఇదేదో పెద్ద ప్రహసనం అనుకుంటున్నారా.. ఊహూ, చాలా తేలిగ్గా చేసేయొచ్చు. దీనికి పచ్చి మామిడికాయలు, కాస్తంత ఉప్పు ఉంటే చాలు. కాయలు మాత్రం చాలా పుల్లగా ఉండేవాటిని ఎంచుకోవాలి. నాలుగు కాయలకు అర చెంచా ఉప్పు పడుతుంది. మామిడి కాయలను కడిగి, చెక్కు తీసి.. ఒక అర గంట సేపు నీళ్లలో ఉంచాలి. లేకుంటే రంగు మారి, నల్లగా అవు తాయి. బయటకు తీసి, తుడిచి.. చిప్స్ కటర్తో స్లైసులుగా కోయాలి. అవి సన్నగా ఉండాలి. లేదంటే సరిగ్గా ఎండవు. అన్నీ అయ్యాక శుభ్రమైన వస్త్రం మీద పరచి.. పగలు ఎండలో, రాత్రి లోనికి తెచ్చి ఫ్యాన్ కింద ఎండబెట్టాలి. ఇలా మూడు రోజులు చేయాలి. వీటికి ఉప్పు జతచేసి, గ్రైండ్ చేయాలి. చాలా మెత్తగా ఉండాలి కనుక.. జల్లెడపట్టి, మళ్లీ గ్రైండ్ చేయాలి. ఈ ఆమూర్ పొడర్ న్ను తడి లేని, గాలి చొరబడని సీసాలో భద్రంచేస్తే.. ఆరు నెలలు నిలవనుంది. ▫



# ఇంటిని కాలుష్య రహితంగా...

బయటి కాలుష్యం నుంచి తప్పించుకోవ దానికి ఇల్లే సురక్షితమైన ప్రదేశం అనుకుంటాం. ఈ క్రమంలోనే ఇంటి వాతావర ణాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి పలు చిట్కాలు పాటిస్తుంటాం. అయితే నిజానికి ఇల్లూ కాలుష్యానికి మినహాయింపేమీ కాదంటున్నారు నిపుణులు, ఇంట్లోని చుప్పట్లు, కాన్పెట్లు, కర్టెన్లు, పెంపుడు జంతువులు, వంటగదిలో వెలువడే వాయువులు, వాడుకునే ఉపకరణాలు, ఆఖరికి పెంచుకునే కొన్ని మొక్కలు కూడా కాలుష్య కారకాలే అని చెబుతున్నారు. తద్వారా దగ్గు, ఆస్తమా, అలర్జీలు, చర్మవ్యాధులు.. ఇలా వివిధ సమస్యలు తప్పవంటున్నారు. అందుకే వీటి పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. మరి, ఇంటి కాలుష్యాన్ని తగ్గించడానికి నిపుణులు సూచిస్తున్న కొన్ని మార్గాలేంటో తెలుసుకుందాం రండి..



ఇల్లంతా సువాసనభరి తంగా ఉండాలని కొందరు కృత్రిమ ఎయిర్ ఫ్రెషనర్లు వాడుతుంటారు. ఇవి బెంజీన్, హైడ్రోకార్బన్.. వంటి రసాయనాల్ని వాతావరణంలోకి విడుదల చేస్తాయని చెబుతున్నారు నిపుణులు, తద్వారా కళ్లు, ముక్కు, గొంతుపై దుష్ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల పైనా ఈ రసాయనాలు ప్రతికూల ప్రభావం చూపుతాయ! అందుకే వీటికి బదులుగా సహజసిద్ధమైన పరిమళాల్ని విడుదల చేసే అత్యవసర నూనెల్ని రూమ్/ఎయిర్ ఫ్రెషనర్లుగా ఉపయోగించుకోవచ్చు.

**ఆ మొక్కలే!** ఇంటి నిండా మొక్కలు పెంచేస్తుంటారు. మొక్కలు రాత్రిపూట కార్బన్ డై ఆక్సైడ్ను విడుదల చేస్తాయనే విషయం మరవద్దు. తులసి లాంటి కొన్ని మొక్కలను ఇంట్లో పెంచుకోవడం మంచిది. అలాగే కాలుష్యాన్ని అరికట్టే మొక్కలకూ ప్రాధాన్యమివ్వాలి.

**గాలి, వెలుతురు..** చాలా వరకు ఇంట్లోకి గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా కిటికీలు, తలుపులు తెరిచి ఉంచాలి. సూర్యరశ్మి ఇంట్లో నేరుగా పడేలా చేయాలి. ఫలితంగా గదుల్లో తేమ, చెమ్మ వంటివేవైనా ఉంటే తొలగిపోతాయి. హానికారక వాయువులు బయటకు వెళ్లిపోతాయి.

**వీటితో..** వెనిగర్, బయో క్లీనర్ గా పని చేస్తుంది. ఇల్లు తుడిచే మిశ్రమంలో బయట దొరికే క్లీనర్స్‌కు బదులుగా దీన్ని నీటిలో కలపచ్చు. చీమలు, బొద్దింకలు, చిన్న చిన్న పురుగులు సహజంగానే కాలుష్య వాహకాలు. ఇవి బయటి కాలుష్యాన్ని ఇల్లంతా వ్యాపింపజేస్తాయి. వీటిని అరికట్టడానికి వంట సోడా అక్కడక్కడా చల్లాలి. వీటితో పాటు వంటగదిని, ఇంట్లో వాడే ఉపకరణాలు కర్టెన్లు. అలాగే ఇంట్లో పెంపుడు జంతువులుంటే వాటి విషయంలోనూ శుభ్రత పాటించాలి. ▫

# బలిని శపించిన విష్ణువు

బలి చక్రవర్తి శిశువుగా ఉన్నప్పుడు ఆయనను ఊయలలో వేసే ఉత్సవానికి విష్ణుమూర్తికి ఆహ్వానం అందలేదు. అందుకాయన కోపించి ఈ బాలుడు పెద్దయ్యాక తన వద్దకు యాచన కోసం వచ్చిన బ్రాహ్మణులను సంతృప్తి పరచపోతే చేటు వాటిల్లుతుంది. అని శపించాడు. తాను చక్రవర్తి అయ్యాక కూడా విష్ణు శాపాన్ని మర్చిపోలేదు బలి. ఒకరోజు పొట్టిగా ఉన్న బ్రాహ్మణుడు వచ్చి మేం రాజ్యంలో సనపక్షాదులకు ఆవాసముంది కానీ ఈ దీన బ్రాహ్మణుడు తలదాచు కోవడానికి గుడిసె కూడా లేదయ్యా. ఏ అరుగు మీదనైనా పడుకుంచామంటే నీళ్ల జల్లి పొమ్మంటున్నారు. మీ రాజ్యంలో ఆలయాలు కిటకిటలాడుతాయి. అక్క కుదరదు. కనుక మూడడుగుల నేల ఇస్తే.. సితంగా ఉంటాను అన్నాడు. అందుకు బలి రాష్ట్ర "మూడడుగులే చాలన్న బ్రాహ్మణుడి పాదం బ్రహ్మాండంగా ఎదిగి భూభాగమంతా ఆక్రమించింది. మరో అడుగు ఆకాశాన్ని ఆక్రమించింది. వచ్చిందనరో, జరుగుతున్నదేమిటో గ్రహించిన బలి మూడో అడుగు మీద పెట్టు స్వామి అన్నాడు. వామన రూపంలో ఉన్న విష్ణుమూర్తి హృదయం మెత్తబడి ఏదైనా వరం కోరుకోమన్నాడు. పాతాళలోకానికి వెళ్లబోతున్న బలిచక్రవర్తి ఒక రోజున దీపం పెట్టి వాను చేసేవారి ఇళ్ల లక్ష్మీనిలయాలు అయ్యేటట్టు వరమివ్వు' అన్నాడు. అలా దీపావళి పండుగ ఆరంభమైంది. ఆరోజు బలిచక్రవర్తిని తలచుకుంటూ దీపదానం చేయాలంటారు. ▫



ఆధ్యాత్మికం

# రోజంతా పరిమళభరితంగా..

చక్కని స్ప్రే లేదా పెర్ఫ్యూమ్ ఉపయోగిస్తే దాని ప్రభావంతో శరీరం పరిమళాలు వెదజల్లడమే కాదు.. మనసు కూడా కాస్త ఉత్సాహంగా మారుతుంది. అయితే ఇలా చేయడం వల్ల వచ్చే పరిమళం కొద్ది సమయం మాత్రమే నిలిచి ఉంటుంది. మరి, రోజంతా పరిమళభరితంగా ఉండాలంటే మనం ఉపయోగించే బ్యూటీ ఉత్పత్తులు, వేసుకునే దుస్తులు.. తదితర విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాంరండి..

ఉదయం స్నానం చేసిన తర్వాత సాయంత్రం వరకు వివిధ పనుల మీద బయటికి వెళ్తాం. అలాంటప్పుడు ముఖం జిడ్డుగా అనిపిస్తే సబ్బుతో ఫేస్‌వాష్ చేయడం కంటే బేబీ వైప్స్ తుడుచుకోవడం మేలు. ఫలితంగా మురికిపోయి ముఖం తాజాగా కనిపించడమే కాదు.. పరిమళభరితంగా కూడా మారుతుంది.

చాలామందిలో పాదాలకు చెమట పట్టి వాసన వస్తుంటుంది. మీరూ ఇదే సమస్యతో సతమతమవుతున్నారా? అయితే స్నానం చేసిన తర్వాత కాళ్లను బాగా ఆరనిచ్చి మాయిశ్చరైజర్ అప్లై చేయండి. అలాగే సాక్సు లు ధరించేవారు వాటిలోని పరిమళాలు వెదజల్లే పౌడర్ వేసినప్పుడు పాదాల నుంచి చెమట వాసన రాకుండా చెక్ పెట్టచ్చు. శరీరం పరిమళభరితంగా ఉండాలంటే వేసుకునే దుస్తులు కూడా సువాసనలు వెదజల్లడం చాలా ముఖ్యం. అందుకే దుస్తులు ఉతికేటప్పుడు ఫ్యాబ్రిక్ కండిషనర్లు వాడుతూనే, వార్డ్రోబ్లో భద్రపరిచేటప్పుడు కూడా నాఫ్తలీన్ బాల్స్ మూలల్లో వేస్తే ఫలితం ఉంటుంది. ▫



# బరిలోకి దిగకున్నా విజేతలే



వాషింగ్టన్ సుందర్



రిషభ్ పంత్



అర్షదీప్ సింగ్



యుజ్వేంద్ర చాహల్



సంజూ శాంసన్



యశస్వి జైస్వాల్

## ఒక్క మ్యాచ్ ఆడకుండానే ఛాంపియన్స్

**న్యూఢిల్లీ:** ప్రతి క్రికెట్ ప్లేయర్ దేశానికి ప్రాతినిధ్యం వహించాలని, ఐసిసి ట్రోఫీ గెలవాలని కలలు కంటుంటారు. కానీ, ఒక్కోసారి ఐసిసి టోర్నీలకు ఎంపికైనా, స్క్వాడ్‌లోని ఆటగాళ్లందరికీ మ్యాచ్ ఆడే అవకాశం రాకపోవచ్చు. ఇలా ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే ఐసిసి ట్రోఫీ గెలిచిన భారత్ ప్లేయర్లు చాలా మందే ఉన్నారు. ఈ ఏడాది జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో రోహిత్ శర్మ కెప్టెన్సీలో టీమిండియా విజేతగా నిలిచింది. ఈ జట్టులో యంగ్ ప్లేయర్లు వాషింగ్టన్ సుందర్, రిషభ్ పంత్, అర్షదీప్ సింగ్‌లు కూడా టీమిండియాలోని 15మంది స్క్వాడ్‌లో ఎంపికయ్యారు.

వీరంతా టీమ్‌ఇండియాతో పాటుగా, దుబాయ్‌కు కూడా వెళ్లారు. కానీ, ఈ ముగ్గురికి టోర్నీలో ఒక్క మ్యాచ్‌లో కూడా బరిలో దిగే ఛాన్స్ రాలేదు. దీంతో వీళ్లు టోర్నీలో ఒక్క గేమ్ ఆడకున్నప్పటికీ ఛాంపియన్స్ అయ్యారు. అలాగు అమెరికా, వెస్టిండీస్ వేదికగా గతేడాది టీ20 వరల్డ్ కప్-2024 జరిగింది. ఈ టోర్నీలోనూ భారత్ విశ్వవిజేతగా నిలిచింది. లెగ్‌స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, సంజూ శాంసన్ కూడా ఈ జట్టులో సెలెక్ట్ అయిన వారిలో ఉన్నారు. ఈ టోర్నీలో భారత్ తొలి మ్యాచ్ నుంచి ఓటమి లేకుండా దూసుకెళ్లింది. దీంతో విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చే ఉద్దేశం లేకపోవడం వల్ల చాహల్, శాంసన్‌కు ఆడే ఛాన్స్ రాలేదు. టోర్నమెంట్ అంతా బెంచ్‌కే పరిమితం అయ్యారు. అలా వీళ్లు కూడా విశ్వవిజేతలు అయ్యారు. 2013 ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌కు సంబంధించి టీమ్‌ఇండియా దీన్ని కూడా దక్కించుకుంది. ఆ టోర్నీకి ఆటగాళ్లు వినయ్ కుమార్, ఇర్ఫాన్ పఠాన్, అమిత్ మిశ్రా, మరళీ విజయ్ జట్టులో ఎంపికయ్యారు. కానీ, వీళ్లెవరూ ఈ ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో ఆడలేదు. అలా ఆ టోర్నీలో ఈ నలుగురు ప్లేయర్లు అసలు బరిలోకి దిగలేదు. అలాగే లెగ్ స్పిన్నర్ పియూష్ చావ్లా 2007 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా స్క్వాడ్‌లో ఉన్నాడు.

భారత్ ఆ టీ20 వరల్డ్ కప్ గెలిచింది. అయితే చావ్లాకి ఒక్క మ్యాచ్‌లో కూడా ఛాన్స్ రాలేదు. 2002లో ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్ శ్రీలంక తలపడ్డాయి. అయితే వర్షం కారణంగా మ్యాచ్ నిర్వహించడం సాధ్యం కాలేదు. దీంతో రెండు టీమ్‌లు టైటిల్ షేర్ చేసుకున్నాయి. ఇందులో జై ప్రకాష్ యాదవ్ టోర్నీకి సెలక్ట్ అయ్యాడు. కానీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. భారత్ తొలిసారి 1983లో వన్డే వరల్డ్ కప్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీకి ఎంపికైన సునీల్ వాల్సన్‌కి ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా రాలేదు. అయినా వీరంతా హీరోలు అయి పోయారు.



## ఇంగ్లండ్, భారత్ ద్వైపాక్షిక టెస్టుకు గుడ్ బై

**న్యూఢిల్లీ:** ఏటా ఇంగ్లండ్, భారత్ మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌కు స్వస్తి పలకాలని నిర్ణయించింది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌లో టీమిండియా పర్యటన జరగాల్సి ఉంది. అయితే ఈ సిరీస్ ఈ ఏడాది జరిగే అవకాశం కనిపించడం లేదు. ఇంగ్లండ్ గడ్డపై ఇరు జట్ల మధ్య మన్సూర్ అలీఖాన్ పటౌడీ ట్రోఫీ పేరిట 1961 నుండి ద్వైపాక్షిక టెస్టు సిరీస్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే ఈ ట్రోఫీకి గుడ్‌బై చెప్పాలని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు భావిస్తోంది. ఈ ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌ను 1961 నుండి 1975 మధ్య కాలంలో భారత్ జట్టు తరపున 46 టెస్టులు జరిగాయి. దీన్ని రద్దు చేసి దానికి బదులుగా రెండు జట్ల మధ్య మరో సిరీస్‌ను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఇక ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుండి క్రో-ధోర్స్ ట్రోఫీని నిర్వహిస్తున్నారు. ఇంగ్లండ్ పర్యటన సమయంలో భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య టెస్టు సిరీస్ 2007 నుండి పటౌడీ ట్రోఫీ పేరుతో జరుగుతోంది. భారత్ వేదికగా ఈ రెండు జట్ల మధ్య టెస్టు సిరీస్‌ను 1951 నుండి భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు నిర్వహిస్తోంది. ఈవిధంగానే భారత్-ఆస్ట్రేలియా మధ్య విజ్డెన్ ట్రోఫీతో సిరీస్‌లు జరిగాయి. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు విజ్డెన్ ట్రోఫీని రద్దు చేసి, దాని బదులుగా రెండు జట్ల మధ్య రిచర్డ్స్-బోధమ్ ట్రోఫీ పేరుతో మరో సిరీస్‌లను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం ఆయా దేశాల మధ్య నాలుగు ట్రోఫీల టెస్టు సిరీస్‌లు నిర్వహిస్తున్నాయి. ఇదే విధంగా భారత్-ఆస్ట్రేలియా మధ్య 1996 నుండి బోర్డర్ గావాస్కర్ ట్రోఫీ, వెస్టిండీస్-ఆస్ట్రేలియా మధ్య 1960 నుండి ఫ్రాంక్ వోరెల్ ట్రోఫీ, ఆస్ట్రేలియా-శ్రీలంక జట్ల మధ్య 2007 నుండి వార్న్-మురళీధరన్ ట్రోఫీ, న్యూజిలాండ్-ఇంగ్లండ్ జట్ల మధ్య 2024 నుండి క్రో-థోర్ప్ ట్రోఫీలను నిర్వహిస్తున్నాయి.

## మయామి ఓపెన్‌లో.. జోకోవిచ్ ఘోర ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రపంచ దిగ్గజం, సెర్బియాకు చెందిన నోవాక్ జొకోవిచ్‌కు ఘోర ఓటమి ఎదురైంది. 2019 తర్వాత పాల్గొన్న మయామి ఓపెన్ ఎటిపి మాస్టర్స్-1000 సిరీస్ టెన్నిస్ టోర్నీలో తన కెరీర్‌లో 100వ టైటిల్ సాధించాలని ఆశించి, పట్టుదలతో ఆడిన జొకోవిచ్‌కు చుక్కెదురైంది. ఈ టెన్నిస్ టోర్నీలో కేవలం రన్నరప్‌గానే నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 19 ఏళ్ల జాకుబ్ మెన్‌షిక్ అసాధారణ ఆట తీరు కనపరచి మోనార్క్‌కు గట్టి షాక్ ఇచ్చాడు. 2 గంటల 3 నిముషాల పాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో మెన్‌షిక్ 7-6 (7/4), 7-6 (7/4)తో గతంలో ఆరుసార్లు మయామి ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచిన జొక్‌విచ్‌ను బోల్తా కొట్టించాడు. 6 అడుగుల 4 అంగుళాల ఎత్తు, 83 కేజీల బరువు ఉన్న మెన్‌షిక్ 14 ఏస్‌లతో అదరగొట్టాడు. ఇద్దరూ తమ సర్వీస్‌లను ఒక్కోసారి కోల్పోగా, టైబ్రేక్‌లలో మెన్‌షిక్ పై చేయి సాధించి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. విజేతగా నిలిచిన మెన్‌సిక్‌కు 11,24,380 డాలర్ల (రూ.9 కోట్ల 61 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు, రన్నరప్ జొకోవిచ్‌కు 5,97,80 డాలర్ల ( రూ.5 కోట్ల 11 లక్షలు) ప్రైజ్ మనీతో పాటు, 650 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ విజయంతో మెన్‌సిక్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 30 స్థానాలు పురోగతి సాధించి కెరీర్ బెస్ట్ 24వ రాయంక్‌కు చేరుకున్నాడు.

## ఐపిఎల్ రన్ రేట్‌లో.. టాప్ ప్లేస్‌లో ఆర్సీబీ

### సెకండ్ పొజిషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 ట్రోఫీ కోసం అన్ని జట్లు తమ వేటను ఆరంభించాయి. ఇప్పటివరకు అన్ని జట్లు రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకోగా, పంజాబ్ కింగ్స్ మాత్రం ఒక మ్యాచ్ మాత్రమే ఆడింది. మరికొన్ని జట్లు మూడు మ్యాచ్‌లు కూడా ఆడేశాయి. ఇప్పటికే అన్ని జట్లు పాయింట్ల ఖాతాను ఓపెన్ చేశాయి. ఈసారైనా కప్ సాధించాలని పట్టుదలతో ఉన్నా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఘన విజయాలు సాధించి నాలుగు పాయింట్లతో టేబుల్‌లో టాప్ ప్లేస్‌లో ఉంది. రన్ రేట్ కూడా +2.266 అన్ని జట్ల కంటే చాలా ఎక్కువగా ఉంది. రెండో స్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఉంది. ఢిల్లీ కూడా రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు సాధించగా, నెట్‌రన్ రేట్ +1.320 ఆర్సీబీ కంటే తక్కువగా ఉంది. మూడోస్థానంలో లక్నో సూపర్ జెయింట్స్ ఉంది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపు, ఒక ఓటమితో రెండు పాయింట్లు సాధించింది. లక్నోకు రన్‌రేట్ +0.963 ఇతర జట్ల కంటే మెరుగ్గా ఉంది. గుజరాత్ టైటాన్స్ రెండు మ్యాచ్‌ల్లో ఒక గెలుపుతో రెండు పాయింట్లు, +0.625 రన్‌రేట్‌తో నాలుగోస్థానంలో ఉంది.

పంజాబ్ కింగ్స్ ఆడిన ఒకే మ్యాచ్‌లో విజయం సాధించి ఐదోస్థానంలో ఉంది. ముంబై ఇండియన్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా రెండు ఓటములు, ఒక గెలుపుతో ఆరోస్థానంలో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ మూడు మ్యాచ్‌లు ఆడగా, ఒక మ్యాచ్‌లోనే విజయం సాధించింది. రెండు పాయింట్లు 0.771 రన్‌రేట్‌తో ఏడోస్థానంలో కొనసాగుతుంది. మొదట మ్యాచ్‌లోనే భారీ స్కోరుతో అంచనాలు పెంచేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆ తరువాత రెండు మ్యాచ్‌ల్లోనూ దారుణంగా ఓటమిపాలైంది.

రెండు పాయింట్లు, 0.871 రన్‌రేట్‌తో 8వ స్థానానికి పడిపోయింది. రాజస్థాన్ రాయల్స్ ఒకగెలుపు, రెండుఓటములతో తొమ్మిదో స్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఒకే గెలుపుతో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో ఉంది.

## ఆర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. స్వర్ణాలతో రాణించిన జెస్సీరాజ్



**న్యూఢిల్లీ:** అర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ అమ్మాయి జెస్సీరాజ్ అద్భుత ప్రదర్శన కనపరచింది. ఆల్ రౌండర్‌గావివిధ విభాగాల్లో స్వర్ణ,రజత, కాంస్య పతకాలతో ప్రపంచదేశాల్లో భారత్‌కు గుర్తింపు తెచ్చింది. మార్చి 26వ తేదీ నుండి 31 వరకూ తైవాన్‌లో జరిగిన అర్టిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో జెస్సీరాజ్ పసిడి పతకాలతో రాణించింది. ఈ పోటీల్లో జెనెస్సీరాజ్ 2 స్వర్ణ పతకాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకాన్ని సాధించింది. సోలో డ్యాన్స్, కపుల్ డ్యాన్స్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు లభించాయి. అలాగే పెయిర్ స్కేటింగ్ విభాగంలో వెండి, ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా తైవాన్‌లో జరిగిన కార్యక్రమంలో అర్టిస్టిక్ స్కేటింగ్ చైర్మన్ అలెక్స్ వాంగ్ చేతుల మీదుగా ఈ పతకాలను జెస్సీరాజ్ అందుకుంది. కాగా జెస్సీరాజ్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏలూరు జిల్లా దెందులూరులో 9వ తరగతి చదువుతుండటం విశేషం.

# వాణిజ్యం

## సెన్సెక్స్, నిఫ్టీల భారీ పతనం

**ముంబై, ఏప్రిల్ 1:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిసాయి. అమెరికా ప్రతీకార సుంకాల భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటి, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా కుదేలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఏకంగా 1400 పాయింట్లకుపైగా నష్టపోగా, నిఫ్టీ 23,200 మార్క్ దిగువకు చేరింది. ఇన్వెస్టర్ల సంపద రూ.3.5లక్షల కోట్లు క్షీణించి రూ.409 లక్షల కోట్లకు పరిమితమైంది. ఉదయం 76,882.58 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,912.18 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరిన సూచి, చివరికి 1390.41 పాయింట్లు నష్టపోయి 76,024.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 353.65 పాయింట్లు నష్టపోయి 23,165 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, జొమాటో మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిసాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దేశీయ ఐటి కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుంది. అలాంటిది అమెరికాలో ఐటీకి ఆశించిన మేర డిమాండ్ ఉండకపోవచ్చన్న అంచనాలతో ఐటి స్టాక్స్‌లో అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇన్ఫోసిస్, ఎల్‌అండ్‌టి, హెచ్‌సిఎల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇటీవల 70 డాలర్ల వద్ద ట్రేడయిన బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర మళ్లీ 75 డాలర్ల స్థాయికి



చేరింది. భారత్ చమురును ప్రధానంగా దిగుమతి చేసుకొనే దేశం కావడంతో మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇటీవల దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుగా 8 సెషన్లలో దాదాపు 5శాతానికిపైగా పెరిగాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, రిలయన్స్ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి.


## అమ్మకాల్లో కియా అప్..హుండయ్ డౌన్



**ముంబై, ఏప్రిల్ 1:** దక్షిణ కొరియా కార్ల తయారీ దిగ్గజం కియా మోటార్స్ మార్చి నెల అమ్మకాల్లో 2.2శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశీయంగా,అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడంతో ఈ వృద్ధి సాధ్యమైందని కంపెనీ పేర్కొంది. కియా గత నెలలో 2,78,058 వాహనాలను విక్రయించగా, గత యేడాది ఇదే నెలలో 2,72,011 యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయ అమ్మకాలు 2శాతం పెరిగి 50,006 యూనిట్లకు చేరుకున్నాయి. విదేశీ అమ్మకాలు 2.2శాతం పెరిగి 2,27,724 యూనిట్లకు చేరాయి. ఈ సందర్భంగా కియా మోటార్స్ ప్రతి నిధి మాట్లాడుతూ, ఈ యేడాది మొదటి త్రైమాసికంలోనే అత్యధిక అమ్మకాలు సాధించాం. జనవరి- మార్చి మధ్య మొత్తం 7,72,351 యూనిట్లను విక్రయించాం. ఇది గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 1.6శాతం ఎక్కువ. ఇవి3, స్పోర్టేజ్, సోరెంటో వంటి కీలక మోడళ్ల హైబ్రిడ్ వెర్షన్లు గతేడాది ద్వితీయార్థంలో విడుదలయ్యాయి. ఇవి అమ్మకాలను పెంచడంలో సహాయ పడ్డాయని, తద్వారా మొదటి త్రైమాసికంలోనే అత్యధిక పనితీరును కనబరిచాం అని అన్నారు. అదే సమయంలో హుండయ్ మోటార్స్ మార్చి నెల అమ్మకాల్లో తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు క్షీణించడంతో మార్చి నెలలో హుండయ్ మోటార్స్ అమ్మకాలు 2శాతం తగ్గాయని ఆ సంస్థ తెలిపింది. గత నెలలో 3,65,812 వాహనాలను విక్రయించగా, గత సంవత్సరం ఇదే నెలలో 3,73,290 యూనిట్లు అమ్ముడయ్యాయి. దేశీయంగా 0.9శాతం వృద్ధి చెంది 63,090 యూనిట్లు విక్రయించినా, అంతర్జాతీయంగా అమ్మకాలు 2.6శాతం తగ్గి 3,02,722 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఒకే దేశానికి చెందిన రెండు కార్ల కంపెనీల అమ్మకాలలో ఇంత వ్యత్యాసం ఎందుకు కనిపిస్తోందనే దానిపై విశ్లేషకులు పలు రకాలుగా స్పందిస్తున్నారు. హుండయ్ పాత మోడల్ కార్ల అమ్మకాలపై దృష్టిపెట్టిం దని, కొత్త మోడళ్లను మార్కెట్లోకి తీసుకురావడంలో వెనుకబటి ఉందని అభిప్రాయపడుతున్నారు. దీనికి విరుద్ధంగా కియా మాత్రం సరికొత్త మోడళ్లను ఎప్పటికప్పుడు విడుదలచేస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోందని, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై దృష్టిసారించడం కియాకు కలిసొచ్చే అంశం.

## 60 నిమిషాల్లో 10 లక్షల మంది యూజర్లు

**వాషింగ్టన్, ఏప్రిల్ 1:** ఓపెన్‌ఎఐ ఆధ్వర్యంలోని చాట్‌జిపిటి కేవలం ఒకే గంటలో పది లక్షల మంది యూజర్లను సంపాదించినట్లు కంపెనీ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. కంపెనీ ఇటీవల ప్రారంభించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆర్ట్ స్టూడియో జీబ్లీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ఇలా చాట్‌జిపిటికి వినియోగదారులు పెరుగుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఆల్ట్‌మన్ తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని పంచుకున్నారు. 26 నెలల క్రితం చాట్‌జిపిటి ప్రారంభించిన సమయంలో అత్యంత క్రేజ్‌తో క్షణాల్లో ఈ ప్లాట్‌ఫామ్ వైరల్ అయి ఐదు రోజుల్లో 10 లక్షల మంది యూజర్లను సంపాదించుకున్నట్లు ఆల్ట్‌మన్ చెప్పారు. కానీ కొత్తగా ప్రవేశపెట్టిన జీబ్లీ స్టూడియో ద్వారా చాట్‌జిపిటి గతంలో కంటే మరింత వైరల్ అయి కేవలం గంటలోనే 10 లక్షల మంది యూజర్ల బేస్‌ను సంపాదించిందని వివరించారు. ప్రస్తుతానికి కంపెనీ మొత్తం వినియోగదారుల సంఖ్యను విడుదల చేయలేదు. ఈ కొత్త ఫీచర్‌ను ఓపెన్‌ఎఐ గత వారం జిపిటి-4ఓలో ప్రవేశపెట్టారు. దీని ద్వారా ఎలాంటి ఎక్స్‌టర్నల్ టూల్స్ అవసరం లేకుండా నేరుగా చాట్‌జిపిటిలోనే టెక్స్ట్, యూజర్ ఫొటోలు అప్‌లోడ్ చేసి జీబ్లీఇమేజ్‌లను



పొందవచ్చు. ఇప్పటికే చాలా మంది యూజర్లు తమసెల్ఫీలు, పెంపుడు జంతువులు, కుటుంబచిత్రాలు, చాట్‌జిపిటిలో అప్‌లోడ్ చేసి జీబ్లీ ఫొటోలను పొందుతున్నారు. వాటిని తమకు చెందిన వివిధ సామాజిక మాధ్యమ ఖాతాల్లో షేర్ చేస్తున్నారు. జీబ్లీ ఇమేజ్ క్రియేట్ చేసేందుకు అనువైన మౌలిక సదుపాయాలు కావాల్సి ఉంటుంది. దీనివల్ల భారీగా జిపియు కరిగిపోతుంది. దీనిపై కొంత ఆందోళనలు వ్యక్తమవుతున్నా కొత్త ఫీచర్‌ను ఉపయోగించాలని ఆల్ట్‌మన్ వినియోగదారులను కోరారు.

## ఎస్‌బిఐ సేవల్లో అంతరాయం

**ముంబై, ఏప్రిల్ 1:** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కస్టమర్లు ఆన్‌లైన్ సేవలతో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వెబ్‌సైట్ పర్ఫామెన్స్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డెటెక్టర్ ప్రకారం, మంగళవారం ఉదయం 8:15 గంటలకు ఈ అంతరాయం ప్రారంభమైంది. 11:45 గంటలకు సమస్య తీవ్రమై 800కంటే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. వార్షిక ముగింపు కార్యకలాపాల కారణంగా ఏప్రిల్ 1 మధ్యాహ్నం 1:100 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఇంటర్నెట్ బ్యాంకింగ్, యోనో లైట్, యుపిఐ సేవల వంటి డిజిటల్ సర్వీసులు అందుబాటులో ఉండవని, ఈ అంతరాయానికి క్షమించమని ఎస్‌బిఐ తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. డౌన్‌డెటెక్టర్ ప్రకారం సుమారు 64శాతం మొబైల్ బ్యాంకింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు, 33 లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంతరాయం నుంచి బయటపడడానికి కస్టమర్లు యుపిఐ లైట్, ఎటిఎం ఉపయోగించుకోవచ్చని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది.




## సిఎన్‌జి ధరల పెరుగుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజవాయువు ధరలను భారత్ రెండేళ్లలో తొలిసారిగా పెంచింది. ఏప్రిల్ 1 నుంచి ఎపిఎం (అడ్మినిస్ట్రేటెడ్ ప్రైసింగ్ మెకానిజం) గ్యాస్ ధరను 10 లక్షల థర్మల్ యూనిట్లకు 6.50 డాలర్ల నుంచి 6.75 డాలర్లకు పెంచినట్లు పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖకు చెందిన పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ విభాగం నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఒఎన్‌జిసి), ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లు నామినేషన్ ప్రాతిపదికన కేటాయించిన క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే సహజ వాయువును ఎపిఎం గ్యాస్ అంటారు. ఈ గ్యాస్‌ను 'అడ్మినిస్ట్రేటెడ్ ప్రైసింగ్ మెకానిజం' వద్ద వినియోగదారులకు విక్రయిస్తారు. ఇంట్లో వంట అవసరాలకు పైపుల ద్వారా సహజ వాయువుగా ఈ గ్యాస్‌ను సరఫరా చేస్తారు. ఆటోమొబైల్స్ అవసరాల కోసం కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్‌గా మారుస్తారు. ప్రభుత్వం రూపొందించిన రోడ్ మ్యాప్‌కు అనుగుణంగా రెండేళ్లలో తొలిసారి ధరల పెంపును అమలుచేశారు. 2023 ఏప్రిల్‌లో దేశీయంగా ఉత్పత్తి అయిన సహజ వాయువు ధరలను మిలియన్ థర్మల్ యూనిట్లకు 4 డాలర్లు నుంచి గరిష్టంగా 6.5డాలర్లుగా పరిమితిని విధించారు. ధరల పెంపుకు సంబంధించి నిపుణుల కమిటీ నివేదికను గతంలో కేంద్ర కేబినెట్ ఆమోదించింది. 2027 వరకు 0.5 డాలర్లు పెంచాలని సూచించింది. 2023 నుంచి రెండేళ్ల పాటు ఎలాంటి పెంపు తీసుకోలేదు. ఈ గడువు ముగియడంతో తాజాగా 0.25 డాలర్ల పెంపు అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే రెండేళ్ల పాటు రేట్లు మారవని, ఆ తర్వాత మరో 0.25 డాలర్లు పెంచాలని కేంద్ర కేబినెట్ ఇప్పటికే నిర్ణయించింది. కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ అనేది అధిక పీడనం వద్ద నిల్వ చేసి ఉపయోగించేందుకు వీలైన గ్యాస్. దీన్ని ప్రధానంగా మీథేన్, గ్యాసోలిన్, డీజిల్ లేదా బొగ్గు వంటి సాంప్రదాయ శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. కార్లు, బస్సులు, ట్రక్కులు, ఆటోరిక్షాలు సహా ఆటోమొబైల్స్‌కు ప్రత్యామ్నాయ ఇంధనంగా సిఎన్‌జిని విస్తృతంగా వాడుతున్నారు. గ్యాసోలిన్ లేదా డీజిల్, పెట్రోల్‌తో పోలిస్తే తక్కువ ఉద్గారాలు విడుదల చేస్తుంది.




## 900 ఔషధాల ధరల పెంపు!

**ముంబై, ఏప్రిల్ 1:** దేశీయంగా 900 రకాలకు పైగా ఔషధాల ధరలు ఏప్రిల్ ఒకటి నుంచి పెరిగాయి. ఈ విషయాన్ని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) ప్రకటించింది. పెరిగిన వాటి జాబితాలో యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్స్, గుండె జబ్బులు, మధుమేహానికి సంబంధించిన మందులున్నాయి. టోకు ద్రవ్యోల్బణ సూచి ఆధారంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా తయారీదారులు ఔషధాల ధరలను సవరించొచ్చు. 2023తో పోలిస్తే 2024 కేలండర్ సంవత్సరంలో నమోదైన టోకు ద్రవ్యోల్బణం ఆధారంగా, ఔషధ ధరలను గరిష్టంగా 1.74శాతం వరకు ధరలు పెరిగినట్లు ఎన్‌పిపిఎ పేర్కొంది. సవరించిన ధరల ప్రకారం యాంటీబయాటిక్ అజిత్రోమైసిన్ 250 ఎంజి ఒక్కో టాబ్లెట్ ధర రూ.11.87, 500 ఎంజి ధర రూ.23.97కు పెరిగింది. అమోక్సిసిలిన్, క్లావులానిక్ యాసిడ్ కలిగిన యాంటీబయాటిక్ డ్రై సిరప్ ధర ఒక్కో ఎంఎల్ గరిష్ట ధరను రూ.2.09గా నిర్ణయించారు. డైక్లోఫెనాక్ టాబ్లెట్ గరిష్ట ధర రూ.2.09, ఇబ్రూఫెన్ 200 ఎంజి ఒక టాబ్లెట్ ధర రూ.0.72, 400ఎంజి టాబ్లెట్ ధర రూ.1.22గా పేర్కొన్నారు. దీంతో పాటు డయాబెటిస్, గుండెజబ్బులకు సంబంధించిన ధరలను స్వల్పంగా పెంచి వాటి గరిష్ట పరిమితులను ఎన్‌పిపిఎ తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.